అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శనివారం 10 -3 -2018

సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 4 సంచిక : 71 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 5.00

పెట్టుబడి పథకం పేరు రైతులక్ష్మీ!

సీఎం కేసీఆర్ ఆమోదం

- ఏప్రిల్ 20 నుంచి మే 15 వరకు 3 దశల్లో చెక్కుల పంపిణీ
- రూ.50వేలు దాటితే రెండో చెక్కు
- త్వరలో ఉత్తర్వులు

వివరాలు 3లో

పెట్టుబడి పథకం అమలు ఆలోచన లేదు

- కేంద్ర ప్రభుత్వం వెల్లడి

వివరాలు 9లో

పార్లమెంట్‌లో ప్రతిష్టంభన



పట్టువీడని విపక్షాలు

- ప్రాంతీయ పార్టీల డిమాండ్లపై కేంద్రం మౌనం
- ఉభయసభలు 12వ తేదీకి వాయిదా

వివరాలు 2లో

ఎండుతోంది

పొట్ట దశలోనే మాడిపోతున్న వరిపంట

'రబీలో ఒక్క ఎకరం కూడా ఎండనివ్వం' ముఖ్యమంత్రి కేసీఆర్, భారీనీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు చెప్పిన మాటలివి. కానీ, క్షేత్రస్థాయిలో ఒకటి కాదు..రెండు కాదు..వందల ఎకరాల్లో వరి పంట ఎండిపోతున్నది. ఒకవైపు భూగర్భ జలాలు అడుగంటి.. మరో వైపు రిజర్వాయర్ల ద్వారా నీటి సరఫరా లేక పొట్టకొచ్చిన వరి పంట ఎండి రైతులు బోరుమంటున్నారు.



జనగామలో..

- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- బోరుమంటున్న రబీ రైతు

నవతెలంగాణ-జనగామ ప్రతినిధి

ఈ ఏడాది రాష్ట్రంలో వరి సాగు భారీగా పెరిగింది. రబీలో 12.56 లక్షల హెక్టార్లలో పంటలు సాగవ్వగా అందులో 7.41 లక్షల హెక్టార్లలో వరి పంటే ఉంది. మొత్తం పంటలో 59శాతం. వరి పంటపై రైతులు మక్కువ చూపగా గత జనవరి ఒకటో తేదీ నుంచి ఫిబ్రవరి ఒకటి వరకు 10.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావల్సి ఉండగా 2.5 మిల్లీ మీటర్లు మాత్రమే నమోదైంది. వరి సాగు పెరగగా వర్షాలు లేకపోవడం, భూగర్భ జలాలు పడిపోవడం, దీనికి తోడు 24 గంటల విద్యుత్ సరఫరాతో బావులు, బోర్లలో నీటిమట్టం తగ్గడం మూలంగా వరిపైర్లు ఎండిపోతున్నాయి.

పక్కనే రిజర్వాయర్ ఉన్నా ఎండుతున్న వరి పంట

జనగామ జిల్లా రఘునాథపల్లి మండలంలో దేవాదుల ప్రాజెక్టులో భాగంగా అశ్వరావుపల్లి రిజర్వాయర్ నిర్మించారు. రిజర్వాయర్‌కు రెండు కిలోమీటర్ల దూరంలో వెల్ది గ్రామముంది. ఈ గ్రామంలో 1100 నివాసాలు ఉండగా రెండు వేల ఎకరాల సాగు భూముంది. రబీలో 450 ఎకరాల్లో వరి నాటారు. గ్రామాన్ని ఆనుకొని ఉన్న నాగులమ్మ కుంట కింద 50 ఎకరాల్లో 20 మందికి పైగా రైతులు వరి సాగు చేస్తున్నారు. నాగులమ్మ కుంటను మిషన్‌కాకతీయ మూడో విడత కింద రూ.16 లక్షలతో ...9లో



మాట్లాడుతున్న ప్రకాశ్‌కరత్

బీజేపీ హింస, ఉన్మాదాన్ని.. ఉపేక్షించం

త్రిపుర దాడులను ప్రజా పోరాటాలతో తిప్పికొడతాం..

- 1993 నాటి కాంగ్రెస్ అనుభవాలు మరువొద్దు
- వామపక్ష కూటమికి మద్దతుగా నిలిచిన వారిని భయపెట్టేందుకే ఈ దాడులు : ఢిల్లీ నిరసన కార్యక్రమంలో పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్‌కరత్

వివరాలు 9లో

కారుణ్య మరణాలకు సుప్రీం ఓకే

- చట్టం చేసే వరకూ మార్గదర్శకాలు
- గౌరవనీయంగా మరణించే హక్కు ఉండాల్సిందే : చీఫ్ జస్టిస్ దీపక్‌మిశ్రా

న్యూఢిల్లీ: కారుణ్య మరణాలకు అనుమతి ఇస్తూ సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పును వెల్లడించింది. నయంకాని రోగాలతో బాధపడేవారు కారుణ్య మరణాలను కోరితే అనుమతించాలంటూ కామన్ కాజ్ అనే స్వచ్ఛంద సంస్థ వేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్‌మిశ్రా నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం శుక్రవారం తీర్పు వెల్లడించింది. అయితే, ఇలాంటి కేసుల్లో ముందస్తు సమ్మతి లేదా సజీవ వీలునామా అవసరమంటూ సుప్రీంకోర్టు కొన్ని మార్గదర్శకాలను నిర్దేశించింది. దీనిపై కేంద్ర ప్రభుత్వం ఓ చట్టం చేసే వరకూ తమ మార్గదర్శకాలు అమలులో ఉంటాయని సుప్రీంకోర్టు తెలిపింది. మనుషులకు గౌరవంగా మరణించే హక్కు ఉంటుందని ...9లో

కనీస వేతనాలివ్వండి..

జీవో 167 సవరించాలని డిమాండ్

కలెక్టరేట్ల ఎదుట ఆశాల ధర్నాలు

వివరాలు 9లో

- ఈ నెల 16న చలో హైదరాబాద్‌కు పిలుపు



కొత్త గూడెంలో ర్యాలీ..

నా పుట్టుక.. చావు టీఆర్ఎస్‌తోనే

కేసీఆర్ మాటే నా బాట

- నాపై దుష్ప్రచారాన్ని సహించబోను : విలేకరుల సమావేశంలో మంత్రి హరీశ్‌రావు
- తనపై సోషల్ మీడియాలో పోస్టింగులపై ఆగ్రహం
- డీజీపీ మహేందర్‌రెడ్డికి ఫిర్యాదు

వివరాలు 9లో



పెండ్లింట విషాదం

చెట్టును ఢీకొన్న ఇన్నోవా వాహనం

- పెండ్లి కుమారుడు సహా ఐదుగురు మృతి
- వధువు, మరొకరికి తీవ్ర గాయాలు
- క్షేమంగా బయటపడిన ముగ్గురు చిన్నారులు

వివరాలు 9లో





అనుమతి ఎందుకు నిరాకరిస్తున్నారు..

స్ఫూర్తి మిలియన్ మార్చ్ నిర్వహించి తీరుతాం

- కేసీఆర్‌దిఅప్రజాస్వామిక పాలన: ప్రొఫెసర్ కోదండరామ్

6



నాపై జైల్లో హత్యకు కుట్ర

- దళితుడు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాడా ? అన్న కోణంలోనే..

వివరాలు 9లో

- కుట్రలో ఇద్దరు మంత్రులు.. ఒక ఎమ్మెల్యే : కృష్ణ మాదిగ

కెమికల్ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం

- భారీగా ఆస్తినష్టం
- కార్మికులకు తప్పిన ప్రాణాపాయం

9



గౌరీ లంకేశ్ హత్య కేసులో..
హిందూ యువ సేన నేతే నిందితుడు

- ధ్రువీకరించిన సిట్

బెంగళూరు: జర్నలిస్టు గౌరీ లంకేశ్ హత్య కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్).. మితవాద సంస్థ హిందూ యువ సేన వ్యవస్థాపకుడు నవీన్ కుమార్‌ను ఈ హత్య కేసులో నిందితుడిగా ధ్రువీకరించింది. దీంతో నిందితుడిని ఐదు రోజుల సిట్ కస్టడీకి బెంగుళూరు మెజిస్ట్రేట్ కోర్టు శుక్రవారం పంపించింది. కర్నాటకలో మండ్యా జిల్లాలోని మద్దూర్‌కు చెందిన నవీన్ కుమార్ అలియాస్ హొట్టె మాంజను చట్టవిరుద్ధంగా బుల్లెట్‌లను కలిగి ఉన్నాడని గతనెల 18న పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఆర్మ్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేసిన నిందితుడిని కోర్టు.. జ్యూడిషియల్ కస్టడీ రిమాండ్‌కు పంపింది. అయితే ఈ నెల 2న నిందితుడిని విచారించడానికి సిట్ తన కస్టడీలోకి తీసుకుంది. గౌరీ లంకేశ్ హత్యకేసులో నవీన్ కుమార్‌ను నిందితుడిగా చేరుస్తూ అరెస్టు చేశామని ఇన్వెస్టిగేటింగ్ ఆఫీసర్ డీసీపీ ఎం ఎన్ అనుచెత్ వెల్లడించారు.

రైతు సంఘం నేతను చెప్పుతో కొట్టిన బీజేపీ మహిళా నేత

- అసభ్య పదజాలం వాడారని ఆరోపణ

చెన్నై : తనను దూషించాడనే ఆరోపణతో బిజెపి మహిళా నేత నెల్లాయ్ అమ్మల్ రైతు సంఘం నాయకుడు అయ్యకన్నుపై చెప్పుతో దాడి చేసిన ఘటన తమిళనాడులో చోటుచేసుకుంది. మొబైల్ ఫోన్‌లో తీసిన వీడియో సోషల్ మీడియాలో షేర్ చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. గత సంవత్సరం ఢిల్లీలో జరిగిన రైతుల ఆందోళనకు అయ్యకన్ను నాయకత్వం వహించారు. కాగా, టుటి కోరియన్‌లోని తిరుచేందర్ మురుగున్ దేవాలయం వెలుపల ఆయన కరపత్రాలను పంచుతున్న సమయంలో అక్కడకు వచ్చిన ఆమె ఆయనను మోసకారని దూషించారు. దీంతో వారిద్దరీ మధ్య వాగ్వాదం జరుగుతుండగా, ఆమె తన చెప్పుతో అతనిపై దాడి చేసింది.

పౌరోహిత్యం నిర్వహించిన మహిళ

- కన్యాదాన సాంప్రదాయం లేకుండానే వివాహం

కోల్‌కతా: పితృస్వామ్య సమాజంలో మహిళ పౌరోహిత్యాన్ని చేపట్టి వివాహం జరిపించడం సంచలనమైతే.. అందులో కన్యాదాన సాంప్రదాయం లేకుండానే ఆ వివాహాన్ని జరిపించడం సాహసమే. పితృస్వామ్య లక్షణమైన కన్యాదానాన్ని నిర్మూలించాలన్న లక్ష్యంతో ఉన్న నందిని భౌమిక్ ఈ వివాహాన్ని కోల్‌కతాలో చేశారు. జాదవ్‌పూర్ యూనివర్సిటీలో సంస్కృతాన్ని బోధిస్తున్న నందిని పౌరోహిత్య బాధ్యతలు స్వీకరించి అన్విత జనార్ధన్, ఆర్కా భట్టాచార్యల వివాహాన్ని గతనెల 24న జరిపించారు. నందినితోపాటు ఆమె బృంద సభ్యులు రుమా రాయ్, బెనర్జీ, పౌలమీ చక్రబొర్తిలు ఇందులో పాల్గొన్నారు.

బాలికలపై లైంగికదాడులకు పాల్పడితే...
మరణ శిక్షే

- చట్టం చేసిన రాజస్థాన్

జైపూర్: రాజస్థాన్‌లో బాలికలపై వరుసగా లైంగికదాడులు పెరిపోతున్నందున.. ఇక నుంచి 12 ఏండ్ల లోపు బాలికలపై లైంగికదాడులకు పాల్పడే వారికి మరణశిక్ష విధించనున్నారు. అలాగే కనీసంగా 14 యేండ్లు కారాగార శిక్ష విధించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చట్టం చేసింది. రాష్ట్రంలో లైంగికదాడుల వల్ల బాలికల పరిస్థితి అగమ్యగోచరంగా మారిపోతోందని.. వాటిని అరికట్టేందుకే ఈ చట్టం చేశామని ప్రభుత్వం తెలిపింది. ఇలాంటి దాడులను ఉక్కుపాదంతో అణిచివేయడం తమ ప్రధాన కర్తవ్యం అని పేర్కొంది. కాగా, లైంగికదాడులకు పాల్పడే వారికి మరణ శిక్ష విధించిన రెండో రాష్ట్రం రాజస్థాన్. ఇటీవలే మధ్యప్రదేశ్ ఈ చట్టం చేసింది. హర్యానాలో ఈ బిల్లు పెండింగ్‌లో ఉంది.

దళిత మహిళ సజీవ దహనానికి యత్నం

లక్నో : తమ వద్ద అప్పుగా తీసుకున్న రూ.20 వేలను తిరిగి చెల్లించలేదన్న కారణంతో కొందరు దుండగులు ఒక దళిత మహిళను సజీవ దహనం చేసేందుకు యత్నించిన ఘటన ఉత్తర ప్రదేశ్‌లో చోటు చేసుకుంది. రాష్ట్రంలోని బాలియాలోని జాజౌలి గ్రామంలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఇద్దరిని అరెస్టు చేసినట్టు శుక్రవారం పోలీసులు తెలిపారు. రేష్మా దేవి (45) తన ఇంటిలో నిద్రిస్తుండగా గురువారం ఈ సంఘటన జరిగింది. కొంతమంది దుండగులు ఆమెపై కిరోసిన్ పోసి నిప్పంటించారని ఎస్పి అనిల్ కుమార్ సింగ్ తెలిపారు. గాయపడిన రేష్మాను ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి నిలకడగానే ఉన్నదని వైద్యాధికారులు తెలిపారు.

కెమికల్ ఫ్యాక్టరీలో భారీ పేలుడు

- దావానలంలా వ్యాపించిన మంటలు
- ముగ్గురు మృతి, 13మందికి తీవ్రగాయాలు

ముంబయి: మహారాష్ట్రలో పాల్ఘర్‌లోని ఓ కెమికల్ ఫ్యాక్టరీలో గురువారం రాత్రి భారీ పేలుడు సంభవించింది. దాదాపు 10 కిలోమీటర్ల పరిధిమేర పేలుడు శబ్దం వినిపించింది. ఈ పేలుడు అనంతరం మంటలు దావానలంలా పొరుగున్న మరో ఐదు ఫ్యాక్టరీలోకి వ్యాపించాయి. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందగా, ముగ్గురు పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నది. మరో పది మంది తీవ్రంగా గాయపడ్డారు. నోవాఫీన్, యూనీమాక్స్, ప్రాచీ, ఆర్తి, భారతి రసాయన్, దర్బార్ ఫ్యాక్టరీలు ఈ పేలుడు ధాటికి ప్రభావితమయ్యాయి. నోవాఫీన్ ఫ్యాక్టరీలో మొదటి బ్లాస్ట్ సంభవించినట్టు భావిస్తున్నారు. చాలా వరకు మంటలు అదుపులోకి వచ్చాయని, కొన్ని ప్రాంతాల్లో ఇంకా కొనసాగుతున్నాయని ఓ పోలీసు అధికారి తెలిపారు. చుట్టుపక్కల ఉన్న ఫ్యాక్టరీల్లో కెమికల్ డ్రంబులుండటం చేత మంటలు వేగంగా వ్యాపించాయని వివరించారు. ఘటనాస్థలానికి ఫైర్ ఇంజన్‌లు చేరుకుని మంటలు ఆర్పుతున్నాయి. ప్రముఖ తారాపూర్ అటామిక్ పవర్ స్టేషన్ ఘటనాస్థలానికి దాదాపు 20కిలోమీటర్ల దూరంలో ఉండటం గమనార్హం. అయితే పేలుడు సంభవించడానికి కారణాలు తెలియరాలేదని పోలీసు అధికారి ప్రమోద్ పవార్ తెలిపారు. పేలుడును భూకంపమనుకుని స్థానికులు భయాందళనలతో వీధుల్లోకి వచ్చారు.

మాట వినట్లేదని..

చెన్నై: తన మాట వినట్లేదని కాలేజీ విద్యార్థినిపై అతి కిరాతకంగా దాడి చేసి హత్య చేసాడో దుర్మార్గుడు. ఈ ఘటన చెన్నైలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మధురావోయిల్‌కు చెందిన అశ్విని మోహన్ (19) మీనాక్షి కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతుంది. తన తండ్రి చనిపోవడంతో తల్లితో కలిసి ఉంటుంది. ఎప్పటిలాగే కాలేజీకి వెళ్లిన అశ్విని... కాలేజీ నుంచి బయటకు రాగానే అలగేశన్ (25) ఆమెతో వాగ్వాదానికి దిగాడు. మాట వినకపోవడంతో కత్తితో ఆమెపై దాడి చేశాడు. రక్తపు మడుగులో పడి ఉన్న ఆమెను చూసి అక్కడి నుంచి పారిపోవడానికి ప్రయత్నిస్తున్న అలగేశన్‌ను స్థానికలు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. గత నెల 16న అశ్వినితో తనకు పెండయ్యిందని అలగేశన్ ఆరోపిస్తుండగా.. బాధితురాలి బంధువులు దీనిని తిరస్కరించారు.



పట్టుకోవడానికి వచ్చిన అటవీశాఖ సిబ్బందిపై పంజా విసురుతున్న చిరుతపులి

ఉత్తరాఖండ్‌లో
అంబేద్కర్ విగ్రహం ధ్వంసం



డెహ్రాడూన్: దేశంలో విగ్రహాల ధ్వంసం ఇప్పట్లో ఆగేలా లేదు. త్రిపురలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత.. కమ్యూనిస్టు యోధుడు లెనిన్ విగ్రహం కూల్చివేతతో మొదలైన ఈ విధ్వంసం దేశవ్యాప్తంగా కొనసాగుతున్నది. అదే క్రమంలో ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో భారతరత్న డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని శుక్రవారం గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. దీనిని గమనించిన స్థానికులు తిరిగి కొత్త విగ్రహాన్ని నెలకొల్పారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. కాగా, చెన్నైలో అంబేద్కర్ విగ్రహానికి రంగు పూసిన వ్యక్తులు మతిస్థిమితం లేని వారని పోలీసులు తేల్చారు. రెండు రోజుల క్రితం మీరట్‌లోని మవానాలో దుండగులు అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే.



పార్లమెంట్‌లో ప్రతిష్టంభన...

పట్టువీడని విపక్షాలు

- ప్రాంతీయ పార్టీల డిమాండ్లపై కేంద్రం మౌనం
- ఉభయసభలు 12వ తేదీకి వాయిదా

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

పార్లమెంట్ బడ్జెట్ రెండో విడత సమావేశాల్లో ప్రతిష్టంభన వీడటం లేదు. విపక్షాల డిమాండ్లపై కేంద్రం మౌనం దాల్చడంతో ఉభయసభల్లో ఆందోళన పర్వం నెలకొంది. ప్రధానంగా ప్రాంతీయ పార్టీలైన టీఆర్ఎస్, టీడీపీ, వైసీపీ, అన్నాడీఎంకే, శివసేన ఎంపీలు లేవనెత్తుతున్న అంశాలపై కేంద్రమంత్రులెవరూ సంతృప్తికరమైన సమాధానం చెప్పడం లేదు. దీంతో వరుసగా ఐదో రోజూ ఉభయసభల కార్యక్రమాలు తుడుచుపెట్టుకుపోయాయి. జనాభా నిష్పత్తిన రిజర్వేషన్ కోటా పెంచాలని టీఆర్ఎస్ ఎంపీలు అటు పార్లమెంట్ లోపల, బయట తమ పోరాటాన్ని ఉదృతం చేశారు. శుక్రవారం ఉదయం పార్లమెంట్ పరిసరాల్లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద టీఆర్ఎస్ ఎంపీలు ఆందోళన చేపట్టారు. లోక్‌సభలోనూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ సభా కార్యక్రమాలు అడ్డుకున్నారు. మరోవైపు ప్రత్యేక హోదాపై టీడీపీ, వైసీపీ, కావేరీబోర్డుపై అన్నాడీఎంకే, పీఎన్‌బీ స్కాంపై కాంగ్రెస్, వామపక్షాలు, టీఎంసీ పట్టుబట్టాయి. దీంతో ఉభయసభలు సోమవారానికి వాయిదా పడ్డాయి. ఈ సమావేశాల్లో 2018-ఆర్థికబిల్లుతో పాటు వివిధ మంత్రిత్వశాఖల పద్దులను ఆమోదించాల్సి ఉంది.



శుక్రవారం ఉదయం లోక్‌సభ ప్రారంభమైన వెంటనే పార్లమెంట్ కార్యకలాపాలను పరిశీలించేందుకు భారత్‌కు వచ్చిన దక్షిణ కొరియా పార్లమెంటరీ బృందానికి స్పీకర్ సుమిత్రా మహాజన్ స్వాగతం పలికారు. అనంతరం ఇటీవల కాలంలో చనిపోయిన మాజీ ఎంపీలకు సభ సంతాపం ప్రకటించింది. ఆ వెంటనే టీడీపీ, టీఆర్ఎస్, అన్నాడీఎంకే ఎంపీలు ప్లకార్డులతో వెల్‌లోకి దూసుకొచ్చారు. తమ డిమాండ్లపై నినదాలు చేశారు. ప్రత్యేక హోదా హామీని విస్మరించినందుకు నిరసనగా కేంద్రమంత్రి పదవికి రాజీనామా చేసిన అశోక్‌గజపతి రాజు లోక్‌సభ వెల్‌లో టీడీపీ ఎంపీలతో కలిసి నిరసనలో పాల్గొన్నారు. కావేరీ బోర్డుతో డిమాండ్‌తో పాటు పెరియర్ ఫోటోలతో కూడిన ప్లకార్డులను తమిళనాడు ఎంపీలు ప్రదర్శించారు. ఇదే సమయంలో పీఎన్‌బీ స్కాంపై కాంగ్రెస్, సీపీఐ(ఎం), టీఎంసీ ఎంపీలు వెల్‌లో నినదించారు. దీంతో సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. ఆ తరువాత కూడా పరిస్థితిలో మార్పులేకపోవడంతో సోమవారానికి వాయిదా వేశారు.

పెద్దల సభలోనూ విపక్షాల నిరసన...

విపక్షాల నిరసనతో పెద్దల సభలోనూ కార్యకలాపాలు స్తంబించిపోయాయి. తమ డిమాండ్లపై టీడీపీ, అన్నాడీఎంకే, కాంగ్రెస్ సభ్యులు వెల్‌లో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. దీంతో సభ సమావేశమైన పది నిమిషాల్లోనే 2.30 నిమిషాలకు వాయిదా పడింది. ఆ తరువాత ప్రారంభమైన ప్రయివేటు సభ్యుల సమావేశానికి సైతం విపక్షాల ఆందోళన సెగ తగిలింది. విపక్షాలు తమ ఆందోళనను కొనసాగించడంతో డిప్యూటీ చైర్మెన్ కురియన్ సోమవారానికి వాయిదా వేశారు.

గొంతు నొక్కుతున్నారు
మోడీపై సోనియా ఆగ్రహం

- 13న ప్రతిపక్ష నేతలతో విందు సమావేశం

న్యూఢిల్లీ : ఎన్‌డీఏ అధికారంలోకి వచ్చిన తర్వాతనే అభివృద్ధి జరిగిందని మోడీ చెప్పుకుంటున్నారని, 2014 ముందు వరకు దేశంలో అభివృద్ధి జరగలేదా? అని కాంగ్రెస్ నేత సోనియా ప్రశ్నించారు. ఇలా అనడం దేశ ప్రజల మేధస్సును అవమానించడమే కాగలదని ఆమె అన్నారు. 'మా స్వేచ్ఛ దాడికి గురవుతోంది. ఈనాడు తిరోగమన దృష్టి కొనసాగుతోంది. పార్లమెంట్ అనేది పరస్పరం అభిప్రాయాలను పంచుకునే వేదిక. ఇక్కడ మనల్ని మాట్లాడేందుకు అనుమతినివ్వకపోతే ఇక అర్థం ఏముంది?" అని ఆమె ప్రశ్నించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, మాజీ ప్రధాన మంత్రి వాజ్‌పేయిల వ్యవహార శైలిలో వున్న వ్యత్యాసంపై ఆమె వ్యాఖ్యాన్నిస్తూ, పార్లమెంటరీ ప్రక్రియ పట్ల వాజ్‌పేయికి అమితమైన గౌరవముండేదన్నారు. కాంగ్రెస్‌ను ముస్లిం పార్టీగా చూపించేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని అన్నారు. ప్రజలతో సంబంధాలు ఏర్పరచుకోవడంలో కాంగ్రెస్ కొత్త విధానాన్ని అవలంబించాల్సిన అవసరం వుందని అన్నారు. బిజెపికి వ్యతిరేకంగా ఐక్య ఫ్రంట్ ఏర్పాటుకు తాజాగా ప్రయత్నాలు చేసే క్రమంలో ఈ నెల 13న విందుకు రావాలని ప్రతిపక్ష పార్టీల నేతలను సోనియా ఆహ్వానించారు.

పెరిగిపోతున్న కుబేరుల సంఖ్య

నైట్ ఫ్రాంక్స్ వెల్త్ నివేదిక

న్యూఢిల్లీ దేశంలో కోటీశ్వరుల సంఖ్య మాత్రం ఏటా పెరిగిపోతూనే ఉంది. గడచిన అయిదేండ్లలో 50 కోట్ల డాలర్లు (రూ. 3260 కోట్లు) విలువ చేసే సంపద మూటకట్టుకున్న వారి సంఖ్య 43 శాతం పెరిగిపోయినట్టు నైట్ ఫ్రాంక్ వెల్త్ సంపద మదింపు సంస్థ వెల్లడించింది. దేశ జనాభాలోని అయిదు శాతం మంది సంపన్నుల దగ్గర 64 శాతం సంపద పోగుపడినట్టు ఈ సంస్థ లెక్కించింది. 2017లో ఈ స్థాయి కుబేరులు దేశంలో 200 మందికి చేరుకున్నారు. అంతకుముందు సంవత్సరంలో వీరి సంఖ్య 170 మాత్రమే. అంటే వీరి సంఖ్యలో 18 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. ఈ సందర్భంలోనే ఇలాంటి సూపర్ రిచ్ సంపన్నుల పెరుగుదల గత అయిదేండ్లలో 43 శాతం కాగా వచ్చే అయిదేండ్లలో ఇది 70 శాతం వరకు పెరుగుతుందని అంచనా. 50 కోట్ల డాలర్లకన్నా తక్కువగా 5 కోట్ల డాలర్లు (రూ. 325 కోట్లు) సంపద కూడబెట్టుకున్న వారు 2017లో 2920 మంది ఉన్నారు. వీరి సంఖ్య 2022 నాటికి 4980 మందికి చేరవచ్చునని ఆ నివేదిక తెలియజేసింది. 2017-22 మధ్య కాలంలో ఆసియా మొత్తంలో ఇలాంటి నయా కుబేరుల సంఖ్య పెరుగుదలను అంచనా వేసినప్పుడు చైనాలో 194 శాతం, ఫిలిప్పీన్స్‌లో 84 శాతం, ఇండియాలో 71 శాతం ఉంటుందని ఈ సంస్థ లెక్కకట్టింది. ఇక కేవలం 50 లక్షల డాలర్లు (రూ. 32.5 కోట్లు) అంతకన్నాఎక్కువ సంపాదించే వారి సంఖ్య మన దేశంలో 47,720కి పెరిగిపోతుందని, గడచినఅయిదేండ్లలో 56 శాతం పెరగ్గా వచ్చే అయిదేండ్లలో 71 శాతం వరకు పెరిగిపోతుందని అంచనా వేసింది. దేశంలో సగటు సంపదను 5976 డాలర్లు (రూ. 3,89,606)గానూ, మీడియం సగటు 1295 డాలర్లు (రూ. 84,427)గానూ అంచనా వేసింది. మన దేశంలో సంపన్నుల సంపద విలువ ప్రపంచంలోని ఇతర దేశాలతో పోలిస్తే అన్నిటికన్నా వేగవంతంగా పెరిగిపోతున్నట్టు తెలియజేసింది. ఉదాహరణకు గత అయిదేండ్లలో ప్రపంచవ్యాప్తంగా సంపన్నుల పెరుగుదల 20 శాతం కాగా, మన దేశంలో మాత్రం 56 శాతం ఉంది. ఒక్క 2016-17లోనే ఈ పెరుగుదల 21 శాతం ఉన్నట్టు తేల్చింది.

రవిశంకర్‌పై కేసు నమోదు

హైదరాబాద్ : ముస్లింల మనోభావాలు కించపరిచారంటూ ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు రవి శంకర్ పై కేసు నమోదయ్యింది. అయోధ్య అంశంపై రెచ్చగొట్టే విధంగా మాట్లాడి ముస్లింల మనోభావాలను గాయపరిచారన్న ఆరోపణలతో ఫిర్యాదు అందిన నేపథ్యంలో ఆయనపై కేసు నమోదైంది. అయోధ్య వివాదానికి పరిష్కారం కనుగొనేందుకు ప్రయత్నిస్తున్న ఆధ్యాత్మిక గురు శ్రీ శ్రీ రవి శంకర్‌పై దర్సగహ్‌జిహాద్ ఓ షహదత్ (డిజెఎస్) దాఖలు చేసిన ఫిర్యాదుకు సంబంధించి రవి శంకర్‌పై కేసు నమోదయ్యిందని మొఘల్‌పురా పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆర్. దేవేందర్ తెలిపారు. అయోధ్య వివాదం నేపథ్యంలో ముస్లింల మనో భావాలను, విశ్వాసాలను గాయ పరుస్తూ రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యానించారని ఫిర్యాదుదారు ఆరోపించారు. అయోధ్యలో మందిర నిర్మాణానికి వ్యతిరేకంగా కోర్టు తీర్పు వస్తే దేశంలో రక్తపాతం జరుగుతుందని, సిరియా తరహా పరిణామాలు సంభవిస్తాయని పటిషనర్ పేర్కొన్నారు.

మోడీకి నిరసన సెగ





ఆందోళన చేస్తున్న రైతులకు మద్దతుగా నల్లజెండాలు ప్రదర్శించిన యువకులు

జైపూర్ : ప్రధాన మంత్రి మోడీ సభలో యువకులు నల్లజెండాలు ప్రదర్శించి నిరసన తెలిపారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ రాజస్థాన్‌లో వరుస ఆందోళనలు చేస్తున్న రైతులకు మద్దతుగా, మోడీ సభకు బయలుదేరిన రైతులను అడ్డుకున్నందుకు నిరసనగా ఆ యువకులు మోడీకి నల్లజెండాలను ప్రదర్శించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాజస్థాన్‌లోని రాజస్థాన్‌లోని ఝుంఝులో జరిగిన సభలో మోడీ పాల్గొన్న విషయం తెలిసిందే. కాగా, గతేడాది సెప్టెంబరు నుంచి వరుస ఆందోళనలు చేస్తున్న రైతులు మోడీ రాష్ట్ర పర్యటన సందర్భంగా ఆయనను కలసి తమ వినతిపత్రాన్ని అందచేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో రైతులపై రాష్ట్ర బీజేపీ ప్రభుత్వం నిర్బంధకాండకు పూనుకుంది. ఈ నెల ఒకటి నుంచి 9 వరకూ రాష్ట్రంలోని కొన్ని ముఖ్యప్రాంతాల్లో 144వ సెక్షన్ విధించింది. అయినా ప్రభుత్వం రైతులను ఆపలేకపోయింది. ప్రభుత్వం ఎన్ని నిర్బంధాలు విధించినా.. తమ ఆందోళనను ఆపలేదని ప్రకటించిన రైతులు... వివిధ ప్రాంతాల నుండి వెయ్యిమంది గురువారం ఆ ప్రాంతానికి చేరుకున్నారు. మోడీ బహిరంగ వేదిక వద్దకు ర్యాలీగా వస్తున్న రైతులను ఝుంఝు ప్రవేశమార్గం వద్ద అంటే.. మోడీ సమావేశ ప్రాంగణానికి 500 కిలోమీటర్ల దూరంలో పోలీసులు అడ్డుకున్నారు. బారికేడ్లను ఛేదించుకుని ముందుకు వెళ్ళబోయిన రైతులను అరెస్టుచేశారు. మిగిలిన కొద్ది మంది రైతులు అక్కడే సభ నిర్వహించారు. ఏఐకేఎస్ నేతలు అమ్రారామ్, పిమరామ్, చగాన్ చావడి, నిర్మల్ కుమార్ తదితర నాయకులు అక్కడి రైతులనుద్దేశించి ప్రసంగించారు.

2017 సెప్టెంబరు నుంచి రైతుల ఆందోళనలు

రుణమాఫీ, రైతులకు పెన్షన్, కనీస మద్దతు ధర కోరుతూ రాజస్థాన్‌లో రైతులు 2017 సెప్టెంబరు నుంచి వరుస ఆందోళనలు చేస్తున్నారు. వసుంధర రాజే ప్రభుత్వం రాతపూర్వక హామీతో సెప్టెంబరులో 13 రోజులపాటు సాగిన ఆందోళనకు రైతులు తాత్కాలికంగా బ్రేక్ వేశారు. ఇచ్చిన వాగ్దానాన్ని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని ఆ తర్వాత శాంతియుత ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. ఫిబ్రవరి 22న 'జైపూర్ కూచ్' కార్యక్రమానికి రైతు సంఘాలు పిలుపునిచ్చాయి. కాగా రైతులు జైపూర్‌కు చేరుకోకుండా వివిధ ప్రాంతాల్లో వందలాది మంది రైతులను ప్రభుత్వం ఎక్కడికక్కడ అరెస్టులు చేసింది. తమ నాయకులు జైళ్లలో ఉన్నప్పటికీ, వారు ఆందోళనను కొనసాగించారు. మోడీ సమావేశంలో తమ సమస్యలను విన్నవించుకోవాలని చేస్తున్న ప్రయత్నాలను కూడా రాజస్థాన్ సర్కార్ అడ్డుకుంది.

మహిళ అంటే అంత హీనమా?

వ్యాపారం, ఉద్యోగాల్లో మహిళలకు దక్కని చోటు

- ఆర్థికంగా ఆదుకోని ప్రభుత్వాలు, అక్కున చేర్చుకోని సమాజం
- మాటలకే పరిమితమవుతోన్న మన నాయకులు
- ఆరోగ్యపరంగా, మానసికంగా కూడా బలహీనమవుతోన్న భారత మహిళ : యూఎన్‌ఓ కార్మిక నివేదిక, అసోచాం, మాస్టర్ కార్డ్ ఇండెక్స్ నివేదికల్లో వెల్లడైన పలు అంశాలు

కడవేర్గు

"మానవ చరిత్రను పరిపూర్ణం చెయ్యడానికి ఎన్నో త్యాగాలు చేసిన మహిళలకు.. ఇప్పటికీ సముచిత స్థానం దక్కలేదు" అంటూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గౌరవ ప్రధాని ఎంతో బాధపడిపోయారు. ఐతే, గత నాలుగేండ్లుగా పాలనను వెలగబెడుతోన్న కాషాయదళాలు మహిళలకు చేసిన మేలేంటో బహిరంగ రహస్యమే! ఈ విషయమై ఇప్పటికే, ఎన్నో అధ్యయనాలు కేంద్ర ప్రభుత్వాన్ని తూర్పారబట్టాయి కూడా! కాగా, భారతదేశంలో మహిళా వ్యాపారవేత్తలు ఎదుర్కొంటున్న సవాళ్లు, స్త్రీలల్లో పోషకాహారలోపం, మానసిక సంఘర్షణ తదితర అంశాలు "మహిళా దినోత్సవం" సాక్షిగా వివిధ నివేదికల ద్వారా వెలుగులోకి రావడం ఆందోళనను కలిగిస్తోంది. ఆ నేపథ్యంపై 'నవతెలంగాణ' ప్రత్యేక కథనం..

"మనిషి పుట్టుకకూ, అస్తిత్వానికి, సంస్క తి పునరుజ్జీవానికీ.. సకలకళా ప్రవీణగా.. పోరాటాల ఫలప్రదాతగా ఉన్న ఓ మహిళా.. నీకిదే మా వందనం" అంటూ స్త్రీ గొప్పతనాన్ని మాటలకే పరిమితం చేస్తున్నాం కానీ, ఇప్పటికీ, పలు విషయాల్లో మగువలను మరుగున పెడుతున్నామని యూఎన్‌ఓ కార్మిక నివేదిక, అసోచాం, మాస్టర్ కార్డ్ ఇండెక్స్, మొబైల్ హెల్త్ అండ్ ఫిట్ నెస్ తదితర సర్వేల ఫలితాలను చూస్తే తెలుస్తోంది.

సమాజమే ఆదుకోని వేళ:

ఉద్యోగం పురుష లక్షణం.. మగవాళ్ళే వ్యాపారం చేయాలి.. మహిళలు ఇంటి పట్టున ఉండి అన్ని పనులు చేసి పెట్టాలనే రోజులు పోయాయి. మహిళలు పురుషులకంటే ధీటుగా రాణిస్తున్నప్పటికీ.. వారికి అందే ప్రోత్సాహకం, అవకాశాలు అంతంత మాత్రంగానే ఉన్నాయని, ఇండియాలో ఓ మహిళ వ్యాపారాన్ని ప్రారంభించాలంటే.. సొసైటీ నుండి వచ్చే సపోర్ట్, ఫండ్స్, ప్రభుత్వ సాయం వగైరాలు మిగిలిన దేశాలతో పోల్చి చూస్తే మన దేశంలో అత్యంత హీనంగా ఉన్నాయని



మాస్టర్ కార్డ్ ఇండెక్స్ విమెన్ ఎంటర్ ప్రెన్యూర్ షిప్ (ఎంఐడబ్ల్యూఈ) - 2018 సర్వేలో తేలింది. ప్రపంచంలో సుమారు 79 శాతం మహిళా శ్రామిక శక్తి కలిగిన 57 దేశాలపై చేసిన ఈ సర్వేలో భారత్ 52వ స్థానానికి పరిమితం అవ్వడం విస్తుగొలుపుతోంది. ఇక, స్త్రీ, పురుష సమానత్వంలో ఉన్న వ్యత్యాసాలను పూడ్చే విషయంలో కొన్ని దేశాలు పురోగతి సాధిస్తున్నప్పటికీ.. మహిళలకు ఉద్యోగాల లభ్యత రేటు తక్కువగానే ఉన్నదని ఐక్యరాజ్యసమితి కార్మిక నివేదిక సైతం తాజాగా పేర్కొంది. పురుషులతో పోలిస్తే, మహిళా కార్మికశక్తి భాగస్వామ్య రేటు 26.5శాతం తక్కువగా ఉన్నదని, మొత్తంమీద చూస్తే.. ప్రతి పది మంది పురుషులకు ఉద్యోగాలు లభిస్తే, ప్రతీ పదిలో ఆరుగురు మహిళలకు మాత్రమే ఉద్యోగం దొరుకుతోందని సదరు నివేదిక పేర్కొనడాన్ని చూశాక.. ఉద్యోగ, వ్యాపారాల్లో మహిళల పట్ల మన దేశంలో వివక్ష ఎంతగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు.

ఒత్తిడి, సంఘర్షణ ఇంకెన్నో..:

గత సంవత్సరం జెనీవాలో నిర్వహించిన వరల్డ్ హెల్త్ అసెంబ్లీలో 140 దేశాల్లోని మహిళల ఆరోగ్య పరిస్థితులపై పలు విశ్లేషణలు చేసి ప్రపంచ పోషకాహార నివేదిక 2017ను ప్రకటించారు. సదరు నివేదిక ప్రకారం.. భారతదేశంలో రక్తహీనతతో బాధపడే మహిళల సంఖ్య దాదాపు 51 శాతంగా ఉన్నదని, పెక్కు మంది మహిళలు పోషకాహారలోపంతో సతమతమవుతున్నారని.. దీనిని నివారించడానికి పాలకుల చిత్తశుద్ధి కరువైందని సదరు సర్వే ప్రతినిధులు.. ప్రపంచ దేశాల ముందు మన పాలకుల చర్యలను ఎండగట్టినా.. ఇంకా మన నేతల్లో చలనం రాకపోవడం విడ్డూరం. దేశంలోని పురుషులతో పోల్చి చూస్తే.. మహిళలకు అందుతున్న ప్రోటీన్లు 14శాతం తక్కువగా ఉన్నాయని మొబైల్ హెల్త్ అండ్ ఫిట్ నెస్ సర్వే తేల్చగా.. మెట్రో సిటీల్లో ఉద్యోగాలు చేస్తోన్న మహిళలు గతంతో పోలిస్తే ఎక్కువ మానసిక వేదనకు గురవుతూ.. పొగకు బానిసలుగా మారుతున్నారని అసోచాం సర్వేతో తేటతెల్లమైంది. ఆఫీసుల్లో వేదింపులు, పని ఒత్తిడి, నిరుత్సాహం, సమాజ పక్షపాతబుద్ధి, మానసిక సంఘర్షణ వల్లే తాము ఈ వ్యసనానికి బానిసలుగా మారుతున్నామని అధ్యయనంలో పాల్గొన్న చాలా మంది మహిళలు ఈసందర్భంగా పేర్కొనడం గమనార్హం.

ఇప్పటికైనా, మన నేతలు ప్రసంగాలను పక్కనబెట్టి.. మహిళాభ్యున్నతికి పాటుపడితే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

పెట్టుబడి పథకం పేరు రైతు లక్ష్మీ!

సీఎం కేసీఆర్ ఆమోదం

- ఏప్రిల్ 20 నుంచి మే15 వరకు
  3 దశల్లో చెక్కుల పంపిణీ
- రూ.50వేలు దాటితే రెండో చెక్కు
- త్వరలో ఉత్తర్వులు



(ఫైల్)

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రైతులకు పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం ఎకరానికి నాలుగు వేల రూపాయల చొప్పున అమలు చేయనున్న పెట్టుబడి పథకానికి 'రైతులక్ష్మీ' అని నామకరణం చేశారు. దీనికి ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా ఆమోదం తెలిపినట్లు తెలిసింది. ఒకటి రెండు రోజుల్లో దీనికి సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడనున్నాయి. ఈ పథకం కింద ఇచ్చే సాయం ఒకవేళ రూ. 50 వేలు దాటినట్లయితే రెండో చెక్కు ఇవ్వాలని వ్యవసాయ శాఖ నిర్ణయించింది. ఒక చెక్కుపై పేర్కొనే మొత్తం రూ. 49,999కు మించి ఉండొద్దని నిర్ణయించింది. లబ్ధిదారుల భూవిస్తీర్ణం ఎక్కువగా ఉండి, ఇంతకంటే ఎక్కువ సాయం అందుకోవాల్సి వస్తే మరో చెక్కు రూపంలో ఉంటుంది. వచ్చే నెల 20వ తేదీన చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి, మే 15 వరకు మూడు దశల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే లబ్ధిదారుల వివరాలను సీసీఎల్ఏ సిద్ధం చేస్తున్నందున వారికి ఉన్న భూమినిబట్టి ప్రభుత్వం చెక్కు రూపంలో ఎంత సాయం చేయాలనేదానిపై వ్యవసాయ శాఖ లెక్కలు సిద్ధం చేస్తుంది. సుమారు 71 లక్షల కంటే ఎక్కువ మంది లబ్ధి దారులు ఉంటున్నందువల్ల వారి వివరాలన్నింటినీ శుక్రవారం సాయంత్రంకల్లా సీసీఎల్ఏ అందజేయాల్సి ఉంటుందని, ఆ వివరాల మేరకు బ్యాంకులు చెక్కుల ముద్రణను ప్రారంభించాల్సి ఉంటుందని వ్యవసాయ అధికారి ఒకరు తెలిపారు.

రైతులకు ఇస్తున్న చెక్కుల్లో తప్పులు దొర్లినా, భూమి లెక్కల ప్రకారం సాయం అందకపోయినా, ఇతర పిర్యాదులున్నా పరిష్కారం కొరకు వ్యవసాయ శాఖ మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక యంత్రాంగాన్ని సిద్ధం చేస్తోంది. రైతుల నుంచి అందిన ఫిర్యాదులను 30 రోజుల్లోగా పరిష్కరించే విధంగా ఇప్పటికే రూపకల్పన జరిగినట్లు తెలిసింది. భూ రికార్డుల వివరాల అవసరాన్ని బట్టి అందించడానికి ఈ ప్రత్యేక వ్యవస్థ రెవిన్యూ విభాగంతో సమన్వయం చేసేలా ఆదేశాలు జారీ అయ్యాయి. ఆరు జాతీయ బ్యాంకులతో పాటు రెండు ప్రాంతీయ బ్యాంకులకు సైతం చెక్కుల ముద్రణ బాధ్యతలను అప్పజెప్పిన ప్రభుత్వం వచ్చే నెల 19 వరకు తొలి విడత చెక్కులు సిద్ధం కావాలని బ్యాంకులకు వ్యవసాయ శాఖ స్పష్టం చేసింది. చెక్కులను ముద్రిస్తున్న ఆరు బ్యాంకుల్లో 'వ్యవసాయ శాఖ కమిషనర్' పేరుతో ఖాతాలను తెరవాలని, జిల్లాలవారీగా అవసరం లేదని రెండు రోజుల క్రితం జరిగిన బ్యాంకర్ల కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకుంది.

చెక్కుల ముద్రణలో ఎక్కువ వరకు భారతీయ స్టేట్ బ్యాంకు, ఆంధ్రాబ్యాంకులవే కనుక పది లక్షల కంటే ఎక్కువ చెక్కులను ముద్రించాల్సి వస్తున్నందున సాంకేతిక (సాఫ్ట్‌వేర్) ఇబ్బందుల దష్టా వ్యవసాయశాఖ కమిషనర్ ఒకటి కంటే ఎక్కువ ఖాతాలను తెరవాల్సి ఉంటుంది. ప్రతి చెక్కు మీద కేవలం ఆరు అంకెల నెంబర్లు మాత్రమే ముద్రించడం సాధ్యమవుతున్నందువల్ల గరిష్టంగా ఒక ఖాతా పేరుతో 9,99,999 చెక్కులను మాత్రమే జారీ చేయడం సాధ్యం కనుక ఈ పరిమితులను దష్టిలో పెట్టుకుని ఒకటికంటే ఎక్కువ ఖాతాలను తెరవాల్సి వస్తుందని బ్యాంకుల ప్రతినిధులు ఈ సమావేశంలో వివరించారు. ఏ మండలానికి సంబంధించిన చెక్కులను ఏ బ్యాంకు ముద్రించాలన్నదానిపై ఇప్పటికే పట్టిక తయారుచేసినట్లు తెలిసింది.

మొదటి విడత పంపిణీ అయ్యే చెక్కులపైన తేదీని ఏప్రిల్ 19, రెండవ విడత చెక్కులపై ఏప్రిల్ 30, మూడవ విడత చెక్కులపై మే 15 అని ముద్రించాల్సిందిగా బ్యాంకులకు ఇప్పటికే ఆదేశాలు జారీ అయ్యాయి. ముద్రించిన చెక్కులను గ్రామాలవారీగా తయారుచేసి మండలాలవారీగా కట్టలుకట్టి హైదరాబాద్‌లో అప్పజెప్పే విధంగా ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.

రైతు సమన్వయ సమితి చైర్మెన్‌గా 12న బాధ్యతలు తీసుకోనున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

ఈ నెల 12న రైతు సమన్వయ సమితి చైర్మెన్‌గా గుత్తా సుఖేందర్‌రెడ్డి బాధ్యతలు తీసుకోనున్నారు. ఈ మేరకు బషీర్‌బాగ్‌లోని వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో చాంబర్ ఏర్పాటు చేశారు. రైతు సమన్వయ సమితి అవగాహన సదస్సులో గుత్తా సుఖేందర్‌రెడ్డిని చైర్మెన్‌గా సీఎం ప్రకటించిన విషయం విధితమే.

గీత కార్మికులపై పన్ను రద్దు చేయాలి

- సంబంధిత జీవోను విడుదల చేయాలి : సీపీఐ (ఎం) డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎక్సైజ్‌శాఖ మంత్రి పద్మారావు హామీ మేరకు గీత కార్మికుల నుంచి వసూలు చేస్తున్న పన్నును రద్దు చేయాలని సీపీఐ (ఎం) డిమాండ్ చేసింది. వారి నుంచి ఇప్పటికే బలవంతంగా వసూలు చేసిన డబ్బును తిరిగి వారికి చెల్లించాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఒక ప్రకటనలో కోరారు. అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేసిన గీత కార్మికులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గీత కార్మికులు రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లిస్తున్న రూ.15 కోట్ల పన్నును రద్దు చేస్తామంటూ మంత్రి హామీనిచ్చారని గుర్తుచేశారు. కార్మికులెవరూ ఈ పన్నును చెల్లించరాదంటూ స్వయంగా ఆయనే 2017 డిసెంబరు 29న ప్రకటించారని తెలిపారు. కానీ నేటికీ జీవోను విడుదల చేయలేదని పేర్కొన్నారు. మరోవైపు అధికారులు రాష్ట్రవ్యాప్తంగా కార్మికుల వద్ద నుంచి పన్నులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. జనగాం పట్టణంలోని గీత కార్మికులను పన్నులు చెల్లించటం లేదంటూ నానా దుర్భాషలాడారని తెలిపారు.

వారిని లాకప్‌లో బంధించి అవమానపరిచారని వివరించారు. కార్పొరేట్ సంస్థలకు కోట్లాది రూపాయల రాయితీలను ఇస్తున్న ప్రభుత్వం.. బతుకుదెరువు కోసం ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని చెట్లు ఎక్కుతున్న గీత కార్మికులకు మాత్రం తాను ఇచ్చిన హామీని సైతం అమలు చేయటం లేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా గీత కార్మికులకు ఎక్సైజ్ పన్ను రద్దుపై ఇచ్చిన జీవోను విడుదల చేయాలని తమ్మినేని డిమాండ్ చేశారు

భూస్వాములకే సర్కార్ సాయమా?

- కౌలు, పోడు రైతులకూ
  రూ.4వేల పథకం వర్తింపజేయాలి:
  రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



మాట్లాడుతున్న సాగర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పెట్టుబడి పథకం కింద భూస్వాములకే సర్కార్ సాయం చేయనుందా అని పలువురు వక్తలు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎకరానికి ఇచ్చే రూ. 4వేలు కౌలు, పోడు రైతులకు కూడా వర్తింప చేయాలని పలువురు వక్తలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, తెలంగాణ గిరిజన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం కార్యదర్శి టి. సాగర్ మాట్లాడుతూ ఏప్రిల్ 15 నుంచి రైతులకు పెట్టుబడి కింద ఎకరానికి రూ. 4వేలు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. అదే క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా వాస్తవ సాగు చేస్తున్న కౌలు, పోడు రైతులకు కూడా ఈ పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కౌలు, పోడు, దేవాదాయ, అసైన్డ్ భూముల్లో 30 లక్షల మంది రైతులు సాగు చేస్తున్నారని చెప్పారు. కౌలు రైతులకు ఈ పథకం వర్తింప జేయకుంటే, రైతు ఆత్మహత్యల పరంపర నుంచి బయటపడడం సాధ్యం కాదన్నారు. ఆత్మహత్యలకు పాల్పడిన వారిలో కౌలు రైతులే అధికంగా ఉన్నారని చెప్పారు.

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు మాట్లాడుతూ ఇప్పటికే రైతులు వ్యవసాయానికి దూరమవుతున్నారని చెప్పారు. ఆహారధాన్యాల ఉత్పత్తి చేసే కౌలు రైతులకు ఇవ్వకుండా, ధనిక భూస్వామ్య వర్గానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొంతల చంద్రారెడ్డి మాట్లాడుతూ పెట్టుబడి పథకం మాత్రం గంభీరంగా ఉంది కానీ కొంత మందికే లబ్ధి చేకూరే విధంగా ఉందని విమర్శించారు.రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీయే రాష్ట్రంలో 14 లక్షల మంది కౌలు రైతులున్నారని గుర్తించిందన్నారు.

సాగు చేసే రైతులకు ఈ పథకం వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. ఈ రౌండ్‌టేబుల్‌లో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి. జంగారెడ్డి, ఉపాధ్యక్షులు అరిబండి ప్రసాద్‌రావు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రసాద్, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం. ధర్మానాక్, సంజీవరెడ్డి, రాజేష్, కొండల్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రాయల సుభాష్ ఆశయాలు

కొనసాగించాలి

వర్ధంతి సభలో వక్తలు



మాట్లాడుతున్న ప్రదీప్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీపీఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి, కేంద్ర కమిటీ నాయకులు రాయల సుభాష్ చంద్రబోస్ ఆశయాలు కొనసాగించాలని ఐఎఫ్‌టీయు ఆలిండియ ప్రధాన కార్యదర్శి బి.ప్రదీప్ అన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కమిటీ ఆధ్వర్యంలో కార్యదర్శి జి. ఝాన్సీ అధ్యక్షతన సుభాష్ రెండో వర్ధంతి సభ శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా ప్రదీప్ మాట్లాడుతూ 68 సంవత్సరాల జీవిత కాలంలో 48 సంవత్సరాలు అజ్ఞాత జీవితం గడిపారని గుర్తు చేశారు. కష్టపడే తత్వం, నిరంతరం అధ్యయనం చేసేవారన్నారు. ఈ సమావేశంలో జిల్లా నేతలు కిరణ్, ప్రదీప్,రాము, మహేశ్, లక్ష్మీభాయి, కుమార్, పాష, రవి తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

మృగ రాజ్యం

గెలుపైనా... ఓటమైనా... వాటిని హుందాగా స్వీకరించడం గొప్ప లక్షణం. కానీ అక్కడ ఓటమి వినమ్రంగా సగర్వంగా తలెత్తుకుని నిలుచుంటే విజయం మాత్రం అహంకారంతో అసహనానికి గురవుతున్నది. ప్రజాస్వామ్యబద్ధంగా సాగవలసిన ఎన్నికల ప్రక్రియనే అపహాస్యం చేసి అధికారం చేజిక్కించుకున్న వాళ్లు తమ విజయోత్సవాలను సైతం అప్రజాస్వామికం, అరాచకాలమయం చేయడం తొలిసారిగా చూస్తున్నాం... త్రిపుర ఎన్నికల ఫలితాలు వెలువడుతుండగానే మొదలైన బీజేపీ మూకల హింస, విధ్వంసం ఇంకా కొనసాగుతుండటమే గాక దేశమంతటికీ పాకుతుండడం ఆందోళన కలిగిస్తున్నది. ప్రజలపై దాడులకు దిగడం, పార్టీ కార్యాలయాలను ధ్వంసం చేయడం, లెనిన్ విగ్రహాలను కూల్చివేయడంతో మొదలైన ఈ ఉన్మాదం దేశమంతటా పెరియార్, అంబేద్కర్, మహాత్మాగాంధీ విగ్రహాలపై కూడా సాగుతోంది. ఈ విధ్వంసం కేవలం ఆవేశం తలకెక్కిన, విజయోత్సాహంతో విచక్షణ కోల్పోయిన కార్యకర్తల గుంపులు చేస్తున్నదిగా భావించలేం. ఇది సంఘ్ పరివార్ ముందస్తు వ్యూహమేనని స్పష్టమవుతున్నది. బీజేపీ అగ్రనాయకులు త్రిపురలో మతోన్మాదులు సృష్టిస్తున్న మారణకాండను నిస్సిగ్గుగా సమర్థిస్తుండటమే గాక, మరింత రెచ్చగొడుతుండటమే ఇందుకు నిదర్శనం.

> **ప్రపంచమంతా మహాద్భుతంగా పనిచేసిన ఓ గొప్ప ప్రభుత్వం పడిపోయిందని బాధపడుతోంది... త్రిపురలో కొత్తగా కొలువుదీరుతున్న వీరు మనిషిని, మనిషి శబ్దాన్ని నిషేదిస్తూ ఏ రాజ్యాన్ని నిర్మిస్తారు..? మృగరాజ్యాన్నేనా..!?**

ఈ మూకలు గో సంరక్షణ అనీ, లవ్ జిహాద్ అనీ, గొడ్డు మాంసం తిన్నారనీ దేశంలో దళితులు, మహిళలు, మైనారిటీ ప్రజలపై దాడులూ హత్యలకు తెగబడినప్పుడు కూడా వారిని సమర్థిస్తూ వెనకేసుకొచ్చిన వైనాన్నే బీజేపీ నేతలు ఇప్పుడూ అనుసరిస్తుండటం గమనార్హం. ఒకరు లెనిన్ విదేశీయుడు అంటారు. మరొకరు ఆయన టెర్రరిస్టు అతనికి విగ్రహాలెందుకు అంటారు. ఇంకొకరు "చలోపల్టాయి" అంటూ వరుస ట్వీట్లతో రెచ్చగొడుతుంటారు. ఇక పెరియార్ పని పడతామని ఒకాయన, అంబేద్కర్‌కూ ఇదే గతి అని ఇంకొకాయనా హెచ్చరిస్తుంటారు. ఇంత జరుగుతున్నా గవర్నర్ కూడా ఇది ప్రభుత్వాలు మారినప్పుడల్లా జరిగే అతి సాధారణ తంతుగా కొట్టిపారేస్తారు. ఫలితంగా ఈ ఉన్మాదం దావానలంలా దేశమంతటినీ తాకుతోంది... పెరియార్, అంబేద్కర్, మహాత్మాగాంధీ విగ్రహాలపైకీ తెగబడుతోంది..! కానీ దేశం మొత్తం ఈ అరాచకాలను ఖండిస్తోంది... వ్యూహంలో భాగంగానే బీజేపీ ఈ ఉద్రిక్తతలకు ఆజ్యం పోస్తోందంటూ దేశమంతటా నిరసనలు పెల్లుబుకుతుండటం.., రాజకీయ పక్షాలతో పాటు యావత్ మేధో ప్రపంచం నుండీ విమర్శలు వెల్లువెత్తుతుండటంతో ప్రధాని మోడీ తన మౌనం వీడి ఈ దాడులను ఖండించక తప్పలేదు. కానీ ప్రధాని ఖండించినా, బీజేపీ అధ్యక్షుడు హెచ్చరించినా ఈ దాడులు మాత్రం ఆగలేదు. దాడులకు పాల్పడుతున్న మూకలపై ఏ చర్యలూ లేవు... ఇది బీజేపీ అహంకారానికి పరాకాష్ట..! ఒకవైపు క్షేత్రస్థాయిలో విద్వేషాలు వెదజల్లుతూనే, మరోవైపు వాటిని ఖండిస్తూ మొసలి కన్నీళ్లు కార్చడం వీరికి మాత్రమే సాధ్యమైన విద్య.



అయినా విగ్రహాలను కూల్చినంత మాత్రాన వారి సిద్ధాంతాలు కూలిపోతాయా..! బుల్డోజర్లతో వాటిని తొలగించినంత తేలికగా ప్రజల గుండెల్లో వెలుగుతున్న వారి భావాలను ఆర్పగలరా..? లెనిన్ విదేశీయుడనీ, ఆయన ఈ దేశానికి చేసిందేమిటనీ విపరీత వాదన చేసేవారు ఓ విషయం గుర్తుపెట్టుకోవాలి. లెనిన్ అంతర్జాతీయవాది. సకల దేశాల శ్రామికుల విముక్తి శ్వాసించినవాడు... ఈనేల మీద సామ్యవాద వ్యవస్థను సాకారం చేసి ప్రపంచమంతటికీ వ్యాపించినవాడు... అన్నిటికీ మించి బ్రిటిష్ సామ్రాజ్యవాదుల పాలన నుండి భారతదేశం విముక్తి సాధించాలని కోరుకున్నవాడు... బ్రిటిష్ వలసవాదుల పెత్తనాన్ని గట్టిగా వ్యతిరేకించినవాడు... కానీ స్వాతంత్ర్యోద్యమంలో ఏ పాత్రాలేని వారు, బ్రిటిష్ దొరలకు దాసోహమైనవారు లెనిన్ ఈ దేశానికి ఏం చేశాడని ప్రశ్నించడం విడ్డూరంగా ఉంది..! లెనిన్ మొత్తం ప్రపంచానికే గొప్ప విప్లవ స్ఫూర్తి... ఆ స్ఫూర్తిని వీరు అడ్డుకోగలరా..? కులాన్ని నిర్మూలించడానికీ, హేతువాద దృక్పథాన్ని వెలుగొందింప చేయడానికి అపారమైన కృషి చేసినవారు పెరియార్ రామస్వామి. ఆయన ఆత్మగౌరవ పోరాటం నేటికీ దక్షిణాదినంతటినీ ప్రభావితం చేస్తోంది... ఆ భావ వ్యాప్తిని అరికట్టగలరా..? డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అంటరాని తనంపై పెనుమంట.. అణగారిన వర్గాల ఆశాజ్యోతి.. ఆ జ్యోతిని ఆర్పేయగలరా..?

ఎన్నికలన్నాక గెలుపోటములు సహజాతి సహజం. అయినా త్రిపురలో గెలుపోటముల మధ్య ఓట్ల తేడా అరశాతం కూడా లేదు. బీజేపీకి 43శాతం వస్తే... సీపీఐ(ఎం)కు 42.7శాతం వచ్చాయి. కానీ గత ఎన్నికల్లో 1.54శాతానికే పరిమితమైన వారికి ఇప్పుడు 43శాతం ఓట్లు ఏ తీరున వచ్చాయో, అందుకు వారు ఎన్ని అనైతిక, అరాచక, అప్రజాస్వామిక చర్యలకు ఒడిగట్టారో అంతా బహిరంగ రహస్యమే...! ఈ మాత్రానికేనా ఈ మిడిసిపాటు..!? ఈ మాత్రానికేనా ఈ విజయ గర్వం..!? కాదు.. ఈ మాత్రానికే కానేకాదు... అక్కడ వారు గెలిచింది కమ్యూనిస్టుల మీద.. ఈ గెలుపు ద్వారా వారు ఓ నిజమైన ప్రత్యామ్నాయాన్ని చిదిమేశారు... తమ కుటిల పన్నాగాల ద్వారా ఓ నిఖార్సయిన ప్రజాపక్షాన్ని ఓడించారు.. అందుకే ఈ వీరంగం.. అందుకే విధ్వంసం... ఈ ఉన్మాదులు ఓ విషయాన్ని గమనించి తీరాలి... అదేమిటంటే వీరు మాత్రమే గెలిచామని విర్రవీగుతున్నారు.. కానీ ప్రపంచమంతా మహాద్భుతంగా పనిచేసిన ఓ గొప్ప ప్రభుత్వం పడిపోయిందని బాధపడుతోంది... త్రిపురలో కొత్తగా కొలువుదీరుతున్న వీరు మనిషిని, మనిషి శబ్దాన్ని నిషేదిస్తూ ఏ రాజ్యాన్ని నిర్మిస్తారు..? మృగరాజ్యాన్నేనా..!?

పీడిత ప్రజల చదువుల తల్లి సావిత్రిబాయి పూలే

విప్లవ జ్వాల

చరిత్రంతా రాసుకున్నోళ్లది రాయించుకున్నోళ్లదే కనుక చదువుతున్నప్పుడు రాయాలనిప్పిస్తుంది రాస్తున్నప్పుడు చదవాలనిప్పిస్తుంది...

ఎందుకంటే ఇప్పటివరకూ అణగారిన ప్రజల చరిత్ర అధపాతాళానికి తొక్కివేయబడిందని ఆవేదన చెందుతడు తెలంగాణ మట్టి కవి బెల్లి యాదయ్య. అవును ఆధిపత్య చరిత్రే అందరి చరిత్రగా చెలామణీ అవుతుంది. మతం మౌఢ్యమై మారేస్తూ, కులం బలమైన జులూం సాగిస్తున్న రోజుల్లోనే సావిత్రిబాయి పూలేలాంటి సామాజిక సంస్కర్త ఆధునిక భారతాన కుల మత తత్వాలపై యుద్ధం ప్రారంభించింది. అయినా నేటి నాగరిక సమాజాన్ని మళ్లీ మధ్యయుగాలవైపు తీసుకెళ్లే కుట్ర జరుగుతున్నది. మెజార్టీ మతం చేసే అరాచకాలే అద్భుతమైన విలువల్లా రాజ్యమే మోస్తున్న సందర్భంలో సావిత్రిబాయి పూలే 121వ వర్ధంతి మార్చి 10న నిర్వహించడానికి దేశమంతా సిద్ధమైంది.


> **ఆమెలాంటి వారి పోరాట ఫలితంగానే ఈ మాత్రం విద్య, స్వేచ్ఛ మన దరిచేరాయని విడమర్చి చెప్పాలి. లేకపోతే మత చాందసులైన భారత తాలిబాన్ల రాజకీయ సంస్థ రాజ్యమేలుతున్న నేటి పరిస్థితులలో పాలక వర్గాల సంస్కృతి, చరిత్రనే తమ చరిత్రగా భావించుకునే ప్రమాదం ఉన్నది. అదే జరిగితే చరిత్రలో హీరోల స్థానంలో ఉండాల్సిన వారు పరాయీకరణకు గురవుతారు తస్మాత్ జాగ్రత్త.**

నీలాకాశం ఎర్రబారినట్టు అంబేద్కర్, మార్క్సిస్టులు లాల్, నీల్ ఐక్యతంటూ తమ ప్రజాతంత్ర కర్తవ్యాన్ని నెరవేరుస్తున్న తరుణంలో కుల, మత మానసిక బానిసత్వం నుంచి శూద్రజాతి విముక్తికి జీవితాంతం పోరాడిన సావిత్రిబాయి పూలే సంస్మరణలు భావాజాల ప్రచార విస్తృతికి ఉపయోగపడేలా జరగాల్సి ఉన్నది.

అగ్రహార పరివారం అడుగడుగునా అవమానిస్తుంటే ఆధిపత్య భావజాలం ఆగ్రహిస్తుంటే, నాలుగు పడగల హైందవ నాగరాజు ఆసాంతం చదువు చుట్టుకొని బుసలు కొడుతుంటే 19వ శతాబ్దంలోనే ప్రతిఘటన చేసి విద్యను విముక్తి గావించి శూద్రజాతికి పంచి పెట్టింది సావిత్రిబాయి పూలే. 1848లో పూనేలో మొదటి బాలికల పాఠశాల స్థాపించి ఆధునిక భారత దేశంలో మొట్టమొదటి ఉపాధ్యాయురాలైంది. తన భర్త సామాజిక విప్లవకారుడు జ్యోతిరావు పూలేతో కలిసి ఆధిపత్య దోపిడీకి వ్యతిరేకంగా ప్రత్యామ్నాయ సంస్కృతి నిర్మాణానికి స్త్రీలు, శూద్రులు, అతిశూద్రులను ఏకతాటి మీదికి తీసుకొచ్చేందుకు 1873లో సత్యశోధక సమాజ్ ఏర్పాటు చేశారు. విద్య ప్రజాస్వామికీకరణకు సావిత్రీబాయి పూలే దృఢ సంకల్పంతో కృషి చేసింది. సమస్త వ్యవస్థలు భూస్వామ్యశక్తుల ఆధీనంలో ఉంచుకొని అజ్ఞానాన్ని, మత విశ్వాసాలను అడ్డం పెట్టుకొని పెత్తనం చేస్తుంటే ప్రశ్నించింది. స్త్రీలకు, శూద్రులకు, అతి శూద్రులకు చదువు నిరాకరించడంపై సమరం చేసి తనే పాఠశాలల్ని ప్రారంభించింది. స్త్రీని భౌతిక, లైంగిక, ఆర్థిక ప్రయోజనాలు తీర్చే యంత్రంగా కుటుంబాలకు చెందిన ఆస్తులుగా పరిగణించడాన్ని తిప్పికొట్టే ఏకైక ఆయుధం చదువని చెప్పింది. స్త్రీలను, శూద్రులను కుల, మత సాంప్రదాయాల మనువాద సిద్ధాంత కబంధ హస్తాలనుంచి విముక్తి చేయడమే పనిగా జీవితాంతం కృషి చేసిన మానవతా మూర్తి సావిత్రిబాయి పూలే.

తన కృషిలో ఆధిపత్య కులాల వారి నుంచి వేధింపులు, బండ బూతులు, బురద, మట్టి పెడ్డలు, రాళ్ల దెబ్బలలాంటివెన్నో ఎదుర్కోవాల్సి వచ్చింది. జ్యోతిరావు పూలే మద్దతుతో ఆ ఆటంకాలను అధిగమించి పదును తేలిందే తప్ప వెనుకడుగు వేయకుండా ఎన్నో పాఠశాలలకు పురుడుపోసి చదువుల తల్లి అయ్యింది. సుమారు 95శాతంగా ఉన్న స్త్రీలు, శూద్రుల చీకటి జీవితాల్లో జ్ఞానదీపం వెలిగించింది. ఆనాటి మత చాందసవాదుల హింసను ఎదుర్కొని చదువుల వెలుగై ప్రవహించిన చదువుల తల్లి సావిత్రిబాయి పూలేకి ఎన్ని నోబెల్ బహుమతులిచ్చినా తక్కువే. నిషిద్ధాక్షరాల్లో నిలువెల్లా స్వేచ్ఛ నింపి సజీవ సమాధిలాంటి సమాజంలో నిర్జీవులుగా బతుకుతున్న వాళ్ల మెదళ్లలో అక్షర జీవం పోంపింది. తద్వారా పీడిత ప్రజల కణజాలంలో విజ్ఞాన గనిలా నిలిచిన చదువుల తల్లి సావిత్రిబాయి పూలే. ఏనాడూ మనిషి రూపమెత్తని మత సంబంధమైన పురాణాల పాత్రకు రూపమిచ్చి పాఠశాలల్లో ప్రతిష్టించే పని ప్రభుత్వాలు ప్రోత్సహించడాన్ని ప్రశ్నించాలి. ఆక్షేపించాలి. ఇది బ్రాహ్మణీయ భావజాల ఆధిపత్యాన్ని పునర్నిర్మించే కుట్ర. కుల, మత భావాలను పాఠశాల ప్రాంగణంలోకి రానివ్వకూడదు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని అర్ఎస్ఎస్‌లాంటి విద్రోహ శక్తులు పాఠశాలల్లో సరస్వతి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలకు పూనుకోవడం రాజ్యాంగ విరుద్ధం. పసి మెదళ్లకు ప్రాథమిక దశనుంచే మతాన్ని ఎక్కించే విషపూరిత చర్య ఇది. మంత్రోచ్ఛారణలు తంత్ర గీతాలు మత సంబంధమైన పద్యాలు, పదాలు అర్థంకాని సంస్కృత భాషా రూపంలో మన చదువుల్లో భాగం చేశారు. ఇలా దేశాన్ని హిందూమత రాజ్యంగా మార్చేసే బీజేపీ రహస్య ఎజెండా అమలవుతున్నది. ఇదే గనుక కొనసాగితే మనల్ని మనం కోల్పోయి మన పిల్లల చదువులకు దూరమవడం తప్ప మిగిలేదేమీ ఉండదు.

ప్రజలు అమాయకంగా మూఢవిశ్వాసాలను అనుసరించినంత కాలం వారి జీవితాల్లో మార్పు రాదని పండుగలు, పబ్బాలు వంటి ఆర్భాటాల కోసం శక్తికి మించిన అప్పులపాలయ్యేవారిని మేలుకొల్పేందుకు సావిత్రిబాయి పూలే అప్పు అనే వ్యాసం రాసింది. 1852లో మహిళా సేవా మండలి అనే మహిళా సంఘాన్ని నెలకొల్పి వితంతు పునర్వివాహాల అవసరాన్ని చాటి చెప్పింది. వితంతువులపై జరుగుతున్న వివక్షకు, అక్రమ సంతానం పేరుతో జరుగుతున్న శిశువుల హత్యకు వ్యతిరేకంగా పనిచేసింది. అనాథలుగా మారుతున్న శిశువుల కోసం శరణాలయాన్ని స్థాపించింది. 1860లో క్షౌర వృత్తిదారులను చైతన్యపరిచి వితంతువులకు గుండు చేయబోమని సమ్మె చేయించింది. నయాగావులో మహర్ కులం యువతి, బ్రాహ్మణ యువకుడు ప్రేమించుకున్నారని ఆ జంటపై దాడిచేస్తున్న సందర్భంలో ఆ దుండగులను ప్రతిఘటించి వారిని రక్షించింది. 19వ శతాబ్దంలో ప్రాణాలను పణంగా పెట్టి సాంఘిక దురాచారాలపై యుద్ధం చేసిన మహిళా సావిత్రిబాయి పూలే. సత్యశోధక సమాజం మహిళా విభాగం బాధ్యతల్లో 1873లోనే కులాంతర వివాహాలు జరిపించడంలో కీలకపాత్ర పోషించింది. 1870లో



కరువువాత పడిన కుటుంబాల్లోని అనాథ పిల్లల కోసం 52పాఠశాలలను నిర్వహించడంలో సావిత్రిబాయి పూలే పాత్ర ఎనలేనిది. 1890లో భర్త జ్యోతిరావు పూలే చితికి తానే నిప్పంటించి సనాతన సాంప్రదాయ మూఢాచారాలను సవాలు చేసింది. తను దుఃఖసాగరంలో ఉన్న సందర్భంలో సైతం ప్రత్యామ్నాయ సంస్కృతికి సాహసోపేత దారులు వేసేందుకే ఆలోచించి ఆచరించింది. పీడితులను హీరోలుగా మలిచేందుకు ప్రతినిత్యం సాంఘిక దురాచారాలపై తనదైన శైలిలో ఉద్యమించింది.

ప్రారంభ కవితా పంక్తుల ప్రతిబింబంగానే చరిత్ర రాయబడింది. వేలాది ఏండ్ల నుంచి చదువులకు నోచుకోని శూద్రజాతిలో నుంచి శూలంలా దూసుకొచ్చి సవర్ణ సాంప్రదాయాధిపత్యాల్ని సాంఘిక దురాచారాలను రూపుమాపిన ఆధునిక భారత విప్లవకారిణిగా, సంఘ సంస్కర్తగా సావిత్రిబాయి పూలేను చరిత్రలో ఎక్కడా కనపడనివ్వలేదు. కనీసం పాఠ్యపుస్తకాలలో కూడా ప్రస్తావన ఉండదు. ఇంత గొప్ప సంఘ సంస్కర్త గురించి మనకు తెలియకుండా పోవడానికి కారణం తను పోరాడిన అగ్రవర్ణాధిపత్య, పురుషాధిపత్య భావజాల కుట్రగా మనం అర్థం చేసుకోవాలి. రాజా రామ్మోహన్‌రాయ్, ఈశ్వర్‌చంద్ర విద్యాసాగర్ లాంటి వారు సాంఘిక దురాచారాలపై చేసిన పోరాటాల్ని తక్కువ చేసి చూడాల్సిన అవసరం లేదు. వారిని ఆ మేరకు అభినందించాల్సిందే. కానీ ఈ దేశంలో సాంస్కృతిక పునరుజ్జీవనానికి జరిగిన ఉద్యమాలు వారికి మాత్రమే పరిమితం చేస్తే చూస్తూ ఊరుకునే పరిస్థితుల్లో నేటి యువత లేదనిపిస్తుంది. వారికి వెలుపల కూడా అద్భుతమైన ఉద్యమాలు, ఆచరణాత్మక త్యాగాలు జరిగాయన్నది సత్యం. ఇప్పటిదాకా ఆధిపత్య చరిత్రే యావత్ భారత్ చరిత్ర అని చేసిన మాయలగుట్టు విప్పే పని మొదలైంది. నేడు చదవడం, రాయడం కడుపుతిప్పలకో, కాలక్షేపానికో, సాత్విక వ్యాపకానికో కాదు, రాజకీయ అవసరమని బోధపడింది. అందుకే చరిత్ర శిథిలాల కింద దాచిపెట్టబడ్డ పీడితుల చరిత్రను మార్క్స్, పూలే, అంబేద్కర్ టార్చ్‌తో తవ్వుకొని చదువుకుంటున్నారు. తలకిందులైన తమ చరిత్రను, సంస్కృతిని నిటారుగా నిలబెట్టుకోవడానికి సామాజిక శ్రామికులై కృషి చేస్తున్నారు.

మరోపక్క దేశభక్తి ముసుగులో జాతీయవాదాన్ని ముందుపెట్టి ఆధిపత్య వర్గాల ప్రయోజనాల కోసం, అట్టడుగు వర్గాల ప్రజలందరినీ అణగదొక్కే మత విధానాలను ఆర్ఎస్ఎస్, బీజేపీ పునర్నిర్మాణం గావిస్తోంది. ఇది సావిత్రిబాయి పూలే చమటోడ్చి సాధించిన పీడిత ప్రజల సామాజిక, సాంస్కృతిక పరివర్తనను ధ్వంసం చేసే ప్రక్రియ. వేల ఏండ్లుగా వర్ణ వ్యవస్థకు గులాంగిరీ చేస్తున్నందుకే జీవించు-గర్వించు అన్న నినాదాలతో హైందవాధిపత్యం హితబోధ చేస్తున్నది. భారతీయత జాతి నిర్మాణాల సెంటిమెంటు ఆధిపత్య భావాల పునరుత్పత్తితోపాటు సామాజిక విధ్వంసమూ జరుగుతున్నది. సంపద కేంద్రీకరణ, సహజ వనరుల దోపిడీ, ఆధునిక అసమాన అభివృద్ధి శ్రామికుల మూలాల్ని పెకలించి వేస్తున్నది. విద్యా వైద్యం సేద్యం, ఆహారం, ఆరోగ్యం కరువై పేదల జీవనం చిన్నాభిన్నం అవుతున్నది. మతం మాటున భక్తిని రక్తిగట్టించి జాతి ఆదర్శాలను వల్లిస్తూ సంఘ్ పరివార్ మనపై మానసిక యుద్ధం చేస్తున్నది. ఈ యుద్ధంలో అట్టడుగు వర్గాల చరిత్రను గెలిపించడానికి సావిత్రిబాయి పూలే సామాజిక, సాంస్కృతిక ప్రత్యామ్నాయ ఉద్యమాల స్ఫూర్తిని ప్రజల ముంగిట్లోకి నేడు విస్తృతంగా తీసుకుపోవాల్సిన అవసరం ఉన్నది. పీడిత ప్రజల చదువుల తల్లి సావిత్రిబాయి పూలేను నేటి తరం అమ్మమ్మగా పసి బాలల నుంచి పడుచు పోరల దాకా పరిచయం చేయాలి. ఆమెలాంటి వారి పోరాట ఫలితంగానే ఈ మాత్రం విద్య, స్వేచ్ఛ మన దరిచేరాయని విడమర్చి చెప్పాలి. లేకపోతే మత చాందసులైన భారత తాలిబాన్ల రాజకీయ సంస్థ రాజ్యమేలుతున్న నేటి పరిస్థితులలో పాలక వర్గాల సంస్కృతి, చరిత్రనే తమ చరిత్రగా భావించుకునే ప్రమాదం ఉన్నది. అదే జరిగితే చరిత్రలో హీరోల స్థానంలో ఉండాల్సిన వారు పరాయీకరణకు గురవుతారు తస్మాత్ జాగ్రత్త.

సెల్ : 9030546896

కూలదోయడమా సంస్కృతి...?



జి. తిరుపతయ్య

త్రిపురలో గెలుపును ఆస్వాదించకుండా ప్రత్యర్థుల మీద విరుచుకుపడి విగ్రహాలనూ ఆఫీసులనూ ధ్వంసం చేస్తూ బీజేపీ శక్తులు తిరుగుతుండటం బాధాకరం. కూలదోయడమేనా భారత సంస్కృతి? సంస్కృతి అంటే మన విధానాన్ని పెంచుకోవడం కానీ ఇతరుల భావాలపై విరుచుకు పడటం కాదు. విధ్వంసం చేయడం కాదు. ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుసటి రోజే త్రిపురలోని లెనిన్ విగ్రహాన్ని బుల్‌డోజర్‌తో పెకిలించి పడేశారు. గెలిచిన తరువాత కూడా ఈ ఉన్మాద చర్యలేమిటీ? విగ్రహాలంటే పడదా? విగ్రహాల వల్ల రోడ్లేమైనా బ్లాక్ అవుతున్నాయా? మహాత్మాగాంధీ, సుభాష్, పటేల్, నెహ్రూల విగ్రహాలు పలు దేశాల్లో ఉన్నాయి. లాల్ బహదూర్ శాస్త్రీ విగ్రహం తాష్కెంట్‌లో ప్రఖ్యాత స్థలంలో ఉంది. మనం పోరాడి స్వాతంత్ర్యం తెచ్చుకున్న ఇంగ్లాండులోనూ మన నాయకుల విగ్రహాలున్నాయని మరవద్దు. రష్యాను వ్యతిరేకించాల్సిన అవసరం మనకు లేదు. ఎందుకంటే స్వాతంత్ర్యానంతరం ఇనుము, ఉక్కు కర్మాగారాలు (బిలాయ్ స్టీల్ ప్లాంట్) నెలకొల్పేందుకు సహాయాన్ని ముందుగా అందించింది రష్యానే. ఇవేవీ కారణాలు కావు మిత్రమా! వ్యతిరేకతంతా ఆయా విగ్రాహాల్లోని మహానుభావుల వల్ల పాదుకొల్పిన విధానాలు, వాటిద్వారా వారి ఆధిపత్యం ప్రశ్నించబడుతున్నదనే దుగ్ధ. లెనిన్ కార్మిక కర్షక విజయానికి ప్రతీక. ఆదర్శనీయుడు. రష్యా పేదప్రజలను పీడితులను ఏకతాటిపై నిలబెట్టి పెట్టుబడి దోపిడీని ఓడించిన ఘనత ఆయనదే. అదే స్ఫూర్తితో ప్రపంచ వినాశనానికి ఒడిగట్టిన జర్మనీని దాని ఫాసిస్టు విధానాలను అమలుపరుస్తూ నియంతగా ఎదిగిన అడాల్ఫ్ హిట్లర్‌నూ స్టాలిన్ ఓడించగలిగాడు. ఇంతటి మహనీయున్ని ఆదర్శంగా తీసుకునే మన దేశంలో కార్మిక కర్షక వర్గాలు సంఘాలుగా ఏర్పడి దోపిడీని ప్రశ్నించి తమ హక్కులను సాధించుకుంటున్నాయి. ఇలా చట్టబద్ధ హక్కుల కోసం పోరాడటం సాధించుకోవటం పెట్టుబడిదారులకు యజమానులకు మింగుడుపడటం లేదు. అందుకే ఈ దాడి లెనిన్ విగ్రహంపై కాదు కార్మిక కర్షక ఐక్యతపై మాత్రమే. ఈ వర్గమంతా ఇకముందు ముక్కూ నోరూ మూసుకుని పని చేయాలి. పెరియార్ స్వామి నాస్తికత్వాన్ని ప్రచారం చేశాడు, కుల మత విశ్వాసాల ద్వారా అణచివేతకు గురవుతున్న వారి తరపున నిలబడ్డాడు. అందుకే ఆయనకు విగ్రహం కట్టారు. కానీ నేటికీ మనువాదాన్ని బలపరుస్తూ మాల, మాదిగ, చాకలి, మంగలి... కులాలుగా విభజించి బానిసలుగా పనిచేయించుకోవాలని ఉబలాటపడుతున్నవారికి పెరియార్ మింగుడు పడడు. అందుకే ఈ దాడులకు ఉసిగొల్పుతున్నారు.

నొసటిన ఓ పెద్ద సింధూరం పెట్టుకుని మెళ్ళో ఓ కాషాయ శాలువా వేసుకుని చేతిలో కర్రలతో వీధుల్లో భయపెడుతూ తిరగటమా హైందవ సంస్క తి? ఇలాంటి వాళ్ళనా మనం ఎన్నుకుంటున్నదీ? బాబ్రీ మసీదు స్థానంలో రామ మందిరం నిర్మించాలని లేకపోతే భారత్ మరో సిరియాగా మారుతుందని శ్రీ శ్రీ రవిశంకర్ వ్యాఖ్యానాలు చేశారు. ఇటువంటి సందర్భాల్లో సంయమనం పాటించవలసిన బాధ్యతాయుత వ్యక్తులు ఇలా ప్రకటించడం చాలా తప్పు. బీజేపీ లేదా సంఘ్ పరివార్ విధానాలను వ్యతిరేకించిన వారి తలలు నరికి తేవాలని గతంలో ఎంతోమంది బీజేపీ నాయకులు ప్రకటన చేయడం విన్నాం.. బహిర్గతంగానే వీరి వ్యాఖ్యలు ఇంత ఘోరంగా ఉంటున్నాయి. భౌతిక దాడులు ఎన్నటికీ శాంతిని సాధించవు. దాడుల ద్వారా లభించిన విజయానికి గులాబీ కింద ముల్లులాగా శతృత్వం సిద్ధంగా ఉంటుంది.

సెల్:9951300016

సామాజిక సంబంధాల లైంగికీకరణ



సంగిరెడ్డి హనుమంతరెడ్డి


లైంగికవివక్ష పిండదశ నుండే పీడిస్తున్నది. వాడికేం మగాడని సమర్థిస్తారు. ఆడపిల్ల ఆడపిల్లేనని వెటకరిస్తారు. పాతివ్రత్య లక్షణాలను ఆదిశక్తి పార్వతి నోటేపలికించారు. ఆడవారిని ఆడువారే ప్రశ్నిస్తారు. మృగాళ్ళను సహిస్తారు. పురుష కవులు లైంగిక అసమానతను వర్ణిస్తూనే ఉన్నారు. పని ఆడుపని, మగపనిగా విభజించబడింది. మహిళలకే కట్టుబాట్లు. మృగాళ్ళు దేవర దున్నపోతుల్లా తిరగచ్చు. సామాజిక సంబంధాలన్నీ లైంగికీకరించబడ్డాయి.

శ్రామిక లైంగికీకరణ: కార్మికులంటే మగాళ్ళే. శ్రామిక స్త్రీలను స్మరించరు. వనితలంటే వంటిల్లే. ఇంటిపని ఇంతులదే. మగాళ్ళు చేయరు. పనిమనుషులంతా పడతులే. పురుషులుండరు. ఇంటా బయటా, పొలాల్లో, పరిశ్రమల్లో స్త్రీలే. ఐనా వీరి ప్రస్తావనెక్కడా రాదు. వేతనాల్లో వ్యత్యాసాలుంటాయి. పెట్టుబడిదారీ దేశాల్లో ఓటు హక్కు కోసం మహిళలు దశాబ్దాలు పోరాడారు. సామ్యవాద దేశాల్లో స్వాతంత్రం రాగానే స్త్రీలకు అన్ని హక్కులు ఇచ్చారు. భారత సమాజంలో సగమైన స్త్రీలకు, భారత కమ్యూనిస్టు పార్టీ పార్లమెంటు పూర్వ సభ్యురాలు పార్వతీ కృష్ణన్ 33శాతం రాజకీయ రిజర్వేషన్ ప్రతిపాదించారు. కాంగ్రెస్, ముస్లిం మహిళలను "ఉద్ధరించిన" బీజేపీ దాన్ని పట్టించుకోలేదు. లైంగికవాదం మహిళల అసమానతలు, అన్యాయాలకు మూలం. ఆర్థిక పరిభాషలో పనిచేయగల వ్యక్తులందరూ శ్రమశక్తిలో భాగస్వాములే. సమాజ గమనాలు, స్త్రీ పురుషుల పునరుత్పత్తి ప్రక్రియలు, సామాజిక వైరుధ్య గతిశీలత, లైంగికత, వర్గం సామాజిక సంబంధాలలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. ఇవి శ్రమ విభజన, సాంఘిక జీవనం, సామాజిక స్పందనలలో ప్రతిబింబిస్తాయి. సామాజిక లైంగికతకు హద్దులుండవు. శ్రమలో పురుషాధిపత్య ధోరణి అవ్యక్త నమూనాగా కొనసాగుతోంది. ఏ వయసువారైనా మగవారి పనికే విలువ. వనితల కార్యక్రమాలకు కుటుంబమే ప్రారంభ కార్యక్షేత్రం. ఇంటిపనులే కుటుంబ బాధ్యతలను స్త్రీలపై రుద్దుతున్నాయి.

పురుష పక్షపాతాన్ని మతం సమర్థిస్తుంది. మార్క్సిజం తిరస్కరిస్తుంది. పిల్లలు అడ్డమని, మాతృత్వంతో మహిళా నైపుణ్యత తగ్గుతుందని అధికారులు అభాండిస్తారు. మగాళ్ళకు ఈ సూత్రం వర్తించదు. తండ్రులైనా బాధ్యతలు ఎగ్గొట్టి ఊరేగవచ్చు. తల్లులు సంతాన సంసార బాధ్యతలు మోస్తూ వ్యక్తిగత శ్రద్ధాసక్తులు మరిచి జీవించాలి. ఏ పనిలోనూ మహిళలు మగాళ్ళకు తీసిపోరని ప్రపంచం నిరూపించింది. లైంగికీకరణ వనితా "స్తబ్ధతను" సమర్థిస్తుంది. మతంలో, మార్కెట్లో మహిళలను నిరాయుధులను చేసింది. వ్యసనలోలుడు, అసమర్థుడైనా మగాడే కుటుంబ పెద్ద. మహిళల దుర్లక్ష్యం ఆర్థిక, సామాజిక, మానవ సంబంధ శాస్త్రాలలో వారి సామాజిక న్యూనతకు కారణం. మహిళలు, పుట్టినింటి నుండి మెట్టినింటికి వచ్చిన వలస జీవులుగా, విలువలేని పనులుచేసే వికలాంగులుగా, ప్రక్కకు నెట్టబడి పోటీకి పనికిరాని నిరర్థకులుగా వర్ణించబడ్డారు. గుర్తింపులేని కుటుంబ బాధ్యతల వలన ఆడువారు అడుగడుగునా అడ్డంకులు ఎదుర్కొంటున్నారు. పని, విరామం, జీతభత్యాలలో స్త్రీలు రెండవ తరగతి పౌరులే. మగవారి పనితనాలు అధ్యయనంలో వారి వైవాహికస్థితి, కుటుంబ పరిమాణం, సంతాన సంఖ్య, భార్యల ప్రస్తావనలు ఉండవు. మహిళలు కుటుంబ బందీలు, ఉత్పత్తి క్రియారహితులు. కుటుంబ బాధ్యతలులేని మగాళ్ళు పదోన్నతులకు అర్హులు.

ఉత్పత్తి, పునరుత్పత్తి సంబంధాలు: ఉత్పత్తి, పునరుత్పత్తి శ్రమలలో మహిళల ఉత్పాదకశక్తిని పురుషాధిక్య నమూనాగా అభివర్ణించారు. ఫలితంగా ఎంతటి ఉచ్ఛస్థితిలో ఉన్నా మహిళలు అన్ని రంగాలలోనూ ఆత్మహత్యలకు నెట్టబడుతున్నారు. హత్యలకు లోనవుతున్నారు. మతం, మార్కెట్లు దీనికి సహకరిస్తున్నాయి. సంప్రదాయ అర్థంలో ఉత్పత్తి, పునరుత్పత్తి కార్యక్రమాలన్నీ సామాజిక ఉత్పత్తిలో భాగమే. పునరుత్పత్తికి దోహదపడే వ్యవస్థలను కుటుంబం నుండి వేరు చేయలేము. ఇంటి పనుల మీద వృత్తి కార్యక్రమాల ఫలితాలు ఆధారపడి ఉంటాయి. కుటుంబాన్ని స్త్రీ పురుష సంబంధాలుగా కాక సామాజిక సంబంధాలుగా అధ్యయనం చేయాలి. ఆ మేరకు శ్రమ విభజన జరగాలి. సామాజిక చైతన్యం పురుషాధిక్యతలో బంధించబడింది. స్త్రీ పురుషుల సామాజిక మార్గాలను గుర్తించడానికి చేసే సర్వేలు, మౌఖిక సమావేశాలు, ఆత్మకథలు, వంశవృక్షాల పద్ధతులన్నీ పురుషాధిక్య నమూనాలే. ఉత్పత్తి, పునరుత్పత్తుల ఏకకాల అధ్యయనం నూతనవిధానాల రూప కల్పనకు దారితీస్తుంది. లైంగికీకరణతో పని విభజన సామాజిక విచ్ఛిన్నానికి దారితీస్తుంది. ఉత్పత్తి, పునరుత్పత్తి సంబంధాల చిక్కుముడి విప్పడానికి పలు ప్రయత్నాలు జరిగాయి. నిరంతర అధ్యయనంతో "సహజ క్రమం" సాకుతో ఆమోదించిన నిరసనరహిత అసమ్మతిని ఓడించాలి. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని బద్దలుకొట్టాలి. పునరుత్పత్తి కేంద్రంగా కొత్తపద్ధతి అభివృద్ధిచెందాలి. రుద్దబడిన పద్ధతుల్లో వ్యక్తీకరించబడే మహిళా విజ్ఞానశాస్త్రం అధీన శాస్త్రమే. అసలు అర్థంలో విజ్ఞానశాస్త్రం కాదు.

> **స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేకుండా భయం నీడలో నివసించే ప్రాణి విశ్వంలో మహిళ తప్ప మరొకటి లేదు. సామ్యవాద దేశాలలో లైంగిక అసమానతల్లేవు. మహిళా సమానత్వానికి సమసమాజం బీజాలు నాటింది. ఆధిపత్యరహిత కుటుంబ నిర్మాణం, ఉత్పాదక వ్యవస్థల ఉమ్మడి విధానం సామాజిక సంబంధాల లైంగికీకరణను రూపుమాపుతుంది.**



మహిళల చాకిరీ: జీతభత్యాలు లేని ఇంటిచాకిరీ కొనసాగినంత కాలం సామాజిక సేవలకు ప్రోత్సాహకాలు లభించవు. మహిళల చాకిరీ తగ్గదు. బలమైన మహిళా ఉద్యమాలు కొనసాగినప్పటికీ 70వ దశకంలో రాయితీలతో నడిచే పిల్లల సంరక్షణా కేంద్రాలు తగ్గిపోయాయి. సామాజిక, తాత్విక, మేధో ప్రక్రియలలో మహిళా జీవితాలు సమగ్రభాగాలు. ఇంటి చాకిరీని మగాళ్ళు ప్రేమ కార్యమంటారు. మహిళలు కూలిలేని కొలువు అంటారు. ప్రతీ గర్భస్రావం పని వత్తిడి, పోషకాహార లోపాల ఫలితమే. శ్రామికుల ఉద్యమం సామాజిక చట్రంలో జీతాల మెరుగుదలకు. మహిళా ఉద్యమం సామాజిక పాత్రనే ఎదిరించడానికి. కార్మికులు జీతాల పెరుగుదలను పెట్టుబడిదారీ చట్రంలోనే అడుగుతారు. మహిళల పోరాటం సామాజిక చట్రంలో బానిసత్వ నిర్మూలనకు. మహిళల పనిని పనిగా, మహిళలను మనుషులుగా గుర్తించాలి. సామాజిక, ఆర్థిక విశ్లేషణలలో ఇంటి చాకిరీని ఎత్తిచూపి స్త్రీవాదులు ఒక నిర్ణయాత్మక అంశాన్ని ప్రస్తావించారు. ఇంటిపనులు, స్త్రీ పురుష సంబంధాల విశ్లేషణ, సామాజిక సంబంధాలలో మహిళా శ్రమ పట్ల అర్థవంతమైన విధానానికి దారితీశారు. స్త్రీ పురుష సంబంధాలను కుటుంబ వ్యవహారాలకు పరిమితం చేయకుండా ఇంటి, వృత్తి పనుల ఆధారిత కార్యక్రమాలకు విస్తరించారు. విజ్ఞానశాస్త్రాల విమర్శనాత్మక విశ్లేషణ వివిధ విభాగాల అసమగ్రతలను, చీకటి కోణాలను వివరిస్తుంది.

స్త్రీవాదుల కర్తవ్యం: ఆధిపత్యదోపిడీ విధానాలతో విలువ, జీతభత్యాల అవసరం లేనిదిగా పరిగణించబడి, పునరుత్పత్తి సహజంగా స్త్రీలకు ఆపాదించబడింది. విశాల దృక్పథంతో విలువలను నిర్ధారణ చేసి పునరాలోచింపజేసే ప్రక్రియ ఇది. వస్తూత్పత్తి శ్రమను నిర్దేశిస్తుంది. అప్పుడు ఇంగితజ్ఞానంతో పని వేళలు, విరామ సమయం, శాంతి, పర్యావరణం, నిరుద్యోగం, కరువు, పేదరికం మొదలగు అంశాల గురించి చర్చించుకుంటాం. పని కోసం పని అని భావించబడుతున్న ప్రపంచంలో మనం వ్యక్తిగత, సామాజిక పరిపూర్ణతలకు తపిస్తున్నాం. స్త్రీ పురుషులిద్దరికీ జీతాలు తగ్గుతున్నాయి. పని దొరకడం లేదు. మహిళా పరిష్కారాలు కొన్నిసార్లు ఎగతాళికి గురవుతున్నాయి. అయినా ఆలోచనా విధానాన్ని మార్చుకోడంలేదు. మహిళలను అణగదొక్కి అధీనంలో ఉంచుకునే సంప్రదాయ పద్ధతులను ఎదిరించాలి. సామూహిక చర్చలను ప్రేరేపించే నూతన ఆలోచనలు వికసించాలి. మహిళలు, స్త్రీవాదులు, పరిశోధకులు ప్రభావవంతమైన విధానాన్ని, నూతన సాధనాలను ఆవిష్కరించుకోవాలి. ప్రపంచ మహిళా కార్యకర్తలతో సంబంధాలు నెలకొల్పుకోవాలి. విశ్వ వనితల సారూప్యతలను, సామాజిక సంబంధాల ఏకత్వాన్ని గుర్తించి కలిసి పనిచేసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి.

స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేకుండా భయం నీడలో నివసించే ప్రాణి విశ్వంలో మహిళ తప్ప మరొకటి లేదు. సామ్యవాద దేశాలలో లైంగిక అసమానతల్లేవు. మహిళా సమానత్వానికి సమసమాజం బీజాలు నాటింది. ఆధిపత్యరహిత కుటుంబ నిర్మాణం, ఉత్పాదక వ్యవస్థల ఉమ్మడి విధానం సామాజిక సంబంధాల లైంగికీకరణను రూపుమాపుతుంది.

సెల్:: 9490204545



తన చిన్న తనంలోనే తండ్రిని కోల్పోయాడు కుమార్. తల్లి కష్టపడి తననూ, చెల్లిని పెంచింది. పదో తరగతి వరకు మాత్రమే చదువుకున్న కుమార్ ప్రస్తుతం ఓ పెద్ద షాప్‌లో సేల్స్ బాయ్‌గా చేరాడు. నిబద్ధతతో పని చేస్తూ అక్కడ మంచిపేరు తెచ్చుకున్నాడు. తల్లి, చెల్లె అంటే అతనికి ప్రాణం. తను ఉద్యోగంలో చేరిన తర్వాత తల్లిని పని మాన్పించాడు. చెల్లిని చదివిస్తున్నాడు. ఆ ఇద్దరే అతని ప్రపంచం. చుట్టుపక్కల వారిని, బంధువులను, తోటి వారిని ఎంతో గౌరవిస్తాడు. ఎవరితోనూ దురుసుగా మాట్లాడడు.

కొత్త జీవితం

అలాంటి కుమార్‌కు తనతోపాటే షాప్‌లో పనిచేసే స్నేహితుడి ద్వారా స్వప్న పరిచయం అయ్యింది. స్వప్న స్నేహితుడి చెల్లెలు. ఎవరి గురించి పెద్దగా పట్టించుకోని అతనికి స్వప్న అంటే ఇష్టం కలిగింది. స్నేహితుడికి తెలిస్తే తన గురించి తప్పుగా అనుకుంటాడేమోనని చాలా భయపడ్డాడు. కానీ ఆమెను చూడకుండా ఉండలేకపోయేవాడు. అప్పుడప్పుడు స్నేహితునితో కలిసి వాళ్ళ ఇంటికి వెళ్ళి స్వప్నను చూసి వచ్చేవాడు. స్వప్న కూడా అతని వైపు ఇష్టంగానే చూసేది. కానీ ఇద్దరూ మాట్లాడుకోడానికి మాత్రం సాహసం చేయలేదు.

ఓరోజు స్వప్న ఏదో పనిమీద తన స్నేహితురాలు కావ్యతో కలిసి బయటకు వచ్చింది. అనుకోకుండా కావ్య స్పృహ తప్పిపడిపోయింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న కుమార్, స్నేహితురాలికి సాయం చేయడానికి స్వప్నకు సహకరించాడు. ఇద్దరూ కలిసి ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్ళారు. ఇక అప్పటి నుండి కుమార్‌కు, స్వప్నకు చిన్నచిన్నగా మాటలు కలిశాయి. ఇద్దరి మంచితనం గురించి తెలిసిన కావ్య వారికి సాయం చేసేది. ఆమె సాయంతో ఇద్దరూ అప్పుడప్పుడు కలిసి మాట్లాడుకునేవారు. అలా అలా రోజులు గడిచిపోతున్నాయి.

ఇద్దరికీ పరిచయమై అప్పుడే ఏడాది గడిచింది. ఒకరినొకరు చూడకుండా ఉండలేని స్థితికి వచ్చారు. ఇద్దరి మధ్య ప్రేమ పెరుగుతున్నా చనువు మాత్రం తీసుకోలేదు. ఎవరి హద్దుల్లో వారు ఉండేవారు. ఇంత గాఢంగా ప్రేమించుకుంటున్న వీరిద్దరు ఎప్పటికైనా ఒకటి కావాలని కోరుకునేది కావ్య.

ఒకరోజు స్వప్న కంగారు కంగారుగా కావ్య దగ్గరకు వచ్చింది. ఆ ముందురోజే స్వప్నకు పెండ్లి చూపులు జరిగాయి. అంతా సడన్‌గా జరిగిపోయింది. విషయం కుమార్‌కు చెప్పే సమయం కూడా లేకుండా పోయింది. వచ్చిన వారికి స్వప్న నచ్చింది. ఇంట్లోవాళ్ళు ఆమె అభిప్రాయం అడక్కుండానే పెండ్లి కూడా నిర్ణయించేశారు. ఇదే విషయాన్ని స్వప్న, కావ్యకు చెప్పింది. ఏం చేయడానికి సమయం లేదు. తన ప్రేమ విషయం ఇంట్లో చెప్పే ధైర్యం స్వప్నకు లేదు. కావ్య ఎంత నచ్చజెప్పినా ఇంట్లో చెప్పడానికి స్వప్న ఒప్పుకోలేదు. ఇక చేసేది లేక చివరకు కుమార్‌తో ఎక్కడికైనా వెళ్ళిపొమ్మని సలహా ఇచ్చింది.

స్వప్న పెండ్లి గురించి కుమార్‌కు తెలిసింది. తన తల్లిని ఎలాగైనా ఒప్పించి పెండ్లి చేసుకుంటానని స్వప్నను బతిమలాడాడు. ఇంటికి వెళ్ళి ఆలోచించుకొని చెబుతానని ఆమె వెళ్ళిపోయింది. ఇంటికైతే వెళ్లింది కాని స్వప్న నిర్ణయం తీసుకోవడానికి ధైర్యం చేయలేదు. చివరికి పెండ్లి తేదీ ఖరారు చేశారు. అంతా జరిగిపోయింది. స్వప్న మనసు నిండా కుమార్ ప్రేమను, కండ్ల నిండా అతని ప్రతిరూపాన్ని దాచుకొని అడుగులు భారంగా వేసుకుంటూ అత్తారింటికి వెళ్ళింది. స్వప్నను ఎంతో గాఢంగా ప్రేమించిన కుమార్ దీన్ని భరించలేకపోయాడు. ఆమె లేని ఊళ్ళో ఉండలేక తను పని చేస్తున్న షాప్ సిటీలో ఉంటే అక్కడికి మార్పించుకున్నాడు. అప్పటినుంచి ఊరికి రాకుండా తల్లికి డబ్బులు పంపించేవాడు.

కట్టుకున్న భర్తను మోసం చేయకూడదనీ, ఎలాగైన కుమార్ జ్ఞాపకాల నుంచి బయటపడాలని నిర్ణయించుకుంది స్వప్న. అయితే రెండు వారాలు మాత్రమే ఆమె అత్తారింట్లో సుఖంగా ఉంది. తర్వాత ఇంట్లో గొడవలు మొదలయ్యాయి. అత్తకు, భర్తకు తెలియకుండా స్వప్న ఎవరితో మాట్లాడకూడదు. చివరకు తల్లిదండ్రులతో కూడా. ఎవరితో మాట్లాడినా అనుమానిస్తారు. బయట అడుగుపెట్టనివ్వరు. అన్నీ వారి అడుగుజాడల్లోనే జరగాలి. ఎంత సర్దుకు పోదామనుకున్నా వారి ప్రవర్తన ఆమెకు అస్సలు నచ్చలేదు. భర్త తల్లిమాటలు తప్ప స్వప్న మాటలు అస్సలు పట్టించుకోడు. చిన్న విషయానికి కూడా విపరీతంగా కొడతాడు.

ఒకరోజు ఇంటి ముందు ముగ్గువేస్తుంటే చేతిలోని ముగ్గు గిన్నె చేయిజారి కిందపడింది. దాంతో అత్త స్వప్నపై చేయిచేసుకుంది. ఇంత చిన్న విషయానికే ఆమె కొట్టడం నచ్చని స్వప్న మొదటి సారి అత్తకు ఎదురు మాట్లాడింది. ఆ రోజు ఇంట్లో యుద్ధమే జరిగింది.

ఇక అప్పటి నుంచి భర్త స్వప్నతో మాట్లాడటమే మానేశాడు. రాత్రి ఆ కాసేపు తన అవసరం తీర్చుకొని వెళ్ళిపోయేవాడు. అతనితో గడిపే ప్రతి రాత్రి ఆమెకు ఓ నరకంలా అనిపించింది. ఆమె ఒప్పుకోకపోతే బలవంతం చేసేవాడు. పశువులా ప్రవర్తించేవాడు. ఇలాంటి పరిస్థితుల్లో ఆమెకు కుమార్ బాగా గుర్తుకు వచ్చేవాడు. తనను ఎంతో ప్రేమించిన వ్యక్తిని వదులుకొని వచ్చినందుకు ఇదే తనకు పెద్ద శిక్ష అని మనసులోనే తనని తాను తిట్టుకునేది. కొన్ని రోజులకు స్వప్న నెల తప్పింది. దాంతో ఆమెకు జీవితంపై కొత్త ఆశలు పుట్టాయి. పుట్టబోయే బిడ్డకోసమైనా భర్త తనని ప్రేమగా చూసుకుంటాడనుకుంది. కానీ అతని ప్రవర్తనలో ఏమాత్రం మార్పు లేదు. నెలలు నిండాయి. పాప పుట్టింది. అయినా భర్త పెట్టే చిత్రహింసల నుంచి ఆమెకు విముక్తి కలగలేదు.

అత్తతో కలిసి ఉండలేనంటే వేరే కాపురం పెట్టించారు. అప్పటినుండి ఆమె కష్టాలు ఇంకా ఎక్కువయ్యాయి. భర్త ఇంటి అద్దె కట్టడు. డబ్బులు అడిగితే 'ఎక్కడికన్నా వెళ్ళి డబ్బు సంపాదించుకురా' అని కొట్టేవాడు. పాప పాల ఖర్చులకు కూడా డబ్బిచ్చేవాడు కాదు. అతను కొట్టినప్పుడల్లా పుట్టింటికి వెళ్ళేది. 'ఎంత కొట్టినా ఆడపిల్ల జీవితం భర్తతోనే. ఇలా వచ్చేస్తే మన పరువు పోతుంది' అని అమ్మానాన్న నచ్చజెప్పి అతని దగ్గరకే పంపేవారు.

అలా మూడు సంవత్సరాలు గడిచిపోయాయి. చివరికి స్వప్నకు భర్త రెండో పెండ్లి చేసుకోవాలనే ఆలోచన వచ్చింది. కట్నం ఎక్కువగా వస్తుందని తమ్ముడు, తల్లి ఆశ చూపారు. అతని రెండో పెండ్లికి అడ్డంగా ఉన్న స్వప్నను చంపడానికి ప్రయత్నించాడు. తప్పించుకొని పుట్టింటికి చేరుకుంది. వారికి ఈ విషయం చెబితే ఆమె మాటలు వాళ్ళు నమ్మలేదు. కారణం అల్లుడు మెత్తమెత్తగా మాట్లాడటం. అప్పటి వరకు భర్త ఎప్పటికైనా మారతాడనే నమ్మకం ఆమెలో ఉండేది. ఎప్పుడైతే తనను చంపడానికి ప్రయత్నించాడో అప్పుడే నమ్మకాన్ని కోల్పోయింది. ఇక్క అక్కడికి వెళ్ళనంటే వెళ్ళనని మొండికేసింది. ఇక చేసేది లేక తల్లిదండ్రులు మౌనంగా ఉండిపోయారు. భర్తను వదిలి వచ్చిందని చుట్టుపక్కలవారు, అప్పుడప్పుడు ఇంట్లో వారు కూడా స్వప్నను సూటిపోటి మాటలు అనేవారు. ప్రస్తుతం పాప కోసం అన్నీ భరిస్తూ పుట్టింట్లోనే ఉంటూ కుట్టుపని నేర్చుకుంటుంది.

స్వప్న కష్టాలను తెలుసుకున్న కుమార్ రెక్కలు కట్టుకొని వాలిపోయాడు. ఆమెను కలవడానికి చాలా ప్రయత్నించాడు. కానీ స్వప్న అతని ముందుకు రావడానికి ధైర్యం చేయలేకపోయింది. అప్పుడే కుమార్‌కు కావ్య గుర్తుకు వచ్చింది. పెండ్లి చేసుకొని సిటీలో ఉంటున్న ఆమెను పిలిపించాడు కుమార్. కావ్య వచ్చి ఇద్దరినీ కలిపే ప్రయత్నం చేసింది. కుమార్, స్వప్నను పెండ్లి చేసుకుంటానని అడిగాడు. ఆమె ముందు ఒప్పుకోలేదు. కావ్య, కుమార్ ఎంతో బతిమలాడితే చివరకు ఒప్పుకుంది. కానీ ఈ పెండ్లికి స్వప్న ఇంట్లో అస్సలు ఒప్పుకోలేదు. పైగా ఆమెను విపరీతంగా కొట్టారు. దాంతో కావ్య, స్వప్నను తీసుకొని ఐద్వా లీగల్‌సెల్‌కు వచ్చింది.

విషయాలన్నీ తెలుసుకున్న సభ్యులు ముందు స్వప్న తండ్రికి ఫోన్ చేశారు. ఆయన చాలా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు. భర్తకు ఫోన్ చేస్తే అతని నుంచి ఎలాంటి స్పందన లేదు. రెండు వారాలు వేచి చూద్దామని సభ్యులు చెప్పారు. నెలరోజులైనా వారి నుంచి ఎలాంటి స్పందన రాలేదు. దాంతో సభ్యులు కుమార్‌ని పిలిపించి మాట్లాడారు. అతను స్వప్నను, ఆమె బిడ్డను ప్రేమగా చూసుకుంటానని మాట ఇచ్చాడు. అయితే 'చట్ట ప్రకారంగా స్వప్న విడాకులు తీసుకోకుండా నీతో కలిసి ఉండటానికి కుదరదు. అలా ఉండటం ముఖ్యంగా స్వప్నకు మంచిది కాదు. కాబట్టి మీరు ఆలోచించుకోండి' అని చెప్పారు. దాంతో భర్త నుండి విడాకులు తీసుకోవడానికి స్వప్న లాయర్‌ని కలిసింది. ప్రస్తుతం ఆమె పాపతో కలిసి ఓ హాస్టల్‌లో ఉంటూ కోర్టు ద్వారా విడాకులు తీసుకునే ప్రయత్నంలో ఉంది. కుమార్‌తో తన కొత్త జీవితాన్ని ప్రారంభించడానికి వేయి కండ్లతో ఎదురు చూస్తుంది. కుమార్ కూడా అంతే!

సలీమ

ఐద్వా అదాలత్
సెల్: 9490098024

అత్తతో కలిసి ఉండలేనంటే వేరే కాపురం పెట్టించారు. అప్పటినుండి ఆమె కష్టాలు ఇంకా ఎక్కువయ్యాయి. భర్త ఇంటి అద్దె కట్టడు. డబ్బులు అడిగితే 'ఎక్కడికన్నా వెళ్ళి డబ్బు సంపాదించుకురా' అని కొట్టేవాడు. పాప పాల ఖర్చులకు కూడా డబ్బిచ్చేవాడు కాదు. అతను కొట్టినప్పుడల్లా పుట్టింటికి వెళ్ళేది. 'ఎంత కొట్టినా ఆడపిల్ల జీవితం భర్తతోనే. ఇలా వచ్చేస్తే మన పరువు పోతుంది' అని అమ్మానాన్న నచ్చజెప్పి అతని దగ్గరకే పంపేవారు.

ఒంటరిగా వెళ్తుంటే!



అమ్మాయిలు ఇంటి నుంచి బయటకు వెళ్తే తిరిగి వచ్చే వరకు తల్లిదండ్రులకు ఓ లాంటి భయం వెంటాడుతుంది. తల్లిదండ్రుల్లో ఉండే ఆందోళనను, భయాలను తొలగించాలంటే అమ్మాయిలు కొన్ని చిట్కాలను పాటించాల్సిందే!

- ఆఫీసు లేదా కాలేజీ నుంచి ఒంటరిగా వీధుల్లో నడిచేటప్పుడు కొన్నిసార్లు భయం వెంటాడుతుంది. అలాంటి పరిస్థితుల్లో మానసికంగా దృఢంగా ఉండాలి. ఎక్కువ ట్రాఫిక్ ఉన్నచోట నడవడం మంచిది. కొన్ని సందర్భాల్లో ఒంటరిగా, ఎడారిలో నడిచినట్టు అనిపిస్తుంది. అలా భావన వెంటాడుతుంటే సాధ్యమైనంత వరకు ఫోన్ వాల్యూమ్‌ను చిన్నగా పెట్టుకోవాలి. ఎందుకంటే చుట్టు పక్కల వచ్చే శబ్దాలను పసిగట్టవచ్చు.
- రాత్రి సమయంలో లైట్ కలర్ ఉండే దుస్తులను ధరించడం మంచిది. లైట్ కలర్స్ రాత్రి సమయంలో ఎక్కువగా కనిపించవు.
- ఒంటరిగా ఇంట్లో నుంచి వెళ్తుంటే బ్యాగులో సెల్ఫ్ ఫైల్స్, తాళాలు, అవసరమైన వస్తువులను లోపల జాగ్రత్తగా పెట్టుకోవాలి. అయితే సెల్‌ఫోన్ మాత్రం చేతిలో పట్టుకోవాలి. ఏదైనా ఆపద వస్తే వెంటనే తీసుకోవడానికి వీలుగా చేతిలో పట్టుకుంటే మరీ మంచిది.
- అలాగే పాదాలకు సౌకర్యవంతమైన చెప్పులను వేసుకోవాలి. పరిగెత్తడానికి, త్వరగా నడవడానికి సులువుగా ఉండే చెప్పులను ఎంపిక చేసుకుంటే మంచిది. ముఖ్యంగా అమ్మాయిలు గుర్తుంచుకోవాల్సిన విషయం ఒంటరిగా బయటకు వెళ్లేటప్పుడు హై హీల్స్ వేసుకోకపోవడం మంచిది.

నెయిల్ పాలిష్ ఫ్రెష్‌గా..

- నెయిల్ పాలిష్ ఎండిపోకుండా ఉండాలంటే సీసాను ఫ్రిజ్‌లో ఉంచాలి. నెయిల్ పాలిష్‌ను రిఫ్రిజరేటర్‌లో ఉంచేటప్పుడు బ్యూటి కిట్ షెల్ఫ్ సపరేట్‌గా ఉంటుంది. అందులో స్టోర్ చేయాలి. స్టోర్ చేసిన నెయిల్ పాలిష్‌లను ఒక నెలలోపు ఎండిపోకుండా లేదా చిక్కబడక ముందే ఉపయోగించుకోవాలి.




- ముఖ్యంగా సూర్యరశ్మి తగలని ప్రదేశంలో నెయిల్ పాలిష్‌ను ఉంచాలి. నెయిల్ పాలిష్ సీసాకు వేడి, ఎండ తగలడం వల్ల త్వరగా పాడవుతాయి.
- నెయిల్ పాలిష్ బాటిల్స్‌ను స్టోర్ చేసే టప్పుడు అవి నిటారుగా ఉండేలా చూసుకోవాలి. ఇలా చేయడం వల్ల త్వరగా ఎండి పోకుండా ఉండటమే కాకుండా ఎక్కువ రోజులు ఫ్రెష్‌గా ఉంటుంది. ఒక వేళ నెయిల్ పాలిష్ బాటిల్ పడిపోయినా వెంటనే దానిని తిరిగి నిటారుగా పెట్టాలి. ఇలా పెట్టడం వల్ల నెయిల్ పాలిష్ బాటిల్‌లో ఉన్న పదార్థం చిక్కబడకుండా కాపాడుకోవచ్చు.

Women of the day

'జ్వలిత నా కవిత' అంటూ...

ఆమె రచనలు అన్వేషణతో సాగి.. నేస్తమా నన్నందుకో అన్న విధంగా ఉంటాయి. అందుకే నాలుగు దశాబ్దాల పాటు రచనారంగంలో కొన సాగుతూ.. ఎన్నో నవలలు, కథలు రచించి పాఠకుల అభినందనలు అందుకున్నారు. ఆమే కోగంటి విజయలక్ష్మి.

కృష్ణాజిల్లా గుడివాడలో విజయలక్ష్మి జన్మించారు. ఆమె తండ్రి కోగంటి రాజబాపయ్య, తల్లి శకుంతలా దేవి.. చిన్నతనం నుంచే పుస్తక పఠనంపై అమిత మైన ఆసక్తితో విజయలక్ష్మి ఎన్నో పుస్తకాలు చదివారు. ఆ తర్వాత ఆమె రచనా వ్యాసంగాన్ని ప్రారంభించి దాదాపు 40 ఏండ్లకు పైగా సాహితీ



కోగంటి విజయలక్ష్మి
(29 జూలై, 1946 - 10మార్చి, 2016)

రంగంలో కొనసాగారు. ఆమె ఎన్నో నవలలు రచించారు. ఆమె కలం నుంచి వచ్చిన నవలల్లో 'జ్వలిత నా కవిత', 'మన్నించు ప్రియా', 'చక్రతీర్థం', 'చక్రవ్యూహం', 'నిక్షిప్త', 'అన్వేషణ', 'మచ్చలేని జాబిలి', 'నయనాంజలి', 'నేస్తమా నన్నందుకో', 'నన్ను ప్రేమించకు' తదితర నవలలు విశేషపాఠకుల ఆదరణను పొందాయి. ఆమె రాసిన అనేక కథలు వసుధ, పుస్తకం, కోకిల, వనిత, ఆంధ్రజ్యోతి, అంతరంగాలు తదితర పత్రికలలో ప్రచురితమయ్యాయి. రచయితగానే కాదు ఆయుర్వేద వైద్యురాలిగా కూడా ఆమె సుపరిచితం.

మహిళా ఉద్యమాల స్ఫూర్తిప్రదాత

భారతదేశ సామాజిక చరిత్ర ప్రారంభం నుంచి సమాజంలోని ఉన్నత వర్గాల దృష్టికోణాన్నే ప్రతిబింబించింది. సమాజంలో పరిమిత సంఖ్యకు చెందిన బ్రాహ్మణ క్షత్రియ వర్గాల స్త్రీలను దృష్టిలో ఉంచుకుని సంస్కరణలు రూపొందించిన సంస్కర్తలను గొప్పగా నిలిపిసమాజంలోని సమస్త రుగ్మతలపైన, విశాల ప్రాతిపదికన సామాజిక ఉద్యమాన్ని నిర్మించిన మహాత్మా జ్యోతీరావుఫూలే వంటివారిని చరిత్రపుటలలో కనిపించకుండా చెయ్యడం యాధృచ్ఛికం కాదని అర్థమవుతుంది. సావిత్రీబాయిఫూలేని చర్చించుకోవడమంటే యీ దేశంలో బ్రాహ్మణేతర సంఘసంస్కరణ ఉద్యమాన్ని, అణగారిన వర్గాలు, మహిళా ఉద్యమాల పునాదుల గురించి చర్చించడమే. ఇటీవల కాలంలో దేశవ్యాప్తంగా పెరుగుతున్న దళిత బహుజన స్త్రీ చైతన్యం వెలుగులో సావిత్రీబాయి కృషిని అర్థం చేసుకోవల్సిన అవసరం ఉంది.

తొలి మహిళా టీచర్...

సావిత్రీబాయి 1831 జనవరి 3న మహారాష్ట్రలోని సతారా జిల్లాలో ఖండోజీ, లక్ష్మీ అనే దంపతులకు జన్మించింది. ఆమెకు తొమ్మిదోయేట (1840)జ్యోతీరావుఫూలేతో వివాహం జరిగింది. అప్పటికి ఆయన వయసు పదమూడు సంవత్సరాలు మాత్రమే. ఇంగ్లీషు విద్య ద్వారా ఫూలే పాశ్చాత్యభావాలలో స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, మావవహక్కులు వంటివాటి పట్ల ఆకర్షితుడయ్యాడు. సామాజికంగా అభ్యుదయ అంశాల అధ్యయనరంతో చైతన్యపూరితమైన ఫూలేకి భారత సమాజంలో కులతత్వం, దాని తాలూకు అసమానతలు మూఢాచారాల పట్ల యేవగింపు కలిగాయి. కింది కులాలవారు, స్త్రీలు... పశువులకంటే హీనంగా పరిగణించబడడంపైన ఆయనలో తీవ్ర అసంతృప్తి కలిగింది. విద్య ద్వారా వారి స్థితిగతుల్లో మార్పు తీసుకురావచ్చునని నమ్మిన ఫూలే విద్యను 'మూడోకన్ను'గా భావించాడు. పెళ్ళికిముందు రెండు మూడు తరగతులవరకు చదువుకున్న సావిత్రీబాయి ఆయన చొరవతోనే తిరిగి చదువు ప్రారంభించింది. ఆ రోజుల్లో అణగారిన కులాలవారికి, స్త్రీలకు పాఠశాలలు లేవు. బ్రాహ్మణుల మఠాలలో యితరులకు స్థానం లేదు. యిటువంటి పరిస్థితులలో పరమహంస మండలి సభ్యుడైన భావల్కర్ క్రిష్టియన్ మిషనరీ అయిన జాఫర్సన్‌లు ఆమెకు చదువుకునే అవకాశాన్నే కాకుండా టీచర్‌గా శిక్షణ కూడా యిచ్చారు. ఆ విధంగా సావిత్రీబాయి ఈ దేశపు తొలి మహిళా టీచర్ అయింది.

పాఠశాలల స్థాపన...

ఫూలే దంపతులు పూనే పరిసర ప్రాంతాలలో బలమైన సామాజిక ఉద్యమాన్ని నిర్మించారు. ఫూలే ప్రారంభించిన సత్యశోధక సమాజంలోనూ, యితర కార్యక్రమాల లోనూ సావిత్రీబాయి క్రియాశీలకంగా పాల్గొని తొలితరం మహిళా వుద్యమానికి పునాదులు వేసింది. ఆమె 1847లో ఫూలేకి పినతల్లి వరసయ్యే సుగుణాబాయితో కలిసి మహర్లు నివసించే వాడలో మొదటి పాఠశాలను స్థాపించింది. ఆ తర్వాత పూనేలోని బిడేవాడలో ఆడపిల్లలకోసం ప్రత్యేక పాఠశాలను ఫూలే దంపతులు ప్రారం భించారు. ఆ పాఠశాలకు సావిత్రి మొదటి ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేసింది. తర్వాత ఆమె వ్యవసాయ కార్మికులు, 'అంటరాని' వారికొరకు రాత్రి పాఠశాలను స్థాపించింది. వీరు ప్రారంభించిన పాఠశాలల్లో ఆనాడు విద్యకు నోచుకోని అణగారిన కులాల విద్యార్థులెందరో చదువుకున్నారు.

ఎన్నో అవమానాలు...

ఉపాధ్యాయురాలిగా సావిత్రీబాయి యెంతో ఘర్షణపడి, అవమానాలకు యెదురీది తనను తాను నిరూపించుకుంది. కింది కులాల స్త్రీలకు, కర్మ జ్ఞానాధికారాలు లేని ఆ రోజుల్లో వెనుకబడిన కులానికి చెందిన చదువుకుని, పాఠశాల ఉపాధ్యాయిని అవ్వడం



అగ్రకులాలకు చెంపపెట్టుగా మారింది. ఆమె పాఠశాలకు వొచ్చి వెళ్ళేదారిలో ఆమెను వారు మాటలతో చేతలతో అవమానించేవారు. ఆమెపై కోడిగుడ్లు, బురద రాళ్ళు విసిరి కించపరిచేవారు. వొక్కోసారి వారి చేష్టలకు విసుగు చెందిన సావిత్రి ఉద్యోగం మానాలని కూడా అనుకుంది. కానీ ఆమె తన భర్త జ్యోతీరావుఫూలే యిచ్చిన మానసిక స్థయిర్యంతో తన కార్యక్రమాన్ని కొనసాగించింది. సావిత్రి స్కూల్‌కి వెళ్ళేటప్పుడు సంచిలో మరోచీర పెట్టుకుని వెళ్ళేది. ఫూలే దంపతుల కృషిని గుర్తించిన బ్రిటీష్ ప్రభుత్వం వారిని దుశ్శాలువాతో సత్కరించి సావిత్రీబాయిని ఉత్తమ ఉపాధ్యాయినిగా గౌరవించింది. ఆ రోజుల్లో బ్రాహ్మణీయ వర్గాల స్త్రీల విషయంలో బాల్యవివాహాలు, నిర్బంధ వైధవ్యంవంటి కట్టుబాట్లు కఠినంగా అమలయ్యేవి. ఆడపిల్లలకు చిన్నవయసులో వివాహం చెయ్యడమే కాకుండా భర్త చనిపోయిన స్త్రీలు తల వెంట్రుకలు కత్తిరించుకుని, తెల్లచీర కట్టుకుని నాలుగు గోడలమధ్య జీవించవల్సి ఉండేది. ఫూలే దంపతులు బ్రాహ్మణ వితంతువులకు శిరోముండనం చెయ్యవద్దని మంగలివారిని చైతన్యపరచడమే కాకుండా వారు ఆ పని చెయ్యబోమని స్వచ్ఛందంగా నిరసన వ్యక్తం చేసేవిధంగా ఫూలే దంపతులు కృషి చేశారు.

తల్లి ప్రేమను పంచుతూ...

బ్రాహ్మణ వితంతువులు ఇతర పురుషులవల్ల గర్భం దాల్చితే వారికి మరణమే శరణ్యం. వారు కాశీ ప్రయాగవంటి యాత్రాస్థలాలకు వెళ్లి అక్కడ ఆత్మహత్య చేసుకోవడమో లేక బిడ్డను వదిలించుకోవడమో జరిగేది. అటువంటి స్త్రీల కోసం సావిత్రీ బాయి 1852లో 'శిశు హత్యానిరోధక గృహాన్ని' ఏర్పాటు చేసింది. బ్రాహ్మణ వితంతువులు బిడ్డలను చంపకుండా వారిని తమ గృహంలో ఒదిలి వెళ్లాల్సిందిగా ఫూలే దంపతులు పోస్టర్లు అంటించి, కరపత్రాలు పంచిపెట్టారు. ఆ బాలలకోసం సావిత్రి ఒక ఊయలను ఏర్పాటు చేయగా అప్పటికప్పుడు ఎందరో బాలలు ఆ గృహానికి వచ్చి చేరారు. వారందరికీ సావిత్రీబాయి తానే తల్లి అయ్యారు. బిడ్డలు లేని ఫూలే దంపతులు ఎందరో బిడ్డలను పెంచారు. కాశీబాయి అనే బ్రాహ్మణ వితంతువు తన బిడ్డతో సహా ఆత్మహత్య కు పాల్పడుతుంటే ఫూలే దంపతులు వారిని అడ్డుకుని ఆ బిడ్డను తామే పెంచి పెద్ద చేశారు. అతడే డా॥యశ్వంతరావు. సావిత్రీబాయి మహిళా మండలిని ఏర్పాటు చేసి స్త్రీల సమస్యలపట్ల వారిలో అవగాహన కల్పించి వాటి పరిష్కారం కోసం కృషి చేసింది.

వర్గదృష్టితో...

'అంటరాని'వారికి బహిరంగ స్థలాల్లో ప్రవేశం నిషిద్ధమైన ఆ రోజుల్లో వారు బావుల్లో, చెరువుల్లో నీరు తాగితే అవి మైలపడతాయని భావించే పరిస్థితుల్లో ఫూలే దంపతులు తమ ఇంటి పెరట్లోని బావిని 'అంటరాని'వారికోసం ఇచ్చారు. 1870లో మహారాష్ట్రలో కరువు వచ్చినప్పుడు సావిత్రీబాయి పేదలకోసం ఉచిత భోజన వసతి ఏర్పాటు చేసింది. హాస్టళ్లను నిర్మించి కరువు నివారణకు సత్వరం చర్యలు చేపట్టాల్సిందిగా బ్రిటీష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆమె దేశంలోనే మొట్టమొదటి కార్మిక మహిళా సమాఖ్యను ఏర్పాటు చేసి తన వర్గ దృష్టిని చాటుకుంది.

సత్యశోధక సమాజ్ బాధ్యతలు...

సావిత్రీబాయి భర్తచాటు భార్యగా కాక తన జీవితంలోని ప్రతి ఘట్టంలోనూ పితృస్వామిక సమాజానికి సవాలుగా జీవించింది. ఈ దేశపు అణగారిన కులాల అస్తిత్వంపై మొదటిసారిగా ఉద్యమాన్ని నిర్మించి ఈనాటి బహుజనవాదానికి పునాదులు వేసిన మహాత్ముడు జ్యోతిరావుఫూలే భావాలను ప్రేమించి ఆయన మరణానంతరం ఫూలే ప్రారంభించిన 'సత్యశోధక' సమాజానికి ఛైర్ పర్సన్‌గా బాధ్యతలు చేపట్టింది. ఆయన సామాజిక విప్లవ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లింది. ఫూలే మరణించినప్పుడు తానే స్వయంగా ఆయనకు అంత్యక్రియలను నిర్వహించింది. స్త్రీలకు కర్మజ్ఞానాధికారాలను నిరాకరించిన బ్రాహ్మణీయ సమాజానికి ఈ చర్య మరో చెంపపెట్టు.

సేవ చేస్తూ...

సావిత్రీబాయి ఒకవైపు సామాజిక సేవా కార్యక్రమాల్లో విశ్రాంతిలేకుండా పనిచేస్తూనే మరోవైపు తన భావజాల వ్యాప్తికొరకు రచనలు చేసింది. 'కావ్యఫూలే'(1844), 'భావన్ కషి సుబోధ రత్నాకర్'(1882) అనే రెండు కవితా సంపుటాలను రచించింది. ఫూలే అముద్రిత రచనలు, ప్రసంగాలను ప్రచురించింది. 1890లలో పూనే పరిసర ప్రాంతాల్లో ప్లేగువ్యాధి సోకినప్పుడు ఆమె, తన కుమారుడు యశ్వంతరావుతో కలిసి రోగులకు సేవ చేస్తూ ఆ వ్యాధి బారి పడిన సావిత్రీబాయి 1897మార్చి10వ తేదీన మరణించింది.

విశాల దృక్పథం...

తన పనిలో నిమజ్ఞత, నిబద్ధతలకు మారుపేరు సావిత్రీబాయిఫూలే. సావిత్రీబాయితోపాటు ఒక ముస్లిం కుటుంబానికి చెందిన అన్నాచెల్లెళ్ళు పనిచెయ్యడం విశేషం. ఫూలే దంపతులు తమ వర్గపు ప్రజలకొరకే కాకుండా సమాజంలో బాహ్మణవాదం చేత అణచివేతకు గురయ్యే ఆ వర్గపు స్త్రీల కోసం ఉద్యమాన్ని నిర్మించి బ్రాహ్మణ వితంతువు కన్నబిడ్డను చివరిదాకా తమ సొంత కొడుకుగా చూసుకోవడం తమ కార్యక్రమాలలో దళిత, ముస్లిం మైనారిటీలను భాగస్వామ్యం చెయ్యడం వారి విశాల ప్రాపంచిక దృక్పథానికి నిదర్శనం. సావిత్రీబాయి లేనిదే ఈనాటి అస్తిత్వ ఉద్యమాలను ఊహించలేం. స్త్రీ విద్యకోసం వారి పట్ల అమలవుతున్న సామాజిక దుర్నీతిని అంతమొందించడంకోసం తమ జీవితాలను ఫణంగా పెట్టిన ఫూలే దంపతులు ఎప్పటికీ ప్రాతహ్ స్మరణీయులు. సావిత్రీబాయి కేవలం భారతదేశపు మొదటి మహిళా ఉపాధ్యాయని మాత్రమే కాదు, స్త్రీవాద బహుజన ఉద్యమాలకు స్ఫూర్తి ప్రదాత.



ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి
ఆచార్యనాగార్జునాయూనివర్సిటీ
9440362433

రూ.635 కోట్లతో సంపన్న ప్రాంతీయ పార్టీగా ఎస్పీ

- రూ.257 కోట్లతో రెండో స్థానంలో డీఎంకే
- అప్పుల్లో కూరుకుపోయిన టీఆర్ఎస్, టీడీపీ..!!

న్యూఢిల్లీ: ఉత్తర్‌ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్‌యాదవ్ నేతృత్వంలోని సమాజ్‌వాదీ పార్టీని దేశంలోనే అత్యంత సంపన్నమైన ప్రాంతీయ పార్టీగా ఢిల్లీకి చెందిన మేధోమథన సంస్థ అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫామ్స్(ఏడీఆర్) తన నివేదికలో పేర్కొన్నది. 2015-16లో ఎస్పీ ప్రకటించిన మొత్తం ఆస్తుల విలువ రూ.634.96 కోట్లుగా ఏడీఆర్ తెలిపింది. తమిళనాడుకు చెందిన డీఎంకే రూ.257.18 కోట్లతో రెండో స్థానంలో, రూ.224.84 కోట్లతో ఏఐఏడీఎంకే మూడో స్థానంలో నిలిచాయి. 2011-12లో ఎస్పీ ప్రకటించిన ఆస్తుల విలువ రూ.212.86 కోట్లు కాగా, 2015-16 వరకల్లా అవి రూ.634.96 కోట్లకు చేరాయి. అంటే..198 శాతం పెరిగాయి.

2011 మార్చిలో రిజిస్టరైన వైఎస్ఆర్ కాంగ్రెస్, 2012లో నమోదైన ఆమ్‌ఆద్మీపార్టీల సగటు ఆస్తి 2012-13లో రూ.1.165 కోట్లుగా, 2015-16లో రూ.3.765కోట్లుగా ఏడీఆర్ నివేదిక తెలిపింది. పార్టీల స్థిరాస్తులు, అప్పులు, అడ్వాన్స్‌లు, డిపాజిట్లు, టీడీఎస్, పెట్టుబడులు, ఇతర ఆస్తులతో కలిపి నివేదిక రూపొందించినట్టు ఏడీఆర్ తెలిపింది. టీఆర్ఎస్, టీడీపీ పార్టీలు మాత్రం తమకు అప్పులు ఎక్కువగా ఉన్నట్టు చూపాయి. 2015-16లో టీఆర్ఎస్ రూ.15.97 కోట్లు అప్పుగా చూపగా, టీడీపీ రూ.8.186 కోట్లు అప్పులున్నట్టు తెలిపింది. 2011-12లో మాత్రం అప్పులేమీ లేనట్టు టీఆర్ఎస్ తెలిపింది.

సీపీఐ(ఎం) నేత కృష్ణకుమారి కన్నుమూత

రాజమహేంద్రవరం: సీపీఐ(ఎం) నాయకురాలు, జిఎస్ బాలాజీదాస్ సతీమణి, రాజమహేంద్రవరం మాజీ కౌన్సిలర్ జి.కృష్ణకుమారి(84) శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు కన్నుమూశారు. బాలాజీదాస్, కృష్ణకుమారి దంపతులకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. కొంతకాలంగా తన అల్లుడు, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎంపి డాక్టర్ మిడియం బాబూరావు ఇంటి వద్దే కృష్ణకుమారి ఉంటున్నారు. మోరంపూడి దగ్గరలోని సాయినగర్ మిడియం బాబూరావు ఇంటిలోనే ఆమె తుదిశ్వాస విడిచారు. రాజమ హేంద్రవరం మున్సిపాలిటీగా ఉన్నప్పుడు 1968 -81లో ఆమె కౌన్సిలర్‌గా పనిచేశారు. ఆమె నగరా నికి సమర్థవంతమైన సేవలందించారు. అనేక ప్రజా ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. అధిక ధరలపై ఉద్యమం చేసిన నేపథ్యంలో 1974లో కృష్ణకుమారిని అరెస్టు చేసి, రాజమహేంద్రవరం సెంట్రల్‌జైలుకు తరలించారు.

ఆనందనగర్, శాటిలైట్ సిటీ ప్రాంతాల్లో పేదలకు ఇండ్లపట్టాలు ఇప్పించడంలో విశేష కృషి చేశారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎంవిఎస్ శర్మ, మంతెన సీతారాం, ప్రజాశక్తి ఎడిషన్ మేనేజర్ టిఎస్.ప్రకాష్, సీపీఐ(ఎం) నాయకులు ఎస్ఎస్.మూర్తి, పోలిన వెంకటేశ్వరరావు, ఎన్.భీమేశ్వరరావు తదితరులు కృష్ణకుమారి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. సీపీఐ(ఎం) జిల్లా (కాకినాడ) కమిటీ కార్యదర్శి కెఎస్.శ్రీనివాస్, కార్యదర్శివర్గ సభ్యులు శేషబాబ్జీ, రాజ మహేంద్రవరం జిల్లా కమిటీ కార్యదర్శి టి.అరుణ్, ఐద్వా రాజమహేంద్రవరం జిల్లా కార్యదర్శి పి.తులసి తదితరులు నివాళులర్పించారు.



కృష్ణకుమారి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎంవిఎస్ శర్మ, మంతెన సీతారాం, టిఎస్ ప్రకాష్

హైదరాబాద్‌లో బాలికపై లైంగికదాడి

నవతెలంగాణ - చిలకలగూడ

బాలికపై లైంగికదాడి జరిగింది. ఈ ఘటన హైదరాబాద్ చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. చిలకలగూడ హమాలీ బస్తీకి చెందిన బాలిక సికింద్రాబాద్‌లోని కీస్ హైస్కూల్‌లో ఏడో తరగతి చదువుతోంది. అదే ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ నర్సింహ బాలికను ఆటోలో ఎక్కించుకొని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితుడు పరారీలో ఉన్నాడు. నిందితునిపై ఐపీసీ 363, 376, 506 కింద కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

మా ఉత్తర్వులు ఎందుకు అమలు చేయలేదు

- తెలంగాణ సర్కారుకు హైకోర్టు ప్రశ్న

హైదరాబాద్ : రైతు రుణ విమోచన కమిషన్‌ను మూడు మాసాల్లో ఏర్పాటు చేయాలనే తమ ఉత్తర్వుల్ని ఎందుకు అమలు చేయలేదో వివరించాలని, మీపై కోర్టు ధిక్కార చర్యలు ఎందుకు తీసుకోరాదో కూడా తెలియజేయాలని తెలంగాణ సర్కార్‌ను హైకోర్టు ఆదేశించింది. ఈమేరకు శుక్రవారం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ నోటీసులు జారీ చేసింది. వచ్చే విచారణ సమయంలో స్వయంగా హాజరై వివరణ ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. తెలంగాణ రాష్ట్ర రుణ విమోచన చట్టం 2016 లోని సెక్షన్ 3(1) ప్రకారం రైతులు, వ్యవసాయ కూలీలు తదితరుల సంక్షేమం కోసం కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్న నిబంధనల్ని అమలు చేయకపోవడాన్ని తప్పుపడుతూ మాజీ ఎమ్మెల్యే ఎన్. ఇంద్రసేనారెడ్డి దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని బెంచ్ శుక్రవారం విచారించింది. మూడు నెలల్లో ఏర్పాటు చేయాలని గత ఏడాది ఆగస్టులో హైకోర్టు ఆదేశాలు అమలు కాలేదంటూ ఆయన కోర్టు ధిక్కార రిట్ వేశారు.

రాష్ట్ర పోలీసుల పని తీరు భేష్ : రష్యా రాయబారి

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

శాంతి భద్రతలను కాపాడంలో, నేరాలను అదుపు చేయడంలో రాష్ట్ర పోలీసుల పని తీరు భేష్‌గా ఉందని ఢిల్లీలోని రష్యా రాయబారి ఐగోర్‌బెద్రెవ్ డీజీపీ మహేందర్‌రెడ్డిని అభినంధించారు. శుక్రవారం డీజీపీ కార్యాలయానికి వచ్చిన ఆయన మహేందర్‌రెడ్డిని కలిసి అభినందన పత్రాన్ని అందచేశారు. ఢిల్లీలోని తమ రాయబార కార్యాలయానికి అవసరమైన రాడార్ యంత్ర పరికరాలను సరఫరా చేయమని గుంటూరుకు చెందిన రంగబాబు అనే కాంట్రాక్టర్‌కు రష్యా రాయబార కార్యాలయం అధికారులు పని అప్పగించారు.

రాజ్యసభకు కాంగ్రెస్ పోటీ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేయాలని కాంగ్రెస్ శాసనసభా పక్షం(సీఎల్పీ) నిర్ణయించింది. రాజ్యసభకు పోటీ చేసేందుకు మాజీ ఎంపీ రవీంద్రనాయక్, మాజీ ఎంపీ అజహరుద్దీన్, టీపీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. దీనిపై పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాజ్యసభ సీట్లలో ఒకటి అమరవీరుల కుటుంబసభ్యులకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని రేవంత్‌రెడ్డి, వి హనుమంతరావు, షబ్బీర్‌అలీ డిమాండ్ చేశారు.

భార్గవి నిందితులను శిక్షించాలి

- ఎంబీసీ కులాల జాబితా విడుదల చేయాలి : సంఘం రాష్ట్ర కార్యదర్శి పైళ్ల ఆశయ్య



మాట్లాడుతున్న ఆశయ్య

నవతెలంగాణ- హైదరాబాద్ సిటీబ్యూరో

యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం బుజలాపురంలో జరిగిన బొడ్డుపల్లి భార్గవి హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని ఎంబీసీల సంఘం రాష్ట్ర కార్యదర్శి పైళ్ల ఆశయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. భార్గవిని పెండ్లి పేరుతో అదే గ్రామానికి చెందిన కాసగాని నరేందర్ తీసుకుపోయి వ్యవసాయ బావి వద్ద చంపి పూడ్చేశాడని చెప్పారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనే నాలుగు కులదురహంకార హత్యలు జరిగాయని, ఇది అత్యంత ఆందోళనకర విషయమని అన్నారు. అలాగే, ఎంబీసీ కులాల జాబితాను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రూ.వెయ్యి కోట్ల బడ్జెట్‌ను ఖర్చు చేయడం కోసం ఎస్సీ, ఎస్టీలకు ఇస్తున్న మాదిరే ఎంబీసీలకూ 80 శాతం సబ్సిడీ ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. అయితే కులాల జాబితా ప్రకటించకుండా రూ.లక్ష నుంచి రూ.12 లక్షల వరకు సబ్సిడీ రుణాలివ్వాలని సీఎం ఆదేశించారని, దీనికి ఏయే కులాలను ఎంబీసీలుగా పరిగణిస్తారో చెప్పాలని కోరారు. ఈ సమావేశంలో టీమాస్ రాష్ట్ర నాయకులు బహదూర్ శ్రీనివాస్, మన్నారం నాగరాజు, రజక సంఘం రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షులు ఎం.రాజేశ్వరి, ఎంబీసీల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.నరేష్, నగర అధ్యక్షులు కె.విమల పాల్గొన్నారు.

భైంసాలో దారుణ హత్య

- తల నరికేసి డ్రయినేజీలో పడేసిన వైనం

నవతెలంగాణ-భైంసారూరల్


నిర్మల్ జిల్లా బాసరలో జంటహత్యల ఘటనను మరువకముందే భైంసాలో మరో దారుణహత్య జరిగింది. గుర్తుతెలియని వ్యక్తి తలను నరికేసి డ్రయినేజీలో పడేశారు. ఈ ఘటన శుక్రవారం వెలుగుజూసింది. పోలీసుల వివరాల ప్రకారం..భైంసా ఏరియాస్పత్రి వెనుకవైపు గల నర్సింహనగర్ రోడ్డులోని సాక్షి హస్పిటల్ దగ్గరలో మున్సిపల్ సిబ్బంది చెత్తను తీసేందుకు వెళ్లారు. అక్కడ డ్రయినేజీలో నరికేసిన ఓ తల కనిపించింది. దీంతో పోలీసులకు మున్సిపల్ సిబ్బంది సమాచారం అందించారు. డీఎస్పీ అందె రాములు, పట్టణ సీఐ శ్రీనివాస్ ఘటనాస్థలికి చేరుకొని పరిశీలించారు. అనంతరం తలను ఏరియాస్పత్రికి తరలించి పోస్టుమార్టం గదిలో భద్రపర్చారు. డాగ్‌స్క్వాడ్‌లతో తనిఖీలు చేపట్టగా జాగిలం ఘటనా స్థలం నుంచి నిర్మల్ చౌరస్తా వరకు వెళ్లి ఆగిపోయింది. హత్యకుగురైన వ్యక్తి స్థానికుడు కాదని, మహారాష్ట్రలో హత్యచేసి తలను ఇక్కడ పడేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

ప్రయివేటు విద్యాసంస్థల సమస్యల పరిష్కారానికి కృషి : కడియం

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

ప్రయివేటు విద్యాసంస్థల సమస్యలను ముఖ్యమంత్రి కేసీఆర్ దష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి హామీ అన్నారు. విద్యా సంస్థల యాజమాన్యాలు సామాజిక బాధ్యతతో విద్యార్థులను ఆందోళనకు గురి చేయకుండా పరీక్షలకు పూర్తిగా సహకరించాలని కోరారు. సచివాలయంలో శుక్రవారం కేజీ టు పీజీ విద్యా సంస్థల జేఏసీ ప్రతినిధులు ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరితో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. విద్యా సంస్థలకు సంబంధించి ఆస్తిపన్ను, కరెంటు బిల్లు, ఫీజుల పెంపు వంటి ఆర్థిక అంశాలను ముఖ్యమంత్రి దష్టికి తీసుకెళ్లి పరిష్కరించే ప్రయత్నం చేస్తానని కడియం శ్రీహరి జేఏసీ నేతలకు హామీ ఇచ్చారు. విద్యాశాఖ తరపున ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య, ఉన్నత విద్య కమిషనర్ నవీన్ మిట్టల్, ఇంటర్ బోర్డు కార్యదర్శి అశోక్, పాఠశాల విద్యా సంచాలకులు కిషన్, సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శి బుద్ధప్రసాద్, డైరెక్టర్ కరుణాకర్, కేజీ టు పీజీ విద్యాలయాల జేఏసీ నేతలు రమణారెడ్డి, పాపిరెడ్డి, నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఎస్‌బీజీకెఎస్ నాయకులు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సింగరేణి బొగ్గు గని కార్మికుల సంఘం (ఎస్‌బీజీకెఎస్) అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్రావు, రాజిరెడ్డిలు ప్రగతి భవన్లో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావును కలిశారు. తమను ఆయా పదవులకు ఎంపిక చేసినందుకు కతజ్ఞతలు తెలిపారు. వారి వెంట ఎస్‌బీజీకెఎస్ గౌరవాధ్యక్షురాలు, ఎంపీ కె కవిత కూడా ఉన్నారు. ఈ సందర్భంగా ఇటీవల కోల్‌బెల్ట్ ప్రాంతంలో జరిగిన సభల్ని సక్సెస్ చేసినందుకు సీఎం కేసీఆర్ వారిని అభినందించారు. కేవలం గౌరవపూర్వకంగానే సీఎం కేసీఆర్‌ను కలిశామని నాయకులు తెలిపారు.

ఇంటర్ ఫీజులు పెంచొద్దు : టీఎస్ఎఫ్ డిమాండ్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఇంటర్మీడియట్ ఫీజుల్ని పెంచాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ట్రైబల్ స్టూడెంట్స్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆసంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూక్యా చందునాయక్, మూడ్ శోభన్ నాయక్‌లు ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే కేజీ టు పీజీ ఉచిత విద్య అందిస్తామన్న ప్రభుత్వం మాటలకు, చేతలకు పొంతన లేదని విమర్శించారు. దళిత, గిరిజన, బలహీనవర్గాలు, మైనార్టీలకు విద్య అందుబాటులో లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తంచేశారు.

లెటర్ పాతది.. నాటకం కొత్తది..!

- ఎంహెచ్‌ఆర్డీ అనుమతిలేకుండానే పదేండ్లగా కొనసాగుతున్న 'ఓసీఐ' ఉద్యోగులు
- జాతీయత తప్పుగా చెప్పి ఉద్యోగాలు పొందినా చర్యలు నిల్
- హెచ్‌సీయూ నియామకాల్లో భారీగానే అక్రమాలు

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ)లో నియామకాల పంచాయతీ రోజుకోకటి వెలుగుచూస్తున్నది. జాతీయత తప్పుగా చెప్పుకున్న ఓవర్‌సిస్ సిటిజన్స్ ఆఫ్ ఇండియా(ఓసీఐ) ఐదుగురు ఉద్యోగులను అనధికారికంగానే పదేండ్ల పాటు కొనసాగించారు. వర్సిటీ అధికారులు 2007లో ఉద్యోగాలివ్వగా, ఎంహెచ్‌ఆర్డీ మాత్రం వారికి 2018లో అనుమతించింది. అయితే ఈ మధ్యకాలంలోనూ వారిని కొనసాగించేందుకు వర్సిటీ ఉన్నతాధికారుల అత్యుత్సాహంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

హెచ్‌సీయూలో 2007 నుంచి 2010 వరకూ భారత సంతతికి చెందిన విదేశీయులు(ఓసీఐ)గా ఉన్న డాక్టర్ సురేశ్‌బాబు, టి శారదదేవి, మహదేవ్ శంకరన్, వినిత్ సీపీనాయర్, జగన్ పొంగుబాల వివిధ హోదాల్లో ఉద్యోగాల్లో చేరారు. వీరి నియామకాన్ని హెచ్‌సీయూ అధికారులు మానవ వనరుల అభివృద్ధిశాఖ (ఎంహెచ్ ఆర్డీ)కి 2014 జూన్6న పంపిన లేఖ (యూహెచ్/హెచ్ ఆర్, ఈసీ అండ్ ఎల్‌సీ/ఓసీఐ/2014) ద్వారా తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఓసీఐ ఉద్యోగులు ఇండియాలో ఆయా సబ్జెక్టుల్లో నిపుణులు లేకుంటే ఐఐటీల్లో తక్కువకాలం లేదా కాంట్రాక్టు విధానంలో కొనసాగించుకోవచ్చని ఉందనీ ఆ లేఖలో తెలిపారు. హెచ్‌సీయూలో ప్రస్తుతం శాశ్వత ప్రాతిపదికన ఐదుగురు ఉద్యోగులు కొనసాగుతున్నారనీ, వీరిని పర్మినెంట్‌గా కొనసాగించేందుకు అవకాశమివ్వాలని దానిలో పేర్కొన్నారు. అయితే ఎంహెచ్‌ఆర్డీ 2017 డిసెంబర్‌లో ఓ ఆర్డర్ జారీ చేసింది. ప్రజలు కోరుకుంటే, అదీ తప్పనిసరైతేనే భారత సంతతికి చెందిన విదేశీయులను ఉన్నత విద్యాసంస్థలు, ఐఐటీ, సెంట్రల్ యూనివర్సిటీలు, ఎన్ఐటీ,ఐఐఎం, ఐఐఎస్ఈఆర్ఎస్‌లలో తీసుకోవచ్చని ఆ ఆర్డర్‌లో పేర్కొన్నది. దీని ఆధారంగా 2014లో హెచ్‌సీయూ పెట్టిన లేఖకు 2018 ఫిబ్రవరి 21న ఎంహెచ్‌ఆర్డీ నుంచి అధికారిక లేఖ అందింది. ఆ ఐదుగురిని తీసుకోవచ్చని అనుమతించినట్టు దాంట్లో పేర్కొన్నది. వీరిని తీసుకోవాలంటే తప్పనిసరిగా విదేశాంగశాఖ అనుమతి కూడా తీసుకోవాల్సి ఉంది. కానీ హెచ్‌సీయూ అధికారులు అవేవీ పట్టించుకోలేదు. 2007లో ఎవ్వరి అనుమతి లేకుండా తీసుకున్న అధికారులు, అనుమతి కోసం 2014లో లేఖ రాస్తే, వారికి 2018లో ఎంహెచ్‌ఆర్డీ అనుమతి వచ్చింది. ఈ పదేండ్లు పాటు అనధికారికంగానే వారు కొనసాగించడం గమనార్హం.



జాతీయత తప్పు చెప్పినా చర్యలేవీ..?

భారత సంతతికి చెందిన విదేశీయులను ఉద్యోగాల్లోకి తీసుకోవాలా..? లేదా అనేది ఒక అంశమైతే..వారి జాతీయతను తప్పుగా చూపించడం మరో అంశంగా ఉన్నది. హెచ్‌సీయూలో కొలువులు పొందిన ఐదుగురు ఓసీఐల్లో నలుగురు జాతీయతను తప్పుచెప్పారు. వర్సిటీ అధికారులు దీన్ని సీరియస్‌గా తీసుకోవడం లేదు. గతంలో హెచ్‌సీయూలోనే ఓ ఉద్యోగి విద్యార్హత తప్పు చెబితే ఏకంగా సర్వీస్ నుంచే రిమూవ్ చేశారు. కానీ జాతీయత తప్పు చెప్పి ఉద్యోగం పొందిన వారిపై మాత్రం వర్సిటీ అధికారులు పదేండ్లుగా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. అయితే వర్సిటీ అధికారులు ఎంహెచ్‌ఆర్డీకి రాసిన లేఖలోనూ జాతీయత తప్పు చెప్పారనే విషయాన్ని పేర్కొనలేదు.

నాడు యూజీసీకి లేఖరా్ నా అప్పారావు..

ప్రస్తుత హెచ్‌సీయూ వీసీ పి.అప్పారావు 2014లో నాటి వీసీ రామకృష్ణ రామస్వామిపై ప్రొఫెసర్ స్థాయిలో యూజీసీకి లేఖ రాశారు. వర్సిటీలోని నిబంధనలు అమలు కావడం లేదనీ, చర్యలు తీసుకోవాలని దాంట్లో పేర్కొన్నారు. ఆయన వీసీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మాత్రం ఆ నియామకాలపైనా గానీ, కమిటీల పనివిధానంలో గానీ ఎలాంటి మార్పు రాలేదు. ఈసీ సమావేశం తర్వాత ఆ కాలంలో నియామకాల వివరాలను మినిట్స్‌లో పొందుపరిచేవారు. కానీ ప్రస్తుతం వాటిని దాంట్లో పొందుపర్చడం లేదు. అప్పారావు కూడా పాత వీసీ బాటలోనే సాగుతున్నారనే విమర్శలూ వర్సిటీలో వినిపిస్తున్నాయి.

నియామకాలపై విచారణ చేపట్టాలి: ఎం నాగేశ్వర్‌రావు, ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీల రాష్ట్ర ఇన్‌చార్జి

హెచ్‌సీయూలో జరిగిన అక్రమ నియామకాలపై ఎంహెచ్‌ఆర్డీ సమగ్ర విచారణ చేయించాలి. జాతీయత తప్పుగా చెప్పుకున్న వారిపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేసి, ఉద్యోగాల్లోంచి తొలగించాలి. నోటిఫికేషన్‌లో ఇచ్చిన పోస్టులను భర్తీ చేయకుండా, వారి అవసరాలకు అనుగుణంగా పోస్టులను భర్తీ చేయడం యూజీసీ నిబంధనలకు వ్యతిరేకం. అర్హత లేని వారిని నియమించి, యూనివర్సిటీ విద్యలో నాణ్యత, వర్సిటీ ప్రతిష్టను దెబ్బతీశారు. అక్రమ నియామకాల్లో సూత్రదారులుగా ఉన్న వారందరిపై చర్యలు తీసుకోవాలి. ఈ మొత్తం నియామకాలపైన త్వరలో ఎంహెచ్‌ఆర్డీకి ఫిర్యాదు చేస్తాం.

'న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకం పోతోంది'

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

దళితులు, అణగారిన వర్గాలకు న్యాయవ్యవస్థపై నమ్మకపోతుందని, న్యాయస్థానాలు బాధితులకు న్యాయం చేయకపోతే ఇంకెవరికి చెప్పుకోవాలని టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సిరిసిల్ల జిల్లాలోని నేరెళ్ల బాధితుల కేసు మూడు నెలలైనా విచారణ చేయటం లేదన్నారు. న్యాయవ్యవస్థ కూడా వారికి న్యాయం చేయడం లేదన్న ఆవేదన వ్యక్తమవుతుందన్నారు. రాష్ట్రంలో పోలీసులు ప్రయివేట్ సైన్యంలా మారి దళితులపై దాడులు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వారి సంగతి తేల్చుతామన్నారు. శుక్రవారం సికింద్రాబాద్‌లోని జయలక్ష్మీగార్డెన్‌లో టీపీసీసీ ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో దిశ రాష్ట్రస్థాయి ప్లీనరీ సమావేశం అధ్యక్షులు ఆరేపల్లి మోహన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో దళితుల ఓట్ల కోసం ఎన్నికల ముందు కేసీఆర్ అనేక హామీలు ఇచ్చారని, వారిని నమ్మించి వారి ఓట్లతో గద్దెనెక్కి చివరకు వారికి న్యాయం చేయకపోగా, వారిపై అమానుషంగా దాడులు చేయిస్తున్నారని చెప్పారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ప్రజాస్వామ్య వ్యవస్థలు పూర్తిగా ధ్వంసమయ్యాయన్నారు.

సింగరేణిలో సోలార్ పనులు వేగవంతం చేయండి

- అధికారులకు సీఎమ్‌డీ శ్రీధర్ ఆదేశాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సింగరేణి ఏరియాల్లో సోలార్ విద్యుత్‌ప్లాంట్ల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆ సంస్థ సీఎమ్‌డీ ఎన్ శ్రీధర్ అధికారుల్ని ఆదేశించారు. తొలి దశలో 300 మెగావాట్ల నిర్మాణాలు పూర్తి చేయాలని చెప్పారు. శుక్రవారంనాడాయన సింగరేణి విద్యుత్ విభాగం ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సింగరేని కాలరీస్‌లో మొత్తంగా 500 మెగావాట్ల సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఎల్ అండ్ టి సంస్థ నిర్మించిన సోలార్ పవర్ ప్లాంట్లు, టెక్నాలజీపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు.

15న దేశవ్యాప్త నిరసనల్ని జయప్రదం చేయండి

- కేంద్ర కార్మిక సంఘాల విజ్ఞప్తి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఈనెల 15వ తేదీ జరిగే దేశవ్యాప్త నిరసన ఆందోళనల్లో అన్ని రంగాలు, వర్గాల ప్రజలు భాగస్వాములు కావాలని కేంద్ర కార్మిక సంఘాల రాష్ట్ర కమిటీలు పిలుపునిచ్చాయి. శుక్రవారంనాడిక్కడి ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు టి నరసింహన్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజ్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శులు పి జయలక్ష్మి, బి మధు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్ ప్రకాష్‌గౌడ్, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్ష, కార్యదర్శులు ఏ నరేందర్, జి అనూరాధ, డిఫెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ హైదరాబాద్ ప్రాంతీయ చైర్మెన్ జి శ్రీహరి తదితరులు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలకు నిరసనగా జాతీయ కార్మిక సంఘాల పిలుపులో భాగంగా ఈ ఆందోళనలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.అన్ని రంగాల్లోనూ శ్రమదోపిడీ జరుగుతోందని, కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం పూర్తిగా కార్పొరేట్ల కొమ్ముకాస్తోందని విమర్శించారు. పెట్టుబడిదారుల స్వప్రయోజనాల కోసం... పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాల్లో సైతం సవరణలు చేసేందుకు కేంద్రప్రభుత్వం సిద్ధపడుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. దేశంలోకి కొత్తగా వచ్చిన పరిశ్రమలు ఏమీ లేవని, అదే సందర్భంలో ఉన్న పరిశ్రమల్లో ఎలాంటి కార్మిక చట్టాలు అమలు కావట్లేదని చెప్పారు. 15వ తేదీ ఆందోళనల్లో కోల్, రవాణా, రక్షణ, రైల్వే, మైనింగ్, ఇన్సూరెన్స్ శాఖలు సహా అన్ని రంగాల కార్మికులు ఆందోళనల్లో భాగస్వాములు అవుతున్నారని వివరించారు. 15వ తేదీ అన్ని జిల్లాలు, మండల కార్యాలయాల్లో ఎక్కడికక్కడ ధర్నాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అదే రోజు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రం నుంచి భారీ కార్మిక, ఉద్యోగ ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రక్షణశాఖలోని మూడు ఫెడరేషన్లు 15వ తేదీ ఒక్కరోజు సమ్మెలోకి వెళ్తున్నాయని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా అన్ని రంగాల కార్మికులు ఈ పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. 2018-19 కేంద్రప్రభుత్వ బడ్జెట్‌కు వ్యతిరేకంగా, జాతి వ్యతిరేక ప్రయివేటీకరణ విధానాలను నిరసిస్తూ ఈ ఆందోళనలు చేపడుతున్నామన్నారు.

అనుమతి ఎందుకు నిరాకరిస్తున్నారు..



నవతెలంగాణ- వికారాబాద్‌రూరల్

శాంతియుత వాతావరణంలో తాము స్ఫూర్తి మిలియన్ మార్చ్ నిర్వహించుకుంటామంటే ఎందుకు అనుమతి నిరాకరిస్తున్నారని జేఏసీ చైర్మెన్ ప్రొఫెసర్ కోదండరామ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు రాష్ట్రంలో అప్రజాస్వామిక పాలన సాగిస్తున్నారని విమర్శించారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శాంతియుత వాతావరణంలో స్ఫూర్తి మిలియన్ మార్చ్ నిర్వహించి అప్పటి తెలంగాణ పోరాటాన్ని గుర్తు చేసుకుందామంటే ప్రభుత్వం అడుగడుగునా అడ్డుకుంటోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 200 మంది జేఏసీ నాయకులను ముందస్తుగా అరెస్టులు చేశారని, వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే జేఏసీ నాయకులను రెచ్చగొట్టి వాతావరణాన్ని కలుషితం చేయడానికి ప్రయత్నిస్తోందని అన్నారు. గతంలో తెలంగాణకు అన్యాయం జరిగిందని చంద్రశేఖర్‌రావు ఢిల్లీలో నిరసన తెలిపినప్పుడు అనుమతి ఇచ్చారని, ఇప్పుడు రాష్ట్రంలో శాంతియుత వాతావరణంలో మిలియన్ మార్చ్ నిర్వహిస్తామంటే పోలీసులు ఎందుకు నిరాకరిస్తున్నారని ప్రశ్నించారు. ఈ విషయంపై డీజీపీని అనేకసార్లు కలిశామని, చివరి ప్రయత్నంగా శనివారం కలుస్తామని చెప్పారు. అనుమతి ఇవ్వకపోయినా ఒక విగ్రహం దగ్గర జేఏసీ నాయకులతో కలిసి కార్యాచరణకు రూపకల్పన చేస్తామన్నారు. తెలంగాణ వచ్చినా గత పాలకుల మాదిరిగానే ప్రజలు వివక్షకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజలపై, ప్రజాసంఘాలపై, ప్రశ్నించే గొంతులపై ద్వంద్వ వైఖరి విడనాడాలని సూచించారు. శనివారం నిర్వహించే మిలియన్ మార్చ్‌కు యువకులు భారీగా తరలిరావాలని కోరారు.

సంక్షేమ పథకాలకు విస్తృత ప్రచారం

సమాచార శాఖ కమిషనర్ అరవింద్‌కుమార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రజా సంక్షేమ పథకాలకు విస్తృత ప్రచారం వచ్చేలా సమాచార పౌరసంబంధాల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ప్రధానపాత్ర పోషించాలని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ అరవింద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం డాక్టర్ మర్రిచెన్నారెడ్డి మానవవనరుల సంస్థలో సమాచార పౌర సంబంధాల శాఖలో ఆయా స్థాయిల్లో పనిచేస్తున్న అధికారులు, ప్రభుత్వ పథకాల ప్రచారంలో సోషల్ మీడియా వినియోగంపై ఐటీ శాఖ డిజిటల్ మీడియా సహకారంతో ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆయా ప్రతిష్టాత్మక కార్యక్రమాల ద్వారా ప్రజల్లోకి వచ్చిన సానుకూల మార్పులు, అభివ ద్ధికి సంబంధించి అనుకూల వార్తలు వచ్చేలా ప్రత్యేకమైన కథనాలను మీడియాకు అందించేలా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. సంక్షేమ కార్యక్రమాల ప్రచారంలో సోషల్ మీడియాను (ఫేస్ బుక్, ట్విట్టర్) బాగా వాడాలని సూచించారు. టీం వర్కులాగా పనిచేసి శాఖకు మంచి పేరు తీసుకురావాలని అభిప్రాయపడ్డారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం, కెసిఆర్ కిట్స్, రెసిడెన్షియల్ స్కూల్స్, విద్య, వైద్యం, మహిళా శిశు సంక్షేమం, మున్సిపాల్టీల్లో అమలవుతున్న పట్టణ పథకాల ద్వారా జిల్లాల్లో జరుగుతున్న అభివద్ధి, సంక్షేమంపై ప్రత్యేక వార్తా కథనాలు మీడియాకు అందించాలని సూచించారు. జిల్లా పౌర సంబంధాల అధికారులు కలెక్టర్లకు నిత్యం అందుబాటులో ఉండి జిల్లా అధికారులతో ఆయా శాఖల అభివ ద్ధి కార్యక్రమాలపై సమాచారం సేకరించి ప్రజలకు చేరేలా చూడాలన్నారు. జిల్లాలో ప్రత్యేకంగా జరిగే అభివద్ధిపై రాష్ట్ర స్థాయిలో ప్రచారం వచ్చేలా కమీషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సోషల్ మీడియా సెల్‌కు ఎప్పటికప్పుడు పంపించాలని చెప్పారు. ప్రతి జిల్లానుంచి నెలకు కనీసం మూడు పాజిటివ్ కథనాలను పంపాలని కమిషనర్ జిల్లా డీపీఆర్వో, అసిస్టెంట్ డైరెక్టర్లను ఆదేశించారు. ప్రముఖుల పర్యటనలు, ముఖ్యమైన అభివ ద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలు, వీడియోల, వివరాలను చేరవేయాలని కోరారు. ప్రభుత్వ కార్యక్రమాల ద్వారా ప్రజల్లో ఎంతో అభివ ద్ధి కనిపిస్తున్నదని, సానుకూల ప్రభావంపై కథనాలు పంపాలని అన్నారు. కొత్త రోడ్ల నిర్మాణం, ఇరిగేషన్ ప్రాజెక్టుల పూర్తితో ఆయా గ్రామాలలో వచ్చిన మార్పు, శిశు వైద్యంలో అందుతున్న సౌకర్యాలు, విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పన ద్వారా విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెరగడంతో పాటు నాణ్యమైన విద్య అందుబాటులోకి రావడం, గొర్రెల పంపిణీ, 24 గంటల విద్యుత్ సరఫరా, కెసిఆర్ కిట్స్ తదితర వినూత్న పథకాలకు చెందిన సక్సెస్ స్టోరీలను ప్రింట్ , ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సోషల్ మీడియాలోనూ వచ్చే చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఐటి శాఖ డైరెక్టర్ కె. దిలీప్ మాట్లాడుతూ సోషల్ మీడియా విశ్వవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిందని, సమాచార శాఖ అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఈ మాధ్యమాలను వినియోగించుకొని ప్రజల్లోకి తీసుకువెళ్ళాలన్నారు. కచ్చితమైన సమాచారాన్ని మాత్రమే పోస్ట్ చేయాలన్నారు. సోషల్ మీడియా ప్రయోజనాలు, పేజీల నిర్వహణ ట్విట్టర్, ఫేస్ బుక్ అకౌంట్లకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులకు వివరించారు.



జీహెచ్ఎంసీ పరిధిలో ఇప్పటికే 60 లక్షల మంది ఫేస్ బుక్ యూజర్లు ఉన్నారని, పోలీసు, ముఖ్యమంత్రి కార్యాలయం, మంత్రులు వినియోగిస్తున్నారని గుర్తు చేశారు. ట్విట్టర్‌కు సంబంధించి ట్వీట్స్, రీట్వీట్స్, హ్యాష్ ట్యాగ్స్, ఫోటోలు, వార్తల అప్‌లోడ్ విధానంపై అవగాహన కల్పించారు. సమాచార శాఖకు సంబంధించి ట్విట్టర్, ఫేస్ బుక్ అకౌంట్లను ప్రచారం చేయాలని సూచించారు. సమాచార శాఖ అదనపు సంచాలకులు నాగయ్య కాంబ్లే మాట్లాడుతూ కమిషనర్ ఆదేశం మేరకు సమాచార శాఖ సిబ్బంది సమిష్టిగా పనిచేసి ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లామని స్పష్టం చేశారు. ఈ శిక్షణ ద్వారా సోషల్ మీడియాపై అవగాహన కలిగిందన్నారు. సమాచార శాఖ సీఐసీ కిషోర్‌బాబు, పబ్లీసిటీ సెల్ డిప్యూటి డైరెక్టర్ మధుసూధన్, సోషల్ మీడియా ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో సమాచార శాఖ జెడి సుజాత, డిప్యూటీ డైరెక్టర్లు, ఆర్ఐలు, క్షేత్రస్థాయి పౌర సంబంధాల అధికారులు, కమిషనర్ కార్యాలయం అధికారులు పాల్గొన్నారు.

మేలో ములాఖాత్

సూత్రప్రాయంగా అంగీకరించిన ట్రంప్, కిమ్ : ద. కొరియా వెల్లడి



వాషింగ్టన్: ఉ.కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌తో భేటీ అయ్యేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంగీకరించినట్లు ద.కొరియా, అమెరికా అధికారులు వెల్లడించారు. ఉ.కొరియా అణు కార్యక్రమాలపై దాదాపు కొన్ని నెలలపాటు కొనసాగిన హెచ్చరికలు, బెదిరింపుల పర్వం అనంతరం ఇరువురు నేతలూ భేటీకి సిద్ధం కావటం విశేషం. ఇప్పటి వరకూ అమెరికా అధ్యక్షుడెవరూ ఉ.కొరియా అధినేతలతో భేటీ కాలేదు. ద.కొరియా జాతీయ భద్రతా వ్యవస్థ డైరెక్టర్ చుంగ్ యూ యంగ్ గురువారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ ఈ విషయం వెల్లడించారు. అంతకు ముందు ఆయన అధ్యక్షుడు ట్రంప్‌ను కలిసి ఇటీవల ఉ.కొరియాలో తమ దేశ ప్రతినిధి బృందం జరిపిన పర్యటన వివరాలను తెలియచేశారు. దాదాపు దశాబ్దాల పాటు బద్ధ వైరులుగా కొనసాగిన అమెరికా ఉ.కొరియా దేశాల మధ్య జరగనున్న ఈ భేటీ అనూహ్యమైనదేనని పరిశీలకులు చెబుతున్నారు. ఈ రెండు దేశాల మధ్య ప్రస్తుతం ఎటువంటి ద్వైపాక్షిక సంబంధాలూ లేవు. 1950-53లో కొనసాగిన కొరియా యుద్ధానంతరం కూడా ఈ రెండూ బద్ధ వైరులుగానే కొనసాగాయి. కొరియా ద్వీపకల్పం అణు నిరాయుధీకరణకు తాను కట్టుబడి వున్నట్లు కిమ్ చెప్పారని చుంగ్ ట్రంప్‌కు వివరించారు. గత నెలలో జరిగిన శీతాకాలం ఒలింపిక్స్ నేపథ్యంలో ఉభయ కొరియాల మధ్య ఏర్పడిన దౌత్య సంబంధాలతో కొరియా ద్వీపకల్పంలో కొనసాగుతున్న ఉద్రిక్తతలకు తెరపడిన విషయం తెలిసిందే. ఏప్రిల్ ద్వితీయార్థంలో ఇరుదేశాల అధినేతలూ శిఖరాగ్ర సదస్సుకు ఇప్పటికే అంగీకరించారు. సాధ్యమైనంత త్వరలో ట్రంప్‌తో భేటీ కావాలని కిమ్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారని చుంగ్ చెప్పారు. దీనిపై ఆయన్ను అభినందించిన ట్రంప్ తాను కూడా మే నెలలో కిమ్‌తో భేటీ అవుతానని, కొరియా ద్వీపకల్పంలో శాశ్వత అణు నిరాయుధీకరణకు కృషి చేస్తామన్నారని ఆయన వివరించారు. అయితే ట్రంప్-కిమ్‌ల భేటీ ఎక్కడ జరుగుతుందన్న విషయాన్ని ఆయన వెల్లడించలేదు. ఈ అంశంపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని నిర్ణీత ప్రదేశంలోనే ఈ భేటీ జరుగుతుందని వైట్‌హౌస్ వర్గాలు వివరించాయి

స్వాగతించిన జపాన్

టోక్యో : మే నెల చివరిలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ సమావేశవుతుండడం పట్ల జపాన్ ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. ఆ ప్రకటనను స్వాగతిస్తూ ప్రధాని షింజో అబె, అణు నిరాయుధీకరణపై చర్చలు జరిపేందుకు ఉత్తర కొరియాలో వచ్చిన మార్పును అభినందిస్తున్నట్లు చెప్పారు. ఈ ఉదయమే తాను ట్రంప్‌తో మాట్లాడానని, ఏప్రిల్‌లో ఆయనతో భేటీ కావాలని యోచిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల వింటర్ ఒలింపిక్స్ సందర్భంగా ఉభయ కొరియాల మధ్య చర్చలపై జపాన్ ఆచితూచి స్పందించింది. కేవలం చర్చల కోసం చర్చలు జరపడం అర్థం లేని పనని అబె వ్యాఖ్యానించారు. అయితే ట్రంప్-కిమ్ ప్రతిపాదిత సమావేశం పట్ల ఆయన సానుకూలంగా స్పందించారు.

అమెరికా ఆలోచన మౌళికంగా తప్పు

- వ్యూహాత్మక పోటీదారు ప్రకటనపై చైనా

బీజింగ్: చైనాను 'వ్యూహాత్మక పోటీదారు'గా అమెరికా పేర్కొనడంపై ఆ దేశ విదేశాంగ మంత్రి వాంగ్ వీ అభ్యంతరం వ్యక్తం చేశారు. అమెరికా ఆలోచనలోనే మౌళికంగా తప్పు ఉందని అన్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థకు చైనా పెద్ద ప్రమాదకారి అన్నట్లుగా ట్రంప్ ప్రభుత్వ భద్రతా పత్రాల్లో పేర్కొన్నడాన్ని వాంగ్ వీ విమర్శించారు. చైనా శాంతియుత అభివృద్ధిని కోరుకుంటోందని, వాణిజ్యం, ఉత్తర కొరియాతో చర్చల విషయంలో అత్యధిక సహకారాన్ని కోరుతున్నామని చెప్పారు. చైనా ప్రమాదకర సిద్ధాంతాన్ని ఇప్పటికే అమెరికా ప్రకటించినప్పటికీ వాస్తవాలు మాత్రం వేరేగా ఉన్నాయని అన్నారు. చైనా ఆర్థిక వృద్ధిని, ఐక్యరాజ్యసమితిలో ప్రపంచ శాంతికై చేసిన కృషిని ఆయన ప్రస్తావించారు. తాము ఏ విషయాన్నీ రాగద్వేషాలతో గానీ, ద్వంద్వ ప్రమాణాలతో గానీ చూడబోమని స్పష్టం చేశారు. చైనా ప్రమాదకారి సిద్ధాంతాన్ని పక్కనపెట్టాలని అమెరికాకు సూచించారు. బుధవారం ట్రంప్ మాట్లాడుతూ చైనా మేధోసంపత్తి హక్కులను ఉల్లంఘిస్తుందని పేర్కొంటూ వాణిజ్యంపై నియంత్రణలు ఇంకా తీవ్రంగా ఉంటాయని అన్నారు. " అమెరికా, మా మధ్య ఏదైనా పోటీ ఉంటే అది ఆరోగ్యకరంగా, సానుకూల ధోరణిలో ఉండాలి" అని వాంగ్ చెప్పారు. చైనా, అమెరికా శత్రువులు కాదని, కానీ పోటీతత్వంలో భాగస్వామ్యులని పేర్కొన్నారు. వాణిజ్య యుద్ధం ఎప్పటికీ సరైన పరిష్కారం కాదని అన్నారు. ప్రస్తుత ప్రపంచీకరణ యుగంలో వాణిజ్య యుద్ధం ఇరు వర్గాలకూ నష్టం చేస్తుందని చెప్పారు. వాణిజ్య యుద్ధ విషయంలో చైనా సరైన విధంగా స్పందిస్తుందని చెప్పారు. ఉత్తర కొరియాను చర్చల ప్రక్రియలోకి తీసుకొచ్చే ప్రయత్నాలు కీలకదశలో ఉన్నాయన్నారు.

టారిఫ్‌లతో ప్రపంచ వాణిజ్యాన్ని నాశనం చేస్తున్నారు

ఇనుము, ఉక్కు దిగుమతులపై సుంకాలను పెంచటం ద్వారా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రపంచ వాణిజ్యాన్ని నాశనం చేస్తున్నారని చైనా ఆగ్రహం వ్యక్తం చేసింది. ట్రంప్ చర్యలను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చైనా వాణిజ్య మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ చర్యలతో తమ కంపెనీలు ఇబ్బంది పడితే తాము ప్రతీకార చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. అయితే ఈ చర్యలు ఎలా వుంటాయన్న విషయాన్ని వెల్లడించలేదు. కాగా ద.కొరియా వాణిజ్య మంత్రి పైక్ ఉన్ గ్యూ మీడియాతో మాట్లాడుతూ ఇతర దేశాలు ఈ వివాదాన్ని నివారించేందుకు సహకరించాలని కోరారు. ట్రంప్ చర్యలు ప్రపంచ వాణిజ్యాన్ని దెబ్బతీసే విధంగా వున్నాయని జపాన్, ద.కొరియాలు ఆందోళన వ్యక్తం చేశాయి. స్వేచ్ఛా వాణిజ్యాన్ని ప్రోత్సహించేందుకు వీలుగా ఇటువంటి చర్యల విషయంలో అంతర్జాతీయ సమాజం సంయమనంతో వ్యవహరించాలని తాము కోరుతున్నట్లు ద.కొరియా విదేశాంగ మంత్రి ఒక ప్రకటనలో తెలిపారు.

దైవ దూషణ చట్టానికి సవరణలు పాక్‌పై పెరుగుతున్న ఒత్తిడి

లాహోర్ : దైవ దూషణ చట్టానికి సవరణలు చేయాలని పాకిస్తాన్‌పై ఒత్తిడి పెరుగుతోంది. మతపరమైన స్వేచ్ఛను తీవ్రంగా ఉల్లంఘించే దేశాల జాబితాలోకి పాకిస్తాన్‌ను చేర్చేందుకు ఈ దైవ దూషణ చట్టం కూడా ఒక కారణమని అమెరికా విదేశాంగ శాఖ జనవరిలో పేర్కొంది. చాలా చిన్న నేరమే చేసినా అంతిమంగా మరణశిక్ష విధించేలా చట్టంలోని నిబంధనలు వున్నాయని మానవ హక్కుల కార్యకర్తలు పేర్కొంటున్నారు. పాక్ సమాజాన్ని క్రమంగా నాశనం చేసే శక్తిగా ఈ చట్టం మారుతోందని ఈ చట్టాన్ని వ్యతిరేకించేవారు పేర్కొంటున్నారు. వ్యక్తిగత కక్షలతో ప్రత్యర్థులను శిక్షించడానికి ఈ చట్టాన్ని తరచుగా ఉపయోగిస్తున్నారని ఆరోపణలు వున్నాయి. అసియా బీబీ అనే క్రిస్టియన్ మహిళకు సంబంధించి 2009లో జరిగిన ఒక సంఘటన ఇప్పుడీ దైవదూషణ చట్టం గురించి మాట్లాడుకునేలా చేసింది. కొంతమంది ముస్లిం మహిళల కోసం బీబీ నీరు పట్టుకొచ్చేది. ఒకసారి వారికి పట్టుకువస్తున్న నీరు బీబీ తాగింది. దీంతో ఆగ్రహావేశులైన ఆ ముస్లిం మహిళలు ఆమెను మతం మారాలని డిమాండ్ చేశారు. ఆమె దానికి తిరస్కరించింది. ఐదు రోజుల తర్వాత ఆమె దైవదూషణకు పాల్పడిందంటూ ఒక అల్లరిమూక ఆమెపై ఆరోపించింది. దానిపై ఆమెకు మరణశిక్ష విధించారు. ఈ నెల చివరిలో బీబీ పెట్టుకున్న పిటిషన్‌పై సుప్రీం కోర్టు విచారించనుంది. ఈ నేపథ్యంలో పాక్ దైవదూషణ చట్టంలో మార్పులు తీసుకురావాలని డిమాండ్ పెరుగుతోంది.



భారత్ పర్యటనకు వచ్చిన ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్, ఆయన సతీమణికి ప్రధాని మోదీ స్వాగతం పలికారు.

నైజీరియాలో టీకాల కొరత

- 8లక్షలమంది చిన్నారుల మృతి



అబుజా : గత ఐదేళ్ళ కాలంలో టీకాలు వేయని కారణంగా నైజీరియాలో దాదాపు 8లక్షల మంది చిన్నారులు మరణించారని జీఎవిఐ (గ్లోబల్ అలయన్స్ ఫర్ వాక్సిన్స్ అండ్ ఇమ్యూనైజేషన్) తెలిపింది. జీఎవిఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సెత్ బర్కిలీ మాట్లాడుతూ, ఇటీవల జరిపిన సర్వే ప్రకారం, నైజీరియాలో కేవలం 30శాతం ప్రాంతాల్లో మాత్రమే వాక్సిన్‌లు వేశారని తెలిపింది. దీనివల్ల అనేకమంది చిన్నారులు నివారించదగ్గ వ్యాధులతోనే మరణించారని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా వుండేందుకు దేశవ్యాప్తంగా టీకాల కార్యక్రమాన్ని మరింత పకడ్బందీగా అమలు చేయనున్నట్లు బర్కిలీ తెలిపారు. ఈ కార్యక్రమానికి కలిసి రావాల్సిందిగా ఆయన ప్రభుత్వాన్ని, ఇతర ఆసక్తి గల పక్షాలను కోరారు. ప్రపంచవ్యాప్తంగా వ్యాక్సిన్లు అందచేసేందుకు 2000 జనవరిలో జీఎవిఐ ఏర్పాటైంది.

శ్రీలంకలో చెలరేగిన హింస

మసీదుల వద్ద అదనపు బలగాలు



కొలంబో : మెజారిటీ బౌద్ధులకు, మైనారిటీ ముస్లింలకు మధ్య తాజాగా ఘర్షణలు జరిగి, హింస చెలరేగిన నేపథ్యంలో దేశంలోని ఇతర ప్రాంతాలకూ హింస వ్యాప్తి చెందుతుందని భయాందోళనలు నెలకొన్నాయి. దీంతో శుక్రవారం ప్రార్థనల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా మసీదుల వద్ద భద్రతా బలగాలను మోహరించారు. గత సోమవారం నుండి కాండీ జిల్లాలో ముస్లింలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఈ ఘర్షణల్లో ఇద్దరు మరణించగా, అనేక ఇళ్ళు, వ్యాపార సంస్థలు, మసీదులు ధ్వంసమయ్యాయి. గతవారం బౌద్ధ జాతీయుడు ఒకరు మరణించడంతో హింస ప్రారంభమైంది. మతోన్మాద హింస చెలరేగకుండా ముందు జాగ్రత్తగా పది రోజుల పాటు దేశంలో అత్యవసర పరిస్థితి విధించారు. సెంట్రల్ జిల్లాలో ముస్లింలు నివసించే ప్రాంతాల్లో శుక్రవారం తాజా హింస చెలరేగింది. ముస్లిం ప్రాంతాలపై దాడులు చేయడానికి అల్లరిమూక ప్రయత్నించింది. వెంటనే సైన్యం జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దింది. మరికొన్ని చోట్ల ముస్లింలు వుండే ప్రాంతాల్లో రాళ్ళు విసిరిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. ముస్లింలకు చెందిన వ్యాపార సంస్థలు మూతపడ్డాయి. రాజధాని కొలంబోలో కూడా ముస్లింల సంస్థలను మూసివేశారు. నగరంలోని మసీదుల వద్ద అదనపు బలగాలు మోహరించారు. ప్రస్తుతం కాండీలో పరిస్థితి ప్రశాంతంగానే వుందని పోలీసులు తెలిపారు. జిల్లాలోని పాఠశాలలు మూతపడ్డాయి.

ముషారఫ్ అరెస్టుకు ఆదేశాలు

- ఆస్తులు జప్తు చేయాలన్న ప్రత్యేక ట్రిబ్యునల్

ఇస్లామాబాద్ : మాజీ అధ్యక్షుడు పర్వేజ్ ముషారఫ్‌ను అరెస్టు చేయాలని, ఆయన ఆస్తులన్నింటినీ జప్తు చేయాలని పాకిస్తాన్ ప్రత్యేక ట్రిబ్యునల్ ఆదేశించింది. 2007లో దేశంలో అత్యవసర పరిస్థితి విధించినందుకు 'ప్రకటిత నేరస్తుడు'గా పేర్కొంటూ ముషారఫ్‌పై నమోదైన దేశద్రోహం కేసును ట్రిబ్యునల్ విచారించింది. 2014 మార్చిలో దేశద్రోహం ఆరోపణలపై ఆయనను అభిశంసించింది. ఈ ఎమర్జెన్సీ కాలంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు పలువురిని గృహ నిర్బంధంలో పెట్టారు. వందమందికి పైగా న్యాయమూర్తులను తొలగించారు. పెషావర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి యాహ్యా అఫ్రిది నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ధర్మాసనం మొదటిసారిగా విచారణ జరిపింది. విచారణ సమయంలో ముషారఫ్ ఆస్తులపై హోం మంత్రిత్వ శాఖ నివేదిక సమర్పించింది. ముషారఫ్ అరెస్టుకు ఆదేశించాలని, ఆయనను కోర్టు ముందు హాజరుపరచాలని ప్రాసిక్యూటర్ అక్రమ్ షేక్ కోర్టును కోరారు. ముషారఫ్‌ను విదేశాల నుండి వెనక్కి రప్పించాలంటే తీసుకోవాల్సిన చర్యలేంటని కోర్టు ఫెడరల్ దర్యాప్తు అధికారులను ప్రశ్నించింది.


కలల సౌధంపై నీళ్లు

పోలో బైసన్ గ్రౌండ్ అప్పగింతలో మరింత జాప్యం

- కొత్త సచివాలయ నిర్మాణం తాత్కాలిక వాయిదా

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

కొత్త సచివాలయం నిర్మాణ ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలికంగా వాయిదా వేసే పరిస్థితి కనిపిస్తున్నది. రక్షణ శాఖ ఆధీనంలో ఉన్న సికింద్రాబాద్ లోని పోలో బైసన్ గ్రౌండ్ అప్పగింతలో జరుగుతున్న జాప్యమే దీనికి కారణమని ప్రభుత్వ వర్గాలు అంటున్నాయి. రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయే విధంగా ఒక అద్భుతమైన భవనాన్ని సచివాలయం కోసం నిర్మిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆనేక మార్లు ప్రకటించారు. పోలోబైసన్ గ్రౌండ్ పేరుతో ఉన్న 36 ఎకరాల స్థలంలో దాదాపు రూ. 500 కోట్ల వ్యయంతో కొత్త సచివాలయ భవనాలను నిర్మించటానికి రోడ్లు భవనాల శాఖ ప్రతిపాదనలను కూడా సిద్ధం చేసింది. రాష్ట్రంలో కొత్త సచివాలయం నిర్మించాలని తలపెట్టిన ముఖ్యమంత్రి పోలోబైసన్ గ్రౌండ్, జింఖానా గ్రౌండ్‌లో దీని నిర్మాణం కోసం 2015లోనే కేంద్రానికి ప్రతిపాదనలు పంపించారు. మనోహర్ పారికర్ రక్షణ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలపై కొంత ముందడుగు పడింది. కేవలం పోలో బైసన్ గ్రౌండ్ ఉన్న 36 ఎకరాల స్థలం సచివాలయానికి సరిపోతుందని భావించిన రాష్ట్ర ప్రభుత్వం దీనిని మాత్రమే కేటాయించాలని కేంద్రాన్ని రెండవసారి కోరింది. ఈ స్థలానికి సంబంధించిన పూర్తి వివరాలను పంపించాలని రక్షణ శాఖలోని డిఫెన్స్ ఎస్టేట్ డైరెక్టర్ జనరల్ ఆంధ్రప్రదేశ్ సర్కిల్‌ను కోరారు. దీనిపై ఈ స్థలం వివరాలను, సికింద్రాబాద్ ప్రాంతంలోని భూమి మార్కెట్ విలువను కూడా డిఫెన్స్ సర్కిల్ కార్యాలయం కేంద్రానికి పంపింది. ఈ స్థలం విలువ దాదాపు రూ. 600 కోట్ల వరకూ ఉంటుందని డిఫెన్స్ ఎస్టేట్ సర్కిల్ కార్యాలయం కేంద్ర కార్యాలయానికి తెలిపింది. భూమి మార్కెట్ ధరకు బదులు భూమికి భూమిని కేటాయిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. కొత్త సచివాలయం నిర్మించి తీరతామని ప్రకటించిన ముఖ్యమంత్రి గత సంవత్సరం ఏప్రిల్, ఆగస్టు నెలల్లో ప్రధాన మంత్రిని కలిసినప్పుడు ఈ అంశాన్నే ప్రధానంగా ప్రస్తావించారు. పోలో బైసన్ గ్రౌండ్ కేటాయించటానికి ప్రధాన మంత్రి కూడా సానుకూలత వ్యక్తం చేశారని సీఎం కేసీఆర్ అప్పట్లో ప్రకటించారు. గత సంవత్సరం దసరా రోజునే సచివాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయాలని కూడా ఆయన అనుకున్నారు. గ్రౌండ్ కేటాయించటానికి సూత్రప్రాయంగా అంగీకారం తెలిపిన కేంద్ర రక్షణ శాఖ విధివిధానాలు, సాంకేతిక కారణాలను సాకుగా చూపుతూ రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించటంలో తీవ్ర జాప్యం చేసింది. ప్రధాని నరేంద్ర మోదీపై ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల చేసిన తీవ్ర విమర్శల నేపథ్యంలో పోలో బైసన్ గ్రౌండ్ అప్పగిస్తారా లేదా అనే సంశయం రాష్ట్ర ప్రభుత్వ అధికారులు కూడా వ్యక్తం చేస్తున్నారు. గ్రౌండ్ అప్పగింతలో మరింత జాప్యం జరిగితే 2019 ఎన్నికల తర్వాతే కొత్త సచివాలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టాలని సీఎం తన సన్నిహితులతో అన్నట్టు తెలిసింది.



కొత్త సచివాలయం నమూనా చిత్రం

హైకోర్టులో కేసుతో మరింత జాప్యం...

రక్షణ శాఖకు చెందిన పోలో బైసన్ గ్రౌండ్‌ను రాష్ట్ర ప్రభుత్వానికి కేటాయించటాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర హైకోర్టులో కొందరు రిట్ పిటిషన్ దాఖలు చేశారు. రాష్ట్ర మాజీ పోలీస్ డైరెక్టర్ జనరల్ ఎంవీ భాస్కరరావు, ప్రముఖ క్రికెటర్ వివేక్ జయసింహ, విశ్రాంత మిలిటరీ అధికారి అనిల్ భల్లా వేసిన ఈ పిటిషన్ హైకోర్టు విచారణలో ఉన్నది. ఈ కేసులో కేంద్ర రక్షణ శాఖ కూడా వాదన వినిపించింది. పోలో బైసన్ గ్రౌండ్‌ను రాష్ట్ర ప్రభుత్వానికి సూత్రప్రాయంగా కేటాయించినప్పటికీ కొన్ని సాంకేతిక కారణాలతో ఇంకా దీనిని అప్పగించలేదని తెలిపింది. ఈ కేసులో కోర్టు ఇచ్చే తీర్పు కోసం కూడా కేంద్ర రక్షణ శాఖ వేచి చూస్తున్నట్టు తెలిసింది. ఈ గ్రౌండ్‌ను రాష్ట్ర ప్రభుత్వానికి కేటాయించటాన్ని పలువురు క్రీడాకారులు కూడా వ్యతిరేకించారు.

ప్రస్తుత సచివాలయానికి వందేండ్ల చరిత్ర

హుస్సేన్ సాగర్ తీరాన ఉన్న ప్రస్తుత సచివాలయానికి వందేండ్ల చరిత్ర ఉన్నది. నిజాం కాలం నుంచీ ఇక్కడి నుంచే పాలన కొనసాగుతున్నది. ఉమ్మడి రాష్ట్రంలో 16 మంది ముఖ్యమంత్రులు ఈ సచివాలయంలో నుంచే పాలన సాగించారు. రాష్ట్ర విభజన తర్వాత ప్రస్తుత సచివాలయాన్ని రెండు భాగాలుగా విభజించి తెలంగాణ, ఏపీలకు కేటాయించారు. దాదాపు 16 ఎకరాల నగరం నడిబొడ్డున ఉన్న ఈ సచివాలయం వివిధ జిల్లాల నుంచి వచ్చే వారికి అందుబాటులో ఉన్నది. దీనిని ఇక్కడి నుంచి తరలించవద్దని ప్రతిపక్షాలు సీఎం ను కోరాయి. వాస్తు కారణాలతో సచివాలయాన్ని తరలించటం హేతుబద్ధం కాదని కూడా వాదించాయి. ఏపీ సచివాలయాన్ని అమరావతికి తరలించిన తర్వాత కూడా ఇక్కడి భవనాలను ఏపీ ఖాళీ చేయటం లేదు. మరో వైపు తెలంగాణకు కేటాయించిన నాలుగు బ్లాక్‌లలో డి బ్లాక్‌లోనే ఎక్కువ శాఖలు ఉన్నాయి. స్థలాభావంతో వివిధ శాఖల సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ఏపీకి కేటాయించిన జె, కె, ఎల్, హెచ్ బ్లాకులను కూడా తెలంగాణకు అప్పగిస్తే రాష్ట్ర ప్రభుత్వ శాఖలకే కాకుండా అద్దె భవనాల్లో నడుస్తున్న కార్పొరేషన్లు, కమిషనరేట్లకు కూడా ఇక్కడే స్థలం కేటాయించే అవకాశం ఉన్నది.

బీజేపీ, ఆర్ఎస్ఎస్ దిష్టిబొమ్మ దహనం

- విగ్రహాల కూల్చివేత దారుణం : జాన్‌వెస్లీ
- 9 నుంచి 10 వరకు నిరసన కార్యక్రమాలు
- నేడు రౌండ్‌టేబుల్ సమావేశం



హైదరాబాద్‌లో...

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్రం, ఇతర రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి రాగానే దేశంలో సంఘ్ పరివార్ ఆగడాలకు అడ్డూ, అదుపూ లేకుండా పోయిందని టీ మాస్ రాష్ట్ర కన్వీనర్ జాన్‌వెస్లీ మండిపడ్డారు. తినే తిండిపై, కట్టే బట్టపై తాము చెప్పినట్టు నడుచుకోవాలనే ధోరణితో ప్రజలపై అనేక ఆంక్షలు విధిస్తూ భౌతిక దాడులకు పాల్పడుతున్నదని ఆరోపించారు. ప్రపంచ కార్మికోద్యమ, సామాజికోద్యమ నాయకులైన లెనిన్, బాసాహెబ్ అంబేద్కర్, ఇ.వి.పెరియార్ రామస్వామి, మహాత్మాగాంధీ విగ్రహాలను కూల్చివేయడం, వాటిపై ఇంకు చల్లడం వంటి ఘటనలను నిరసిస్తూ టీ మాస్ ఆధ్వర్యంలో శుక్రవారం సంఘ్ పరివార్, బీజేపీ దిష్టిబొమ్మలను దహనం చేసింది. నిందితులను అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది.

ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ వేర్పాటు వాదులతో అనైతిక పొత్తు కుదుర్చుకొని త్రిపురలో బీజేపీ గెలిచిన తరువాత విదేశీయుడని లెనిన్ విగ్రహాన్ని బుల్డోజర్లతో కూల్చడం దారుణమని వాపోయారు. అదేవిధంగా ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో అంబేద్కర్, తమిళనాడులోని వెల్లూరు జిల్లాలో పెరియార్, కేరళలోని కన్నూరు జిల్లాలో మహాత్మాగాంధీల విగ్రహాలను కూల్చి అనైతిక చర్యలకు పాల్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రులు హెచ్.రాజా, రామ్‌మాధవ్, సుబ్రహ్మస్వామిలాంటి వారు ఈ ఘటనలకు మరింత ఆజ్యం పోసే విధంగా ప్రకటనలివ్వడం సరికాదని విమర్శించారు. బాధ్యతాయుత పదవుల్లో ఉంటూ ఇలాంటి అహంకారపూరితమైన వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. సామాజిక న్యాయం, దోపిడీ రహిత సమాజం కోరుతున్న శక్తులంతా సంఘటితంగా ఏకమై బీజేపీ, ఆర్ఎస్ఎస్ చర్యలను ప్రతిఘటించాలని, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించి తగిన గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.

విగ్రహాల కూల్చివేతను నిరసిస్తూ ఈ నెల 9, 10, 11 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 10న ఎస్‌వీకేలో అన్ని రాజకీయ, ప్రజా, సామాజిక సంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో బీఎల్ఎఫ్ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ బహదూర్, టీ మాస్ స్టీరింగ్ కమిటీ సభ్యులు మన్నారం నాగరాజు, ఆర్.శ్రీరాంనాయక్, ఎండీ అబ్బాస్, కిషన్, పీ.ఆశయ్య, డీఎస్ఎస్ రాష్ట్ర కార్యదర్శి నీరుటి కృష్ణ, నగర నాయకులు కిరణ్, నాగరాజు, విజయం, గొల్లకాపరుల సంఘం ఉడుత రవి, మహిళా నాయకురాలు విమల తదితరులు భారీగా పాల్గొన్నారు.

విగ్రహాల కూల్చివేత అప్రజాస్వామికం

- ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సిద్ధాంతాలం, పోరాటాలు, జీవన విధానం నేర్పే మహనీయుల విగ్రహాలను కూల్చివేయడం అప్రజాస్వామిక చర్య అని ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు ఆందోళన వ్యక్తం చేశారు. లెనిన్, పెరియార్, అంబేద్కర్, గాంధీ విగ్రహాల కూల్చివేతకు నిరసనగా సుందరయ్య కళానిలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విగ్రహాలు జాతి సమూహం, దేశ చిహ్నాలని అభివర్ణించారు. ఇలాంటి విగ్రహాల వెనుక ప్రజల మనోభావాలు దాగి ఉన్నాయని, అలాంటి వాటిని అవివేకులే కూల్చివేస్తారని మండిపడ్డారు. ఇందులో రాజకీయ కోణం ఇమిడి ఉన్నదని చెప్పారు. గతంలో దొంగచాటుగా విగ్రహాలను కూల్చివేస్తే ప్రస్తుతం బహిరంగంగానే కూల్చివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది లా అండ్ ఆర్డర్ సమస్యకాదని దీనికి రాజకీయ పార్టీలే బాధ్యత వహించాలన్నారు. అలాగే సుప్రీంకోర్టు జోక్యం చేసుకొని ఘటనలకు కారణమయ్యే రాజకీయ పార్టీలపై అభిశంసన తీర్మానాన్ని అమలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. చాటింపు కన్వీనర్ ఎ.వినాయకరెడ్డి మాట్లాడుతూ.. లెనిన్ కార్మిక వర్గానికే ప్రతీక అన్నారు. ప్రగతిశీల సంస్థలు దుశ్చర్యలను ఖండించకపోవడం వల్లే ఇలాంటి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. ప్రముఖ రచయిత, మోదుగుపూల సంపాదకుల భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బీజేపీ అధికారం చేపట్టిన నాటి నుంచి ఫాసిస్ట్ ధోరణీ అవలంభిస్తున్నదని విమర్శించారు. తాలిబన్ల తరహాలో బహుజనులపై దాడులకు దిగుతూ మహనీయుల విగ్రహాల విధ్వంసానికి పూనుకుంటున్నదని వాపోయారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ ఏజెంట్‌లా ఇంటర్‌బోర్డు కార్యదర్శి

- 13న బంద్‌కు సహకరించాలి :

తెలంగాణ రాష్ట్ర విద్యార్థి సంఘాల ఐక్య వేదిక

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి అశోక్ కేసీఆర్ ప్రభుత్వానికి ఏజెంట్‌లాగా వ్యవహరిస్తున్నారని తెలంగాణ రాష్ట్ర విద్యార్థి సంఘాల ఐక్యవేదిక పేర్కొంది. విద్యార్థులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని ఎమ్ఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు రుద్రవరం లింగస్వామి మాదిగ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు మామిడి కాయల పరుశరామ్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వేణు, టివిఎస్ రాష్ట్ర అధ్యక్షులు కోట శ్రీనివాస్, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు జూపాక శ్రీనివాస్, టివివి రాష్ట్ర అధ్యక్షులు మద్దిలేటి, టిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు కృష్ణమాదిగ, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద్ నరేష్ మాదిగలు పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ ఈ నెల 13న ఇచ్చిన బంద్‌కు సహకరించాలని పిలుపునివ్వడం వల్లే విద్యార్థి సంఘాల నేతలతో కక్షగట్టి మాట్లాడుతున్నారని విమర్శించారు. విద్యార్థుల పక్షాన పోరాడుతున్న విద్యార్థి నేతలను అవమానించే విధంగా మాట్లాడుతూ, కేసులు నమోదు చేయిస్తున్నాడని తెలిపారు. ఇంటర్మీడియట్ బోర్డులో జరుగుతున్న అవినీతిని ప్రభుత్వం అరికట్టలేకపోతోందని చెప్పారు. 13న జరిగే బంద్ సందర్భంగా పరీక్షలు వాయిదా వేయాలని కోరారు.

వివాదాల పరిష్కారంలో మధ్యవర్తిత్వం కీలకం

- ఐసీడీఏఆర్ కార్యదర్శి మూర్తి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రత్యామ్నాయ వివాదాల పరిష్కారంలో మధ్యవర్తిత్వం కీలకమని అంతర్జాతీయ ప్రత్యా మ్నాయ వివాదాల పరిష్కార కేంద్రం(ఐసీడీఏఆర్) కార్యదర్శి, ప్రముఖ న్యాయవాది జెఎల్ఎన్ మూర్తి అన్నారు. మధ్యవర్తిత్వం వహించడం ద్వారా కేసులను సత్వరం పరిష్కరించే అవకాశం ఉంటుందని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్ లోని నాంపల్లిలో ఉన్న గగన్‌విహార్ కార్యాల యంలో ప్రత్యామ్నాయ వివాదాల పరిష్కారంపై సదస్సు నిర్వహించారు. ఇందులో న్యాయవాదులు, కంపెనీల ప్రతినిధులు, న్యాయ అధికారులు, లా స్టూడెంట్లు, ఆయా బహుళ జాతి కంపెనీల కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి మూర్తి మాట్లాడుతూ ఈనెల ఏడునే కేంద్ర ప్రభుత్వం మధ్యవర్తిత్వ (అర్బిట్రేషన్ అండ్ కన్సిలరేషన్(సవరణ) బిల్లు 2018ని ఆమోదించిందని గుర్తు చేశారు. ప్రత్యామ్నాయ వివాద పరిష్కారాలు మూడు పద్ధతుల ద్వారా చేయవచ్చని అన్నారు. అర్బిట్రేషన్, మీడియేషన్, కన్సిలీయేషన్ ద్వారా కేసులను పరిష్కరించవచ్చని చెప్పారు. వివాదాలను పరి ష్కరించేందుకు, సంస్థాగత మధ్యవర్తిత్వాన్ని ప్రోత్స హించేందుకు దేశంలో బలమైన వివాద పరిష్కార(ఏడీఆ ర్)యంత్రాంగాన్ని ఏర్పాటు చేశారని వివరించారు. మధ్యవర్తిత్వ ప్రక్రియ స్నేహపూరిత వాతావరణంలో, తక్కువ ఖర్చుతో చేయవచ్చని చెప్పారు. ఈ తరహా కేసులను నిర్ధారించడం కోసమే పార్లమెంటులో బిల్లు తెచ్చారని అభిప్రాయ పడ్డారు. ఈనేపథ్యంలోనే సత్వర న్యాయం కోసం ప్రభుత్వ, న్యాయ వ్యవస్థలు, సాంప్రదాయక విధానానికి భిన్నంగా ఏడీఆర్ పద్ధతిని ఆచరణలోకి తెచ్చారని చెప్పారు. ఇప్పటివరకు ఐసీడీఏఆర్ హైదరాబాద్ కేంద్రంగా 883 మధ్యవర్తిత్వ విచారణ చేసినట్టు గుర్తు చేశారు. సుమారు 494 కుటుంబ వివాదాలను పరిష్కరించినట్టు చెప్పారు. ప్రత్యామ్నాయ వివాదాలను సులభంగా పరిష్కరించడం కోసం ఈ సదస్సు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. బ్రిటిష్ స్కాలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు విజయానందన్ పాల్గొన్నారు.

నవచిత్రం



అలీ, బ్రహ్మానందం, టి.సుబ్బరామిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, విజయ్‌కుమార్ తదితరులు

బ్రహ్మానందంకు హాస్య నట బ్రహ్మ బిరుదు

'తనదైన హాస్యంతో 1100 చిత్రాల్లో విభిన్న పాత్రలు పోషించి తెలుగు వారి గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించిన బ్రహ్మానందాన్ని 'హాస్య నట బ్రహ్మ' బిరుదుతో సత్కరించబోతున్నందుకు ఆనందంగా ఉంది' అని టి.సుబ్బరామిరెడ్డి అన్నారు. కాకతీయ లలిత కళా పరిషత్తు ఆధ్వర్యంలో కాకతీయ కళా వైభవ మహోత్సవం పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం విదితమే. అందులో భాగంగా ఈ నెల 11న మహబూబ్ నగర్‌లో జరిగే ఈ ఉత్సవాల్లో బ్రహ్మానందాన్ని సత్కరించనున్నారు. ఆ విశేషాలను శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో టి.సుబ్బరామిరెడ్డి తెలియజేస్తూ, '700 సంవత్సరాల క్రితం కాంచీపురం నుంచి మహారాష్ట్ర వరకు దాదాపు తెలుగు వారిని పాలించిన ఘనత, చరిత్ర కాకతీయులది. అప్పటి కాకతీయుల శిల్ప కళా సంపద అమోఘం. ఆనాటి చరిత్రను, కళా వైభవాన్ని నేటి తరానికి తెలిపేందుకు శిల్ప కళ ఎంతో తోడ్పడుతుంది. వందల సంవత్సరాల చరిత్ర ఇప్పటికీ గుర్తుందంటే కారణం శిల్ప కళే. శ్రీకృష్ణదేవరాయలపైనా కాకతీయుల ప్రభావం ఉంది. ఆ కాకతీయుల సామ్రాజ్య కళా వైదుష్యాన్ని సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజానీకానికి తెలియజేయాలన్న ఉద్దేశంతో ఈ కాకతీయుల కళా వైభవ మహోత్సవాలు నిర్వహిస్తున్నాం. సినిమా రంగానికి ప్రాంతం, భాష అనే హద్దులు లేవు. అందుకే ఈ ఆదివారం జరిగే కార్యక్రమంలో పలువురు ప్రముఖ సినీ కళాకారులు రాజశేఖర్, జీవిత, బాబు మోహన్, పరుచూరి గోపాలకృష్ణ, అలీ, కవిత, కేథరిన్ థ్రెస్సా, హంసానందిని, శ్రద్ధాదాస్, పృథ్వీ, రఘుబాబు, శ్రీనివాస్‌రెడ్డిలతోపాటు స్థానిక కళాకారులు ఎల్లూరి శివారెడ్డి, కపిలవాయి లింగమూర్తి, గోరేటి వెంకన్న, చిక్కా హరీష్, జంగిరెడ్డి, పద్మాలయ ఆచార్య, వంగీశ్వర నీరజ తదితరులను కాకతీయ అవార్డులతో సత్కరిస్తాం. జితేందర్ రెడ్డి చైర్మన్‌గా, శ్రీనివాస్‌గౌడ్ కో చైర్మన్‌గా ఈ వేడుక జరుగనుంది' అని అన్నారు. 'కాకతీయ సంస్కృతి గొప్పతనాన్ని తెలిపేందుకు కవులు, కళాకారులు ఎంతో కృషి చేశారు. ప్రాజెక్టులు లేని సమయంలో చెరువుల ద్వారా ప్రజలకు బతుకు తెరువును చూపించిన వాళ్ళు కాకతీయులు. ఇక్కడ పేరిగి నృత్యం ఎంతో ప్రసిద్ధి చెందినది. కానీ గతంలో అది మనుగడకు నోచుకోలేదు. కాకతీయుల గొప్పతనాన్ని చాటుతూ సుబ్బరామిరెడ్డి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం. కళకు ప్రాంతీయ బేధం లేదు. ప్రాంతాలుగా విడిపోయి ఉన్నా తెలుగు ప్రజలది విడదీయలేని బంధం' అని ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. బ్రహ్మానందం చెబుతూ, 'లలితకళలు అంటే లలితా, గాయత్రిల కలయిక, వారు ఎవరినైతే ఆశీర్వదిస్తారో వారికే కళలు అబ్బుతాయి. కాకతీయులు కళలు ఇప్పుడు తిరిగి రూపుదిద్దుకుంటున్నాయి. అందులో భాగంగా నన్ను 'హాస్య నటబ్రహ్మ' బిరుదుతో సత్కరించడం నా పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నా. ఇండస్ట్రీలో నాకు అత్యంత అప్తుల్లో ఒకరు అలీ. ఇక సుబ్బరామిరెడ్డిగారు రసరజ్ఞ చక్రవర్తి. ఆయన కళాకారులను ఎంతగానో గౌరవిస్తారు' అని చెప్పారు. 'బ్రహ్మానందం నాకిష్టమైన వారు. ఆయన నటించిన 1100 సినిమాల్లో వెయ్యికి పైగా తెలుగు సినిమాలే ఉంటాయి. ఆయన్ని ఇప్పుడు సరైన విధంగా సత్కరించడం ఆనందంగా ఉంది. నాకు కళా నటరాజ్ అంటే ఇష్టం. ఆ నటరాజే సుబ్బరామిరెడ్డి' అని అలీ చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజయ్ కుమార్ తెలిపారు.



నిర్మాత సి.కల్యాణ్ తనయుడు తేజ వివాహం నాగ శ్రీ విద్యతో గురువారం హైదరాబాద్‌లోని ఇమేజ్ గార్డెన్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా బాలకృష్ణతోపాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించారు.



లైక్స్ కోసం దిగజారుతున్నారు..



శ్రీకాంత్

'తమ యూట్యూబ్ ఛానళ్ల లైక్‌లు, సబ్‌స్క్రైబ్స్ కోసం దిగజారి తప్పుడు వార్తలను క్రియేట్ చేస్తున్నారు. అవి మాకు చిరాకు పుట్టిస్తున్నాయి' అని హీరో శ్రీకాంత్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం హీరో శ్రీకాంత్‌కు యాక్సిడెంట్ అయ్యిందంటూ ఓ యూట్యూబ్ ఛానల్‌లో వార్తలొచ్చాయి. వీటిని శ్రీకాంత్ తీవ్రంగా ఖండిస్తూ, 'నేను క్షేమంగానే ఉన్నాను. గురువారం ఉదయం బెంగుళూరులో జరుగుతున్న షూటింగ్‌లో ఉన్నప్పుడు మీకు యాక్సిడెంట్ అయ్యిందంట కదా! ఎలా ఉందంటూ ఫోన్ చేశారు. హైదరాబాద్‌లో ఉన్న నా కుటుంబ సభ్యులకు కూడా ఈ విషయం తెలిసి కంగారుపడుతున్నారు. అభిమానులు ఆందోళన చెందుతున్నారు. మమ్మల్ని ఎంతో బాధకు గురి చేస్తున్నారు. యూట్యూబ్ లైక్స్ కోసం ఇలా దిగజారడం బాధాకరం. ఇలాంటి అసత్య వార్తలతో వీడియోలు చేసి వాయిస్ ఓవర్‌తో మీ లైక్స్ కోసం, రేటింగ్స్ కోసం ఇలాంటి వార్తలు పెట్టడం తప్పు. ఈ విషయాన్ని మూవీ ఆర్టిస్టు అసోషియేషన్ 'మా' కూడా సీరియస్‌గా తీసుకుంటుంది. అసత్య ప్రచారం జరిపిన వారిపై సైబర్ క్రైమ్ ఎస్పీ రామ్మోహన్‌రావుకు ఫిర్యాదు చేశాం' అని చెప్పారు.

అలరించే టెక్నికల్ థ్రిల్లర్ ఐతే 2.0

ఇంద్రనీల్ సేన్ గుప్తా, జారా షా, అభిషేక్, కర్తవ్య శర్మ, నీరజ్ మృణాల్, మృదాంజలి ప్రధాన పాత్రధారులుగా రాజ్ మాదిరాజు దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ఐతే 2.0'. ఫర్మ్ 9 పతాకంపై కె.విజయరామరాజు, హేమంత్ వల్లపురెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ట్రైలర్‌ను సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'పెరిగిన టెక్నాలజీ ద్వారా సైబర్ క్రైమ్ ఎలా జరుగుతుందనేది మనకు తెలిసిందే. దీన్ని ఓ సందేశాత్మకంగా చూపిస్తూ ఈ చిత్రాన్ని రూపొందించడం అభినందనీయం. సందేశంతోపాటు ఇప్పటి ట్రెండ్‌కు తగ్గ సినిమాలను ప్రేక్షకులు చక్కగా ఆదరిస్తున్నారు. ఆ కోవలో ఈ సినిమా కూడా పెద్ద సక్సెస్ కావాలని కోరుకుంటున్నా' అని అన్నారు. 'ఈ సినిమాకు సంబంధించిన యు.ఎస్ హక్కులు ఫ్యాన్సీ రేటుకు అమ్ముడయ్యాయి. ఆ ఆనంద సమయంలో తలసాని చేతుల మీదుగా ట్రైలర్ విడుదల కావడం ఇంకా హ్యాపీగా ఉంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని ఈ నెల 16న విడుదల చేస్తున్నాం. కచ్చితంగా పెద్ద హిట్ అవుతుందని నమ్ముతున్నాం' అని దర్శకుడు రాజ్ మాదిరాజు తెలిపారు. నిర్మాత కె.విజయరామరాజు చెబుతూ, 'టెక్నికల్ థ్రిల్లర్‌గా అందరినీ ఆకట్టుకునే చిత్రమవుతుంది' అని చెప్పారు. ఈ చిత్రానికి కెమెరా: కౌశిక్ అభిమాను, ఎడిటింగ్: కార్తీక్ పల్లె, ఆర్ట్ : రాజీవ్ నాయర్.



మంత్రి తలసానితో 'ఐతే 2.0' చిత్ర బృందం

కాలేజీ జ్ఞాపకాలను గుర్తు చేసే ఆనందం



'ఆనందం' చిత్రంలోని ఒక దృశ్యం

గణేష్ రాజ్ దర్శకత్వంలో మలయాళంలో విడుదలై ఘన విజయం సాధించిన చిత్రం 'ఆనందం'. ఈ చిత్రాన్ని అదే పేరుతో సుఖీభవ మూవీస్ పతాకంపై గురురాజ్ తెలుగులో విడుదల చేస్తున్నారు. ఇందులో నివిన్ పాల్ అతిథి పాత్రలో మెరవడం విశేషం. విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రం గురించి నిర్మాత గురురాజ్ మాట్లాడుతూ, 'ప్రతి క్షణాన్ని ఆనందంగా గడపాలని ప్రతి ఒక్కరి మనస్సుల్లోనూ ఉంటుంది. జీవితంలో మిగిలిన రోజుల సంగతి ఎలా ఉన్నా కాలేజ్‌లో, క్యాంపస్‌లో సరదాగా గడిపే క్షణాలు మాత్రం ఆనందానికి కేరాఫ్ అడ్రస్‌లు. ఓ వైపు చదువు అనే బాధ్యత ఉన్నప్పటికీ భవిష్యత్ గురించి ఆలోచనలు వెంటాడుతున్నా, చుట్టూ స్నేహితులు, అందమైన కలలు ఆనందాల లోకంలో విహరింపచేస్తాయి. కాలేజ్ అనుభవాలు ఎక్కడైనా ఒకేరకంగా మనసు పొరల్లో పదిలమైన జ్ఞాపకాలుగా మిగిలి ఉంటాయి. నాలుగు రోజుల పాటు సాగే ఇండస్ట్రియల్ టూర్‌లో మూడు ప్రేమ జంటల కథే ఈ సినిమా. చూసిన ప్రతి ఒక్కరికీ కాలేజ్ రోజులను గుర్తు చేస్తుంది. ప్రతి గుండెను తడుతుంది. సినిమా అనువాద పనులు పూర్తయ్యాయి. ఈ నెల 17న పాటల వేడుకను గ్రాండ్‌గా నిర్వహిస్తాం. కేరళలో టాప్ మ్యూజిక్ డైరెక్టర్లలో ఒకరైన సచిన్ వారియర్ స్వరాలకు వనమాలి అద్భుతమైన సాహిత్యాన్ని అందించారు. 'హ్యాపీడేస్' పాటల తరహాలోనే ఈ చిత్ర పాటలు కూడా తప్పకుండా చార్ట్ బస్టర్ అవుతాయి. 23న సినిమాను రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నాం. మలయాళంలో బడ్జెట్‌కు ఐదింతలు వసూలు చేసిందంటే ఈ కథకు ఉన్న పవర్ ఏంటో అర్థం చేసుకోవచ్చు. తెలుగులోనూ అదే స్థాయిలో ఆడుతుందనే నమ్మకం ఉంది. ఆ నమ్మకంతోనే రీమేక్ రైట్స్ ఇవ్వమని చాలా మంది వచ్చినప్పటికీ డబ్బింగ్ చేస్తున్నాం' అని చెప్పారు. అరుణ్ కురియన్, థామస్ మాథ్యూ, రోషన్ మాథ్యూ, విశాక్ నాయర్, సిద్ధి మహాజన కట్టి, అన్ను ఆంటోని, అనార్కలి మరికర్, రెంజి ఫణిక్కర్ తదితరులు ఈ చిత్రంలో ప్రధాన పాత్రల్లో నటించారు.



ఈ ఏడాది కూడా లేనట్టే..!

ప్రియాంక చోప్రా బాలీవుడ్‌కి దూరమై దాదాపు రెండేండ్లు అవుతోంది. 2016లో 'జై గంగాజల్' చిత్రంలో మెరిసిన ప్రియాంక ఆ తర్వాత హాలీవుడ్ చిత్రాలతో బిజీ అయిపోయింది. ప్రస్తుతం 'క్వాంటికో' టెలివిజన్ సిరీస్‌తోపాటు రెండు హాలీవుడ్ చిత్రాల్లో నటిస్తోంది. గతేడాది ఒక్క బాలీవుడ్ చిత్రంలోనూ నటించని ప్రియాంక ఈ ఏడాదైనా ఓ చిత్రానికి గ్రీన్‌సిగ్నల్ ఇస్తుందని అందరూ భావించారు. అంతేకాదు దీనికి తగ్గట్టుగా రాకేష్ శర్మ బయోపిక్‌లో ప్రియాంక నటిస్తుందనే వార్త నిన్న మొన్నటి వరకు సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. అయితే ఈ ప్రాజెక్ట్ విషయమై ప్రియాంక ఇప్పటివరకు ఎటువంటి ప్రకటన చేయలేదు. ఈ నేపథ్యంలో ప్రియాంకతో బాలీవుడ్ హీరో రణ్‌వీర్ సింగ్‌తో జరిగిన ఛాటింగ్‌లో, 'మిమ్మల్ని మేం చాలా మిస్ అవుతున్నాం. తిరిగి బాలీవుడ్‌లో సినిమాలు ఎందుకు చేయకూడదు?' అని రణ్‌వీర్ సింగ్ ప్రశ్నించగా, 'ఇది దాదాపు జరుగుతోంది' అని ప్రియాంక అస్పష్టమైన సమాధానమిచ్చింది. దీంతో ఈ ఏడాది కూడా బాలీవుడ్ సినిమా ఉండదని ప్రియాంక చెప్పకనే చెప్పేసింది. ఇదిలా ఉంటే, ప్రియాంక కమ్‌బ్యాక్ సినిమాగా రాకేష్ శర్మ బయోపిక్ కచ్చితంగా ఉంటుందని, అన్ని కుదిరితే ఈ సినిమా వచ్చే ఏడాదిలో ప్రారంభం కానుందని బాలీవుడ్ వర్గాలు గట్టిగా చెబుతున్నాయి.

ప్రియాంక చోప్రా

ఇది అన్యాయం..



ప్రతాని రామకృష్ణగౌడ్, ఆర్.నారాయణమూర్తి

'డిజిటల్ రేట్స్ విషయంలో ఇటీవల చేపట్టిన బంద్‌ను అర్థాంతరంగా ముగించారు. నామ మాత్రపు తగ్గింపుతో బంద్‌ను ఆపేశారు. ఇది అన్యాయం. డిజిటల్ రేట్స్ పూర్తిగా తగ్గించాలని డిమాండ్ చేస్తున్నాం. రెండు రాష్ట్రాల సినిమాటోగ్రఫీ మంత్రులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలి' అని ఆర్.నారాయణ మూర్తి అన్నారు. క్యూబ్, యుఎఫ్ఓ డిజిటిల్ రేట్స్ తగ్గించాలని మార్చి 2 నుంచి థియేటర్ల బంద్ నిర్వహించిన విషయం విదితమే. కొంత మేర తగ్గించడంతో బంద్‌ను విరమించారు. ఈ నేపథ్యంలో ఆర్.నారాయణమూర్తి శుక్రవారం హైదరాబాద్‌లో మాట్లాడుతూ, 'బంద్ ప్రకటనను విరమించడం మమ్మల్ని ఆవేదనకు గురి చేసింది. బంద్ కూడా పరీక్షల టైమ్‌లో నిర్వహించారు. ముమ్ముందు పెద్ద సినిమాలు ఉండటం వల్ల బంద్‌ను విరమింపచేశారు. దీని వల్ల కూడా చిన్న సినిమాలే బలయ్యాయి. ఇంగ్లీష్ సినిమాలను ఫ్రీగా వేస్తున్నారు, హిందీ సినిమాలకు నామినల్ రేట్లను వసూలు చేస్తున్నారు. కానీ తెలుగు చిత్రాలకు మాత్రమే భారీగా వసూలు చేస్తున్నారు. ఇంగ్లీష్ సినిమాల మాదిరి మొత్తం ఫీజు తగ్గించాలని పోరాటం చేపట్టాం. చిన్న నిర్మాతలం కాబట్టి సక్సెస్ కాలేకపోయాం. ఇందుకు పెద్ద నిర్మాతలు కలిసి రావకపోవడమే కారణం. డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు, డిజిటల్ సంస్థల యాజమానులు కూడా వాళ్లే కావడంతో ఇది సక్సెస్ కాలేకపోయింది. ఇది కొంది మంది చేత, కొద్దిమంది కొరకు పాలించే ఇండస్ట్రీగా మారింది. ఇతర పరిశ్రమలు బంద్‌ను కొనసాగిస్తూనే ఉన్నాయి. కాని ఇక్కడ బంద్‌ను పక్కన పెట్టి సినిమాలను ప్రదర్శిస్తున్నారు. దీనిలో ప్రభుత్వం ఇన్‌వాల్వ్ కావాలి. కార్పొరేట్ శక్తులను పక్కన పెట్టి కొత్త వారిని, రెండు వేలకే డిజిటల్ ప్రదర్శనకు ముందుకు వచ్చే సంస్థలను ప్రోత్సహించాలి. గుత్తాధిపత్యాన్ని బ్రేక్ చేయాలి' అని చెప్పారు. 'డిజిటల్ రేట్ల ఫీజు 2 వేలు, 2500 వరకు ఇచ్చే సంస్థలను ప్రోత్సహిస్తే చిన్న సినిమాలకు, పరిశ్రమకు బాగుంటుంది. లేకపోతే నిర్మాతలు తిరగబడే రోజు వస్తుంది' అని తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు ఆర్కేగౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అలీ అహ్మద్, రాజ్ కిరణ్, రాధా తదితరులు పాల్గొన్నారు.

ఆ టైమ్ వచ్చేసింది..



దీపికా పదుకొనె

'ఇప్పటి వరకు ఇతరుల కోసం టైమ్‌ను కేటాయించిన మహిళలు ఇప్పుడు తమ కోసం టైమ్‌ను కేటాయించుకోవాల్సిన సమయం ఆసన్నమైంది' అని అంటోంది దీపికా పదుకొనె. గురువారం మహిళా దినోత్సవం సందర్భంగా తన అభిమానులను, మహిళలను ఉద్దేశించి దీపికా ట్వీట్ చేసింది. 'ఇంటిపనుల్లో బిజీగా ఉంటూ, ఇతరుల కోసం తమ జీవితాన్ని త్యాగం చేస్తున్న మహిళలు ఇకపై తమ గురించి ఆలోచించుకోండి. తమ గురించి తాము ఆలోచించుకునేందుకు స్వేచ్ఛగా గాలి తీసుకోండి. ఇకపై కంటిన్యూగా దాన్ని ఫాలో అవ్వండి. మీ సెల్ఫిష్, కేర్ ముఖ్యం. ఈ టైమ్‌లో నేను ఈ విషయం చెబుతున్నందుకు చాలా గర్వంగా ఉంది. చేసే పని నిజాయితీగా చేస్తే దాని ఫలితాలు అద్భుతంగా ఉంటాయి. ప్రస్తుతం ఆ ఫలితాన్ని నేను చూస్తున్నాను. ఇకపై ప్రేక్షకులు కలకాలం గుర్తు పెట్టుకునే పాత్రలను పోషించాలనుకుంటున్నాను. ఇన్నేండ్ల నా జర్నీలో భాగమైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు' అని అన్నారు. దీపికా ప్రస్తుతం షారూఖ్ 'జీరో' చిత్రంలో అతిథి పాత్రలో మెరవనుంది.

పాటల సందడిలో దెయ్యం చెప్పిన కథ



'దెయ్యం చెప్పిన కథ' ఆడియో ఆవిష్కరణ దృశ్యం

శివ, సుప్రియ జంటగా ప్రదీప్ రాజ్ దర్శకత్వంలో పెనాక దయాకర్‌రెడ్డి నిర్మించిన చిత్రం 'దెయ్యం చెప్పిన కథ'. నవీన్.జె సంగీతం సమకూర్చిన ఈ చిత్ర ఆడియో విడుదల కార్యక్రమం ఇటీవల హైదరాబాద్‌లో జరిగింది. అతిథులుగా విచ్చేసిన వి.సాగర్, తుమ్మలపల్లి రామసత్యనారాయణ, సాయివెంకట్ సంయుక్తంగా పాటల సీడీలను ఆవిష్కరించారు. 'ట్రైలర్, పాటలు చాలా బాగున్నాయి. కొత్త తరహాలో సాగే ఈ హర్రర్ సినిమా విజయం సాధించి చిత్ర బృందానికి మంచి పేరు తీసుకురావాలి' అని అతిథులు ఆకాంక్షించారు. చిత్ర దర్శకుడు ప్రదీప్ రాజ్ చెబుతూ, 'ఊరి బయటకి వచ్చిన వాళ్ళని దెయ్యం అదృశ్యం చేస్తుంది. అలా చేయడానికి కారణాలేంటనేది ఈ చిత్ర కథాంశం. ఆద్యంతం భయపెట్టిస్తూనే వినోదాన్ని పంచుతుంది' అని అన్నారు. 'హర్రర్ చిత్రాలు చాలా వచ్చాయి, కానీ దెయ్యం చెప్పే కథతో ఏ సినిమా రాలేదు. ప్రేక్షకులకది కొత్త అనుభూతినిస్తుంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి సినిమాను ఏప్రిల్‌లో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం' అని నిర్మాత తెలిపారు. 'సంగీత దర్శకుడిగా నాకిది తొలి చిత్రం. ఛాన్స్ ఇచ్చిన దర్శకనిర్మాతలకు థ్యాంక్స్. పాటలు శ్రోతలను అలరిస్తాయి' అని సంగీత దర్శకుడు నవీన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎన్.రావు, శివ, హారిక, గాయని బృంద, లక్ష్మి తదితరులు పాల్గొని చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.

అరుదైన తెలుగు పదాలతో..



'రాజారథం'లో రవిశంకర్

నిరూప్ భండారి, అవంతిక జంటగా అనూప్ భండారి దర్శకత్వంలో జాలీ హిట్స్ పతాకంపై 'రాజరథం' చిత్రం రూపొందుతున్న విషయం విదితమే. నటుడు రవిశంకర్ ఈ చిత్రంలోని 'చల్ చల్ గుర్రం' అనే పాటను పాడారు. ఈ మూడో పాటను తాజాగా విడుదల చేశారు. ఆ విశేషాలను చిత్ర బృందం తెలియజేస్తూ, 'ఎన్నో సినిమాలకి, ఎంతో మందికి డబ్బింగ్ చెప్పిన నటుడు రవిశంకర్ మొదటిసారిగా ఈ సినిమాలో తాను పోషిస్తున్న అంకుల్ పాత్ర కోసం 'చల్ చల్ గుర్రం' పాటను ఆలపించారు. ఈ సాంగ్‌ను మహాబలేశ్వర్, పూణేలోని మాల్షెజ్ ఘాట్ వంటి అందమైన ప్రదేశాలలో కనువిందుగా చిత్రీకరించారు. దిలీప్ రాజ్ ప్రత్యేకంగా డిజైన్ చేసిన పాతకాలపు సైడ్ కార్ ఉండే స్కూటర్ మనల్ని పాత జ్ఞాపకాల్లోకి తీసుకెళ్ళడం ఖాయం. అరుదైన తెలుగు పదాలతో రామజోగయ్య శాస్త్రి పదాల అల్లిక, అనూప్ భండారి స్వరపరచిన బాణీతో ఈ పాట వీనుల విందుగా ఉంటూ సాహిత్య పరంగా ప్రత్యేకతను చాటుకుంది. నృత్య దర్శకుడు బాస్కో సీజర్ పర్యవేక్షణలో రూపొందిన ఈ పాటలో స్థానిక పల్లె జనాలు కూడా పాలు పంచుకున్నారు. ఆద్యంతం వినోదాత్మకంగా రూపొందిన ఈ సినిమాను ఈ నెల 23న విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు' అని తెలిపింది

పెట్టుబడి పథకం అమలు ఆలోచన లేదు

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాదిరిగా దేశంలోని రైతాంగానికి మద్దతుగా 'పంట పెట్టుబడి' పథకం అమలు చేసే ప్రతిపాదన తమకు లేదని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. కేంద్ర వ్యవసాయశాఖ ప్రస్తుతం ఇలాంటి ఆలోచనేమీ చేయడం లేదని కేంద్రం తెలిపింది. కాంగ్రెస్ ఎంపీ ఎంఎ ఖాన్ రాజ్యసభలో అడిగిన ఓ ప్రశ్నకు కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి పురుషోత్తంరూపాలా శుక్రవారం ఈ మేరకు రాతపూర్వక సమాధానం ఇచ్చారు. పట్టదారు పాసు పుస్తకాల ఆధారంగా ఖరీఫ్-2018 సీజన్ నుంచి రైతులకు ఎకరాకు రూ. 4000 పంటపెట్టుబడి పథకాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్నట్టు మంత్రి తెలిపారు. మొత్తం 71,76,000 మంది రైతులకు వర్తించే ఈ పథకం కోసం రూ.11,999 కోట్ల బడ్జెట్ అవసరమని కేంద్రమంత్రి తన సమాధానంలో పేర్కొన్నారు.

కారుణ్య మరణాలకు సుప్రీం ఓకే

(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా జస్టిస్ దీపక్‌మిశ్రా వ్యాఖ్యానించారు. కారుణ్య మరణాన్ని కోరుకునే వ్యక్తి ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా వీలునామా రాయాలని, కుటుంబసభ్యుల అనుమతి కూడా అవసరమని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. ఆ వ్యక్తి కోలుకోవడం సాధ్యం కాదని వైద్యుల బృందం నిర్ధారించాలని తెలిపారు. కారుణ్య మరణం కోరుకునే వ్యక్తికి సంబంధించిన కుటుంబసభ్యులు లేదా సన్నిహితులు హైకోర్టును ఆశ్రయించినపుడు మెడికల్ బోర్డును ఏర్పాటు చేసి నిర్ణయిస్తారని మార్గదర్శకాల్లో తెలిపారు.

కెమికల్ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం

నవతెలంగాణ-గుమ్మడిదల

కెమికల్ ఫ్యాక్టరీలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా గుమ్మడిదలలో శుక్రవారం జరిగింది. అక్కడి నుంచి కార్మికులు పరుగెత్తడంతో ప్రాణాపాయం తప్పింది. స్థానికుల వివరాల ప్రకారం...గుమ్మడిదలలోని కానుకుంట రోడ్డు పక్కన ఉన్న మహాసాయి కెమికల్ పరిశ్రమలో రెక్టిఫైడ్ స్పిరిట్ ముడిసరుకు తయారు చేస్తారు. అక్కడ నుంచి వేరే కంపెనీలకు ఎగుమతి చేస్తారు. ఆ కంపెనీలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా శుక్రవారం డ్రమ్ములు పేలి అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో పరిశ్రమ పూర్తిగా దగ్ధమైంది.

ఫ్యాక్టరీ గోదాం తగలబడింది. రెండు డీసీఎంలు, రెండు ట్రాక్టరు కాలిపోయాయి. ఫ్యాక్టరీలోని భవనాలు దెబ్బతిన్నాయి. మంటలు వేగంగా విస్తరించటంతో పక్కనే ఉన్న ఫౌల్ట్రీఫాం కాలిపోయింది. పరిశ్రమలో మూడు షిఫ్టుల్లో కలిసి వందమంది కార్మికులు పనిచేస్తుండగా...ప్రమాద సమయంలో 35 మంది విధుల్లో ఉన్నారు.

మంటలంటుకోగానే వారు అక్కడినుంచి పరుగెత్తారు. పరిశ్రమ పూర్తిగా దగ్ధం కావడంతో రూ.కోట్లలో నష్టం ఉంటుందని ఫ్యాక్టరీ నిర్వాహకులు గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ గౌరీప్రశాంత్ చెప్పారు. ఇదే పరిశ్రమలో రెండేండ్ల కింద ప్రమాదం సంభవించి ఆస్తినష్టం వాటిల్లింది. మళ్లీ అదే తీరులో మళ్లీ ఘటన జరిగింది. ఇన్సూరెన్స్ కోసమే ఫ్యాక్టరీ యాజమాన్యం ఈ పని చేసిందన్న అనుమానాలూ వ్యక్తం అవుతున్నాయి.

20న చలో అసెంబ్లీ

- పీఆర్‌సీతో పాటే కార్మికులకు వేతనాలు పెంచాలి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కొత్త పీఆర్‌సీతో పాటే వేతనాలు పెంచాలని, వారిని వెంటనే శాశ్వత ఉద్యోగులుగా నియమించాలని కోరుతూ ఈ నెల 20న చలో అసెంబ్లీ ముట్టడి చేపట్టనున్నట్టు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ తెలిపింది. ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను శాశ్వత ప్రాతిపదికన నియమించకుండా కోర్టుల పేరుతో సర్కారు కాలయాపన చేస్తున్నదని విమర్శించింది. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో "కొత్త పీఆర్‌సీతో పాటే రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు పెంచాలి" అనే అంశంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర సదస్సు నిర్వహించింది. ఈ సదస్సులో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు జె వెంకటేశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఎం పద్మశ్రీ, గ్రేటర్ హైదరాబాద్ కన్వీనర్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సైదులుతో పాటు వివిధ జిల్లాల నుంచి వచ్చిన కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జె వెంకటేశ్ మాట్లాడుతూ కోర్టుల పేరుతో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయకుండా తత్సారం చేస్తున్నదని విమర్శించారు. శాశ్వత నియామకాల కోసం కోర్టులు అడ్డుచెప్పితే.. అదే సుప్రీంకోర్టు తీర్పు మార్గదర్శకాలకు అనుగుణంగా "సమాన పనికి సమాన వేతనం" ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. కొత్త పీఆర్‌సీ ప్రకారం రాష్ట్రంలోని 1.30లక్షల మంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులందరికీ వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కొత్త జిల్లాల ఏర్పాటు నేపథ్యంలో ఒక్కో జిల్లాకు 5వేల మంది ఉద్యోగులు అవసరం ఉండగా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతోనే సర్దుబాటు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో 8,9 పీఆర్‌సీల్లో నిర్ణయించినట్టు కాకుండా టీఆర్ఎస్ ప్రభుత్వం జీతాలను తగ్గించిందని ఆందోళన వ్యక్తం చేశారు. 2016లో తీసుకువచ్చిన జీవో నెం 14 ప్రకారం 80శాతం జీతాలు అమలు కాకపోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లిస్తున్న తరహాలోనే కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులకూడా ప్రతి నెల ఒకటో తేదీనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. స్వరాష్ట్రం లోనూ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పట్ల వివక్ష కొనసాగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉద్యోగులతో వెట్టిచాకిరి

కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో ప్రభుత్వం వెట్టిచాకిరి చేయించుకుంటుందని విమర్శించారు. ఉద్యోగులందరికీ సమానపనికి సమానవేతనంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పద్మశ్రీ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన అన్యాయాలకు మించి సొంత రాష్ట్రమైన తెలంగాణలో జరుగుతున్నాయని విమర్శించారు.

తెలంగాణ బిడ్డలపైన సర్కార్‌కు ప్రేముంటే 8,9 పీఆర్ఎస్సీల కంటే కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ జీతాలు ఎందుకు తగ్గించిందని ప్రశ్నించారు. కుమార్ మాట్లాడుతూ హక్కుల సాధన కోసం కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులంతా ఐక్యంగా ఉండి పోరాడాలని పిలుపునిచ్చారు. 2016లో జీవో నెంబర్ 14 పోరాటాల వల్లనే సాధ్యమైందన్నారు.

డిమాండ్స్

మహిళలకు 6నెలల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలి. ప్రతినెల 5వ తేదీలోగా జీతం వేతనాలు చెల్లించాలి. పేస్లిప్‌లు ఇవ్వాలి. ప్రభుత్వ డిపార్ట్‌మెంట్‌లే ఐడీ కార్డులు జారీ చేయాలి. బస్ పాస్ సౌకర్యం కల్పించాలి. ప్రమాదం, జీవిత బీమా సౌకర్యం కల్పించాలి, ఉద్యోగులపై వేధింపులు అపాలి. ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించబడ్డ తెలంగాణ ఉద్యోగులను వెంటనే వెనక్కి తేవాలి.

పెండ్లింట విషాదం

పెండ్లింట తీవ్ర విషాదం చోటుచేసుకుంది. వివాహం అనంతరం వరుని ఇంటికి బయలుదేరిన వాహనం ప్రమాదానికి గురైంది. ఖమ్మం జిల్లా కొణిజర్ల సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున ఇన్నోవా వాహనం అదుపు తప్పి చెట్టును ఢీ కొట్టింది. ఈ ఘటనలో పెండ్లి కుమారుడితోపాటు అతని అక్క, చెల్లి, బావ, డ్రైవర్ ప్రాణం కోల్పోయారు. మరో ఐదుగురికి గాయాలయ్యాయి. పెండ్లి కుమార్తె దుర్గ, పెండ్లి కుమారుని బావ శేష చలపతికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...

నవతెలంగాణ-ఖమ్మం ప్రతినిధి

వరంగల్ జిల్లా వర్ధన్నపేటకు చెందిన అచ్చి రామకష్ణ ప్రసాద్‌కు తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రికి చెందిన అమ్మాజీ దుర్గతో పశ్చిమగోదావరి జిల్లా తణుకులోని కేశస్వామి ఆలయంలో గురువారం రాత్రి వివాహం జరిగింది. అనంతరం రెండు ఇన్నోవాలు, టవేరా, మినీ బస్సులో వరుని గ్రామానికి పెండ్లి బృందం బయలుదేరింది. ముందుగా వచ్చిన వధూవరుల ఇన్నోవా వాహనం ఖమ్మం జిల్లా కొణిజర్ల సమీపానికి రాగానే ముందు వెళ్తున్న మరో వాహనాన్ని డ్రైవర్ ఓవర్‌టేక్ చేయబోయాడు. ఈ క్రమంలో వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనున్న చెట్టును బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో వరుడు రామకష్ణ ప్రసాద్, అతని అక్క పద్మ, చెల్లి శ్రీదేవి, బావ శరత్, డ్రైవర్ వేణు అక్కడికక్కడే ప్రాణం కోల్పోయారు. వరుని మరో బావ శేష చలపతికి, వధువు దుర్గకు తీవ్ర గాయాలయ్యాయి. వరుని అక్కాచెల్లి పిల్లలు మహితి, రిషిత్, రామన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వారిని ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పిల్లలు తల్లిదండ్రుల కోసం అడుగుతుండటంతో బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. శేష చలపతి పరిస్థితి విషమంగా ఉండటంతో ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు.

కనీస వేతనాలివ్వండి..

నవతెలంగాణ-యంత్రాంగం

జీవో 167 సవరించాలని, కనీస వేతనం రూ. 18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వాలంటరీ అండ్ కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో జిల్లాల్లో కలెక్టరేట్ల ఎదుట ఆశాలు శుక్రవారం ధర్నా చేశారు. మెదక్, సిద్దిపేట జిలాల్లో ధర్నాలు చేసి అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. సిద్దిపేటలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రేవంత్ కుమార్, మెదక్‌లో యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.నర్సమ్మ మాట్లాడుతూ ఆశా వర్కర్లకు నష్టం కలిగిస్తున్న జీవో 167 సవరించాలని, కనీస వేతనం 18 వేలు అమలు చేయాలని కోరారు. ఈ నెల 16న చేపట్టే 'చలో హైదరాబాద్' కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. మహబూబ్‌నగర్‌లోని తెలంగాణ చౌరస్తాలో ధర్నా చేశారు. ధర్నాకు సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దీప్లానాయక్, నల్లవెల్లి కురుమూర్తి మద్దతు తెలిపారు. నాగర్‌కర్నూల్, వనపర్తిలలో ధర్నాలు చేశారు. వనపర్తిలో ఆశా వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సునీత, గిరిజ, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మండ్లరాజు, పుట్టా ఆంజనేయులు పాల్గొన్నారు. కరీంనగర్ కలెక్టర్‌రేట్ ఎదుట జరిగిన ధర్నాలో సీఐటీయూ కరీంనగర్ జిల్లా కార్యదర్శి బండారి శేఖర్ మాట్లాడారు. ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ఆశావర్కర్లు ధర్నా చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేష్, ఆశావర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు జ్యోతి, ఉపాధ్యక్షులు లక్ష్మీ, ప్రధాన కార్యదర్శి నైతం శోభ పాల్గొన్నారు. భద్రాద్రి జిల్లా కొత్తగూడెంలో సీఐటీయూ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన చేపట్టి అక్కడ ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. జయశంకర్ కలెక్టరే ట్ ఎదుట రాస్తారోకో చేశారు. నిజామాబాద్, కామారెడ్డి కలెక్టరేట్ల ఎదుట ధర్నా చేపట్టారు. యూనియన్ నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ ఏఎన్ఎంల నియామకాల్లో ఆశాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత, పింఛన్, ఈఎస్ఐ సౌకర్యాలను కల్పించాలని కోరారు. అనంతరం కలెక్టరేట్ ఏవోకు వినతి పత్రం అందజేశారు. కామారెడ్డి జిల్లాలో కనీస వేతనం చెల్లించాలనే సీఐటీ యూ జిల్లా కార్యదర్శి సిద్ధిరాములు డిమాండ్ చేశారు. కలెక్టర్ సత్యనారాయణకు వినతిపత్రాన్ని అందజేశారు.

నా పుట్టుక.. చావు టీఆర్ఎస్‌తోనే

నవతెలంగాణప్రత్యేకప్రతినిధి - హైదరాబాద్

సోషల్ మీడియా వేదికగా తనపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని సాగునీటి శాఖ మంత్రి హరీశ్‌రావు ఖండించారు. తన భవిష్యత్తు రాజకీయాలపై సోషల్ మీడియాలో కొందరు వ్యక్తులు ఇష్టం వచ్చినట్టు పోస్టింగులు పెడుతున్నారని ఆయన మండిపడ్డారు. తాను బీజేపీలో చేరుతున్నట్టు సోషల్ మీడియాలో ఒక వీడియోను పెట్టారని, అది ఒక ప్రముఖ చానెల్‌లో ప్రసారమైన వార్తాకథనం అని చిత్రీకరించేలా ఆ ఛానెల్ లోగోను మార్ఫింగ్ చేశారని వెల్లడిస్తూ ఆ చానెల్ యాజమాన్యం కూడా ఈ తప్పుడు పోస్టింగ్ చేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. తాను బీజేపీలో చేరుతున్నట్టు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పోస్టింగ్‌పై తక్షణమే విచారణ జరిపి అందుకు కారణమైన వారిని జైలులో పెట్టాలని డీజీపీ మహేందర్‌రెడ్డిని కోరామన్నారు. శుక్రవారం టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, మండలిలో ప్రభుత్వ విప్ బి.వెంకటేశ్వర్లుతో కలిసి మీడియాతో మాట్లాడారు. సోషల్ మీడియాలో పోస్టింగ్‌లపై మంత్రి హరీశ్ స్పందిస్తూ ' నేను టీఆర్ఎస్‌పార్టీలో క్రమశిక్షణ కలిగిన కార్యకర్తను. కేసీఆర్ మాట హరీశ్‌రావు, నా పుట్టుక టీఆర్ఎస్‌తోనే, నా చావు టీఆర్ఎస్‌తోనే. నేను ఉద్యమాల నుంచి త్యాగాల నుంచి వచ్చా, తెలంగాణ కోసం రెండు సార్లు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన. నాకు త్యాగాలు తప్ప ద్రోహాలు తెలియదు. నేను ఆ పార్టీలో చేరుతున్నానని, ఈ పార్టీలో చేరుతున్నానని తనపై అదేపనిగా దుష్ప్రచారం చేస్తే సహించేది లేదు. మీడియా ప్రతినిధులు కూడా ఇలాంటి ప్రాధాన్యం ఇవ్వొద్దని నా సూచన' అని హరీశ్‌రావు తన మనసులో ఉన్న భావాన్ని వ్యక్తీకరించారు. అనేక సార్లు ఇదే విషయంపై స్పష్టత ఇచ్చానన్నారు. తమ నాయకుడు కేసీఆర్ ఏ నిర్ణయం తీసుకున్న దానికి కట్టుబడి ఉంటానన్నారు. తాను ఎక్కడినుంచి పోటీ చేయాలి.. ఎమ్మెల్యేగా చేయాలా.. లేక ఎంపీగా చేయాలనేది కేసీఆరే నిర్ణయిస్తారని తెలిపారు. కేసీఆర్ మాటే తన బాటగా హరీశ్ చెప్పారు.

అధికారంలోకి రాలేమని కాంగ్రెస్ వాగ్దానాలు

ఎలాగూ అధికారం లోకి రాలేమని కాంగ్రెస్‌పార్టీ నేతలు ఏవేవో వాగ్దానాలు చేస్తున్నారని మంత్రి హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ కు ప్రజల్లో స్పందన లేదన్నారు. ప్రభుత్వం పై ప్రజల్లో వ్యతిరేకత లేదు గనుకే కాంగ్రెస్ కు స్పందన లేదన్నారు. ప్రజల్లో ఆ పార్టీ పట్ల విశ్వాసం లేదన్నారు. 2009 లో మ్యానిఫెస్టో లో చెప్పిన ఏ ఒక్క హామీనైనా కాంగ్రెస్ పార్టీ నెరవేర్చిందా ? అని ప్రశ్నించారు. అప్పుడు రైతుల కు తొమ్మిది గంటల కరెంటు ఇస్తామని చెప్పి, ఏడు గంటలు కూడా ఇవ్వలేకపోయారన్నారు. తాము 24 గంటల ఉచిత కరెంటు ఇస్తున్నామన్నారు. పేదలకు కడుపు నిండా అన్నం పెట్టేందుకు బియ్యం కోటాను పెంచామన్నారు. కాంగ్రెస్ హయాంలో ఆడపిల్లలను అమ్ముకునే పరిస్థితి ఉంటే, ఇప్పుడు ఆడపిల్ల పుడితే లక్ష్మి గా మారిందన్నారు. ప్రజలకు మీ హామీల పై విశ్వాసం లేదు గనుకే బస్సు యాత్ర కు స్పందన రాలేదన్నారు. అసహనంతో నోటికి ఏదోస్తే అది మాట్లాడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ నేతలు మోకాళ్ళ యాత్రలు చేసినా, పాద యాత్రలు చేసినా వారికి అధికారం రాదన్నారు. మంత్రి ఈటల రాజేందర్‌పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు.

వారిది పిక్నిక్ యాత్ర : మంత్రి తలసాని

కాంగ్రెస్ నేతలు బస్సు యాత్రను తమ పిక్నిక్ యాత్ర గా మార్చుకున్నారని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. అడ్డగోలుగా అందరినీ ఏక వచనంతో తిడుతున్న కాంగ్రెస్ నేతలు ముందు ఇప్పుడున్న ఎమ్మెల్యే సీట్ల లో సగం సీట్లయినా గెలుస్తారో చెప్పాలన్నారు. అధికారంలో ఉండగా ప్రజలను పట్టించుకోని కాంగ్రెస్ నేతలు ఇప్పుడు ఇచ్చే పెద్ద పెద్ద హామీలను నమ్ముతారా ? అని ప్రశ్నించారు.

ఈటలపై ఆరోపణలకు ఖండన

అంతకుముందు జరిగిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ మాట్లాడుతూ ఈటల రాజేందర్ వచ్చాకే సివిల్ సప్లయ్ ప్రక్షాళన జరిగిందన్నారు. కాంగ్రెస్‌నేతలకు మైకులు కనపడితే ఆగరని అన్నారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ చచ్చిన కళేబరమన్నారు. ఈటల వ్యక్తిత్వమేమిటో తెలంగాణ ప్రజలందరికీ తెలుసునన్నారు. ఉన్న ఆస్తులన్నీ అమ్మి తెలంగాణ ఉద్యమంలో వచ్చి పోరాడారని అన్నారు. ఆయనను తెలంగాణ పూలేగా గౌరవిస్తారని అన్నారు. కేసీఆర్ హయాంలో ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పారు.

ఎండుతోంది



మరమ్మతు చేశారు. అశ్వరావుపల్లి రిజర్వాయర్ నుంచి నీటిని వదిలితే ఈ చెరువు నిండటంతో పాటు భూగర్భ జలాలు పెరిగి, బోర్ల నీరు పోసే అవకాశం ఉంది. కానీ, నీరివ్వకపోవడంతో ఆ చెరువు కింద వేసిన వరిపైరు పొట్టదశలో ఉండగా ఎండుతుండటంతో రైతులు కంట నీరు పెడుతున్నారు.

అడుగంటుతున్న భూగర్భ జలాలు

భూగర్భ జలాలు రోజు రోజుకు అడుగంటుతున్నాయి. దాంతో బోర్లు, బావులు ఎండిపోతున్నాయి. 2017 డిసెంబర్‌లో జనగామ జిల్లాలో జనవరిలో 10.70 మీటర్లకు నీటిమట్టం పడిపోగా ఫిబ్రవరిలో 11.56 మీటర్లకు పడిపోయింది. మార్చిలో 14 మీటర్లకు పడిపోయే అవకాశాలు ఉన్నాయి. ఒక్క జనగామ జిల్లాలోనే కాదు వరంగల్ అర్బన్, రూరల్, భూపాలపల్లి జిల్లాలోనూ ఇదే దుస్థితి. భూగర్భ జలాలు పడిపోవడం వలన తాగునీటి సమస్యతో పాటు వరి పంట చేతికి వచ్చే అవకాశాలు కనిపించడం లేదు.

24 గంటల విద్యుత్‌తో బోరుమంటున్న రబీ రైతు

ప్రభుత్వం వ్యవసాయానికి 24గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నది. దాంతో రైతులు భూగర్భ జలాలు పూర్తిగా తోడేస్తున్నారు. నాలుగు వందల నుంచి 600 ఫీట్ల లోతు బోర్లు వేసినా నీరు రావడం లేదు. 24 గంటల విద్యుత్ సరఫరా వద్దంటున్నారు. దాంతో పాటు రిజర్వాయర్ల కింద ఉన్న చెరువుల్ని గోదావరి నీటితో నింపాలని డిమాండ్ చేస్తున్నారు. కరువు ప్రాంతమైన జనగామకు నీటిని పంపింగ్ చేయకుండా మంత్రి హరీశ్‌రావు ధర్మసాగర్, గండిరామారం, బొమ్మకూర్, తపాస్‌పల్లి రిజర్వాయర్ల నుంచి సిద్దిపేట జిల్లాకు గోదావరి జలాలు తరలిస్తున్నారు.

రిజర్వాయర్ నుంచి నీరివ్వాలి : సింగిరెడ్డి తిరుమల్‌రెడ్డి, రైతు

నాలుగెకరాల్లో వరి పంట వేశా. మూడు బోర్లతో పాటు బావి కూడా ఉంది. అవి నీళ్లను సరిగా పోయక పంట ఎండిపోయే టట్టున్నది. అశ్వరావుపల్లి రిజర్వాయర్ నుంచి నాగులమ్మ కుంట నింపి మా పొలాలకు నీరివ్వాలి.



మమ్మల్ని ఆదుకునేవారెవరు : గోనే యాదవరెడ్డి, కౌలు రైతు



నాలుగెకరాలను కౌలుకు తీసుకుని వరి నాటేసిన. ఇప్పటిదాక 70 వేల రూపాయల పెట్టుబడి పెట్టిన. మూడు బోర్లు ఉన్నా సరిగా నీళ్లు పోయట్లేదు. ఒక్కో మడి ఎండిపోతున్నది. ఇక్కడి రైతులకు ఇవ్వాల్సిన రిజర్వాయర్ నుంచి నీటిని మంత్రి హరీశ్‌రావు తన సొంత జిల్లాకు తీసుకెళ్తున్నాడు. ఎమ్మెల్యేకు చెప్పినా పట్టించుకుంటలేడు. మా పంటలకు రిజర్వాయర్ నుంచి నీరిచ్చి మమ్మల్ని ఆదుకోవాలి.

బీజేపీ హింస, ఉన్మాదాన్ని.. ఉపేక్షించం

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

'ప్రగతిశీల, అభ్యుదయవాదాలకు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్), భారతీయ జనతా పార్టీ(బీజేపీ) వ్యతిరేకం. అందుకే త్రిపురలో లెనిన్ విగ్రహాలతో పాటు తమిళనాడులో పెరియార్ రామస్వామి, యూపీలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలను ధ్వంసం చేశారు' అని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్‌కరత్ విమర్శించారు. త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపొందిన అనంతరం పెద్దఎత్తున హింసాత్మక దాడులకు తెగబడిందని వివరించారు. సీపీఐ(ఎం) ఇతర వామపక్ష పార్టీల కార్యాలయాలను కబ్జా చేశారని, నాయకులపై, కార్యకర్తలపై దాడులు చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. 'ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో వామపక్ష కూటమికి మద్దతుగా నిలిచిన 45 శాతం రాష్ట్ర ప్రజానీకాన్ని భయభ్రాంతులకు గురిచేసేందుకు ఇలాంటి దాడులకు తెగబడ్డారు' అని వివరించారు. సంఘ్, బీజేపీ హింసను ప్రజాపోరాటాలతో తిప్పికొడతామని కరత్ స్పష్టం చేశారు. గతంలోనూ త్రిపురలో ఓసారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన సమయంలో ఇలాంటి దాడులకు పాల్పడితే 25 ఏండ్లపాటు ఆ రాష్ట్ర ప్రజలు వామపక్ష కూటమిని గెలిపించారని వివరించారు. త్రిపురలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ పాల్పడుతున్న హింసను వెంటనే నిలువరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కరత్ డిమాండ్ చేశారు.

త్రిపురలో సీపీఐ(ఎం) ఇతర వామపక్ష పార్టీలపై దాడులకు వ్యతిరేకంగా శుక్రవారం ఢిల్లీలో ఏడు వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో పార్లమెంట్ మార్గ్‌లో నిరసన కార్యక్రమం జరిగింది.

అంతకముందు మండిహౌస్ నుంచి పార్లమెంట్ స్ట్రీట్ వరకు పెద్దఎత్తున ర్యాలీ చేపట్టారు. 'భారతీయ తాలీబాన్ సంఘ్, బీజేపీ నశించాలి' 'త్రిపురలో హింసను ఆపండి' అంటూ పెద్దఎత్తున నినదించారు. ర్యాలీని పార్లమెంట్ స్ట్రీట్‌వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడే ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ ఆందోళన కార్యక్రమంలో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్‌తో పాటు సీపీఐ ఎంపీ డీ రాజా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌కరత్ మాట్లాడుతూ... 'మార్చి 3వ తేదీన త్రిపుర రాష్ట్ర అసెంబ్లీ ఓట్ల లెక్కింపు జరిగింది. ఈ ఎన్నికల్లో వామపక్ష కూటమి ప్రభుత్వం ఓడిపోయింది. సాధారణంగా ఏ ఎన్నికలైనా ఒక రాజకీయ పార్టీ ఓడిపోతుంది. మరోటి గెలుస్తుంది. కానీ మార్చి 3వ తేదీ రాత్రి నుంచి త్రిపురలో బీజేపీ, సంఘ్ శక్తులు సీపీఐ(ఎం) ఇతర వామపక్ష పార్టీల కార్యాలయాలపై పెద్దఎత్తున దాడులకు పాల్పడ్డాయి. మార్చి 3వ తేదీ నుంచి ఎనిమిదో తేదీ ఉదయం వరకు సుమారు 600 పార్టీ కార్యాలయాలను కబ్జా చేశారు. కొన్ని కార్యాలయాలను ధ్వంసం చేశారు.

మరికొన్నింటికి నిప్పంటిం చారు. దీనికితోడు వామపక్ష పార్టీల నేతల, కార్యకర్తల ఇండ్లల్లోకి గూండాలు చొరబడి దాడులకు పాల్పడ్డారు. సుమారు 700 మందికి పైగా గాయాలపాలయ్యారు. 125 మంది ఇంకా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. గాయపడ్డవారిలో మహిళలూ ఉన్నారు. ఇదంతా బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు చేశారు' అని వివరించారు.

త్రిపురలో జరిగిన ఈ దాడి ఆ రాష్ట్ర ప్రజానీకంపై జరిగిన దాడిగా కరత్ అభివర్ణించారు. 'ఈ హింసాత్మకదాడులు అప్పటికప్పుడు ఆవేశంలో జరిగినవి కావు. పక్కా ముందస్తు ప్రణాళికతో దాడులకు పాల్పడ్డారు. ఈ ఎన్నికల్లో వామపక్ష కూటమికి మద్దతుగా నిలిచిన 45 శాతం ప్రజానీకాన్ని భయపెట్టే ఉద్దేశ్యంతో దాడులకు పూనుకున్నారు' అని విమర్శించారు. బీజేపీ ముఖ్యమంత్రి అభ్యర్థి మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కారును కలిసేందుకు అగర్తలలోని పార్టీ కార్యాలయంలోకి వచ్చారని కరత్ వివరించారు. అయితే రాష్ట్రంలో బీజేపీ, సంఘ్ కార్యకర్తలు పాల్పడుతున్న దాడులను వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేసినట్టు చెప్పారు. 'రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న హింసను నిలువరిస్తామని, దాడులకు పాల్పడ్డవారిపై దర్యాప్తు చేస్తామని బీజేపీ నేతలు ప్రకటించారు. కానీ ఏమీ జరగడం లేదు' అని కరత్ విమర్శించారు.

దాడులకు తోడు రాష్ట్రంలోని రెండు ప్రాంతాల్లో లెనిన్ విగ్రహాలను కూల్చారని కరత్ వివరించారు. 'దేశంలో ప్రగతిశీల, అభ్యుదయవాదాలు ఉండొద్దని బీజేపీ, ఆర్ఎస్ఎస్ కోరుకుంటోంది.

అందుకే లెనిన్ విగ్రహాలను కూల్చారు. తమిళనాడులో బీజేపీ నేత ప్రకటన చేసిన కొద్ది నిమిషాల్లోనే పెరియార్ రామస్వామి విగ్రహంపై దాడి జరిగింది. యూపీలో అంబేద్కర్ విగ్రహాన్ని కూల్చే ప్రయత్నం చేశారు' అని వివరించారు. బీజేపీ, సంఘ్ దాడులను ప్రజా పోరాటాల ద్వారా తిప్పికొడతామని కరత్ చెప్పారు. అయితే త్రిపుర చరిత్ర ఎంటో నరేంద్రమోడీ, అమిత్‌షా తెలుసుకోవాలని కరత్ హితవు పలికారు. '1988లోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఆ సమయంలోనూ రాష్ట్రంలో హింస, భయోత్పాతం సృష్టించారు. దీంతో 1993 ఎన్నికల్లో ఆ పార్టీని ఘోరంగా ఓడించారు. ఇప్పటి వరకు మళ్లీ అధికారం ఇవ్వలేదు. 25 ఏండ్లపాటు వామపక్ష కూటమిని ఎన్నుకున్నారు. త్రిపురలో ఇలాంటి హింసాత్మక, ప్రజావ్యతిరేక, ఉగ్రవాద ప్రభుత్వం నడిపిస్తే త్రిపుర ప్రజలు ఉపేక్షించబోరు' అని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పాలని ఈ సందర్భంగా కేంద్రాన్ని కరత్ డిమాండ్ చేశారు.

దేశంలో ఉన్నది పార్లమెంట్ ప్రజాస్వామ్యమని, ఈ విషయాన్ని బీజేపీ, ఆర్ఎస్ఎస్ గుర్తుంచుకోవాలని సీపీఐ ఎంపీ డీ రాజా సూచించారు.

బీజేపీ నేతలు రాజ్యాంగాన్ని గౌరవించడం నేర్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కరత్, రాజాతో పాటు అమ్రేష్‌కుమార్(ఆలిండియా ఫార్వర్డ్‌బ్లాక్), ఆర్ఎస్ దాగర్(ఆరెస్పీ), కవితా కృష్ణన్(సీపీఐ-ఎంఎల్ లిబరేషన్), ప్రణ్‌శర్మ (ఎస్‌యూసీఐ-సీ), ప్రకాశ్‌రావు(సీజీపీఐ) ప్రసంగించారు.

నాపై జైల్లో హత్యకు కుట్ర

దళితుడు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారా? అన్న కోణంలోనే..

- కుట్రలో ఇద్దరు మంత్రులు.. ఒక ఎమ్మెల్యే
- అందుకే రెండో సారి జైలుకు పంపారు
- ప్రత్యేక పీపీని నియమించి బెయిల్ రాకుండా చేశారు
- త్వరలోనే ఆధారాలు బయట పెడతా : మందకృష్ణ మాదిగ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

"నా ప్రాణాలు హరించడానికి కుట్ర జరుగుతున్నది. దళితుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న విధానపరమైన నిర్ణయాలను ప్రశ్నిస్తే ఒక దళితుడు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాడా? అన్న అక్కసుతో జైల్లో తనను హత మార్చేందుకు కుట్ర పన్నారు. తనను హత్య చేసేందుకు ఇద్దరు మంత్రులు, ఒక ఎమ్మెల్యే వ్యూహాన్ని రచించారు. అందుకే దీక్ష చేస్తున్న తనను జైలుకు పంపించారు. జైల్లో హతమార్చేందుకే ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను నియమించి తనకు బెయిల్ రాకుండా చేశారు. ఈ విషయాన్ని గమనించిన జైల్లో తనతో పాటు ఉన్న ఒక వ్యక్తికి బెయిల్ వచ్చినా స్యూరిటీలు సమర్పించకుండా తనతో పాటే జైల్లో ఉన్నాడు. ఇది గమనించిన ప్రభుత్వం ఇది సరైన సమయం కాదనీ, ప్రస్తుత పరిస్థితులు కూడా అనుకూలంగా లేవంటూ హత్యాయత్నాన్ని విరిమించుకుంది" అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ చెప్పారు. శుక్రవారం ఆయన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ తనను హత్య చేయడానికి ఎప్పటి నుంచో కుట్ర జరుగుతున్నదని తెలిపారు. గత ఏడాది జూలై 8న సూర్యాపేట నుంచి వరంగల్ వెళ్తుతున్న సమయంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు తనను వెంబడించారని, ఈ విషయంపై సూర్యాపేట, తిరుమలగిరి, కాగజ్‌నగర్ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశానని తెలిపారు. ఈ విషయంలో సూర్యాపేట పోలీసులు కేసు నమోదు చేయలేదనీ, తనను వెంబడించిన వారిని ఇప్పటికీ అరెస్టు చేయలేదన్నారు.

బయట హత్య చేస్తే అనుమానాలు వస్తాయని..

తనను బయట హత్య చేస్తే అనుమానాలు వస్తాయన్న ఆలోచనతోనే తనను జైలుకు పంపుతున్నారని మందకృష్ణ తెలిపారు. జైల్లో హత్య చేస్తే ఎలాంటి ఆధారాలు ఉండవని ప్రభుత్వం మీద కూడా మచ్చ పడదన్న ఉద్దేశంతోనే జైల్లో హత్యకు వ్యూహాన్ని రచించారని చెప్పారు. సమస్యల సాధన కోసం ఎన్టీఆర్, వైఎస్ రాజశేఖరరెడ్డి, చంద్రబాబు లాంటి వారు దీక్షలు చేశారని, దీక్షలు చేస్తే జైలుకు పంపించిన దాఖలాలు లేవన్నారు.

దళితులకు ఉద్యమాలు చేసే స్వేచ్ఛ లేదా?

తెలంగాణ రాష్ట్రంలో దళితులు ఉద్యమాలు చేసే స్వేచ్ఛ లేదా? అని మందకృష్ణ ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ తీసుకుంటున్న విధానపరమైన నిర్ణయాలను మాత్రమే వ్యతిరేకిస్తున్నాను. ఆయనపైన కానీ, ఆయన కుటుంబ సభ్యులపైనా కానీ తాను ఏనాడు వ్యక్తిగత విమర్శలు చేయలేదు. ఎంతోమంది ఎన్నో రకాలుగా సీఎం కేసీఆర్‌పైనా, ఆయన కుటుంబ సభ్యులపైనా ఎన్నో ఆరోపణలు, వ్యక్తిగత దూషణలు చేస్తున్నా పట్టించుకోరు. కేవలం తాను దళితుడు అయినందున, ఒక దళితుడు ప్రభుత్వంపై విమర్శలు చేస్తారా? అన్న అక్కసుతోనే తనను హత్య చేసేందుకు కుట్ర పన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తనను హతమార్చేందుకే రెండో సారి తనను జైలుకు పంపి బెయిలు రాకుండా చేశారని చెప్పారు.

త్వరలోనే ఆధారాలతో నిరూపిస్తా

తనపై జరిగిన హత్యకు కుట్రపై త్వరలోనే ఆధారాలతో నిరూపిస్తానని మందకృష్ణ చెప్పారు. ఇప్పటికే కొన్ని ఆధారాలు సేకరించామని, ఇంకా కొన్ని ఆధారాలు సేకరిస్తున్నామని చెప్పారు.

బీజేపీ ప్రభుత్వానికి వంద రోజులు కాలేదేమో

- ఎమ్మార్పీఎస్ బంద్ పోస్టర్ ఆవిష్కరణలో మంద కృష్ణ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తాము అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేపడతామన్న బీజేపీ, అధికారంలోకి వచ్చి ఇంకా వంద రోజులు కాలేదేమో అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ విమర్శించారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు జాప్యంగా ఈ నెల 13న నిర్వహించ తలపెట్టిన ఎమార్పీఎస్ బంద్ పోస్టర్‌ను శుక్రవారం ఎమార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ విషయంలో ప్రధానపార్టీలన్నీ మొసలి కన్నీరు కారుస్తున్నాయని విమర్శించారు. ఏపీకి ప్రత్యేక హోదా, తెలంగాణలో రిజర్వేషన్ల విషయంపై ఉభయ సభల్లో ఆందోళనలు చేపడుతున్న ఎంపీలు ఎస్సీ వర్గీకరణ విషయంపై కేంద్రాన్ని ఎందుకు నిలదీయడం లేదని ప్రశ్నించారు. నాలుగేండ్ల విభజన సమస్యపై ఉభయ సభల్లో ఆందోళన చేస్తున్నా ఆయా పార్టీలు 25 ఏండ్ల వర్గీకరణ సమస్య గురించి ఎందుకు పట్టించుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు.

దేశాభివృద్ధికి అవసరమైన ఎజెండా కావాలి : సీఎం కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అనేక రాష్ట్రాలు, విభిన్న వర్గాలను కలిగున్న మనదేశాభివృద్ధికి అవసరమైన ఎజెండాను రూపొందించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. ఈ అంశంపై ఆయన శుక్రవారం క్యాంపు కార్యాలయంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, సీనియర్ అధికారులతో మాట్లాడారు. ఇప్పుడున్న విధానాలు, పద్ధతులు, చట్టాలను సంపూర్ణంగా అధ్యయనం చేయాలని ఈ సందర్భంగా సీఎం వ్యాఖ్యానించారు.

ఇందుకనుగుణంగా వివిధ రంగాలకు చెందిన నిపుణులు, సీనియర్ అధికారులు దిశా, నిర్దేశం చేయాలని కోరారు. అన్ని వర్గాలు, ప్రాంతాలకు చెందిన వారు ఈ అంశంలో పాలు పంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. తమ ప్రభుత్వం అమల్జేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని చెప్పారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో వేర్వేరు సామాజిక పరిస్థితులున్నాయని తెలిపారు. వాటికి అనుగుణంగా రిజర్వేషన్లను కల్పించాలని చెప్పారు. ఈ విషయంలో రాష్ట్రాలకు స్వేచ్ఛ, అధికారం ఉండాలని అన్నారు.

సెన్సెక్స్ ▼ 44	నిఫ్టీ ▼ 15	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10.గ్రా)	వెండి (కేజీ)	కోడిగుడ్లు
33,307	10,226	65.16	రూ. 31,037	రూ. 40,500	హైదరాబాద్ 345, ఒక్కగుడ్డుకు 4.05, వరంగల్ 347, విజయవాడ 340, చెన్నై 385, ముంబయి 390

మరింత సొమ్ముకు ఆర్‌బీఐపై సర్కారు ఒత్తిడి!



న్యూఢిల్లీ: ద్రవ్యలోటుతో కొట్టుమిట్టాడుతున్న కేంద్ర ప్రభుత్వం అందుబాటులో ఉన్న అన్ని వనరుల నుంచి నిధులను సమీకరిస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే పెట్టుబడుల ఉపసం హరణ ప్రక్రియను వేగవంతం చేసిన సర్కారు.. తాజాగా బ్యాంకుల పెద్దన్న 'భారతీయ రిజర్వు బ్యాంక్'ను (ఆర్‌బీఐ) కూడా అదనపు నిధులివ్వాలని కోరింది. జూన్ నాటికి చెల్లించిన డివిడెండ్ మొత్తం రూ.30,659 కోట్లకు అదనంగా.. ఆర్‌బీఐ మరో రూ.13,000 కోట్ల డివిడెండ్ చెల్లించాలని సర్కారు పెద్ద బ్యాంకును కోరింది. ఈ విషయాన్ని ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి సుభాష్ సి గార్గ్ ధ్రువీకరించారు. లోక్‌సభలో ఇదే విషయమై ఆర్థిక శాఖ సహాయ మంత్రి పోన్ రాధాకృష్ణన్ వివరణనిస్తూ జూన్‌తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి ఆర్‌బీఐ కేవలం రూ.30,659 కోట్ల మేర డివిడెండ్‌ను మాత్రమే చెల్లించినట్టుగా వివరించారు. అంతకు ముందు సంవత్సరం (2015-16) డివిడెండ్ చెల్లింపు దాదాపు రూ.65,876 కోట్లుగా ఉన్నట్టు మంత్రి తెలిపారు. గత ఏడాది వచ్చిన దానితో పోలిస్తే.. 2016-17లో ఆర్‌బీఐ డివిడెండ్ సగం కంటే తక్కువేననిఅన్నారు. మాలేగావ్ కమిటీ సిఫారసులకు అనుగుణంగా ఆర్‌బీఐ ఆర్జించిన లాభం మొత్తాన్ని ప్రభుత్వానికి బదిలీ చేయాలని తాము కోరామని, ఇందులో అతిశయోక్తి లేదని ఆయన అన్నారు.

జోరుగా ఆధార్ అనుసంధానం: సర్కారు



న్యూఢిల్లీ: దేశంలో బ్యాంకు ఖాతాలను, పాన్ కార్డులను ఆధార్ సంఖ్యతో అనుసంధానం చేసే ప్రక్రియ జోరుగా సాగుతోందని సర్కారు శుక్రవారం పార్లమెంట్‌కు తెలిపింది. ఈ నెల 5వ తేదీ నాటికి దాదాపు 87.79 కోట్ల కరెంట్, సేవింగ్స్ బ్యాంకు ఖాతాలను ప్రజలు ఆధార్‌తో అనుసంధానం చేసుకున్నట్టుగా ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివ్‌ప్రతాప్ శుక్లా తెలిపారు. మరోవైపు దేశ వ్యాప్తంగా ఈ నెల 2వ తేదీ నాటికి 16,65,82,421 పాన్ కార్డులను ప్రజలు ఆధార్‌తో అనుసంధానం చేసుకున్నారని శుక్లా వెల్లడించారు. ఆధార్ అనుసంధానత కోసం దేశ వ్యాప్తంగా మొత్తం 6,811 ఆధార్ నమోదు కేంద్రాలను బ్యాంకుల్లో ఏర్పాటు చేసినట్టుగా ఆయన వివరించారు.

యూఎస్ఎఫ్‌డీఏ అభ్యంతరాలు: రెడ్డీస్

Dr.Reddy's

ముంబయి: తమ 'యాక్టివ్ ఫార్మాస్యూటికల్స్ ఇంగ్రిడియెంట్స్' (ఏపీఐ) ప్లాంటులోని అయిదు అంశాల పట్ల అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ (యూఎస్ఎఫ్‌డీఏ) సంస్థ అభ్యంతరాలను వ్యక్తం చేసిందని ఆ కంపెనీ బీఎస్ఈ ఫైలింగ్‌లో పేర్కొంది. హైదరాబాద్ నగర శివర్లాలోని బొలారంలోని కంపెనీకి ఉన్న ప్లాంట్-3లో ఇటీవల పర్యటించిన యూఎస్ఎఫ్‌డీఏ బృందం.. తమ అభ్యంతరాలతో కూడిన ఫారమ్-483ను జారీ చేసినట్టుగా డాక్టర్ రెడ్డీస్ పేర్కొంది. ప్లాంటులో పాటిస్తున్న విధానాలు, నిర్వహణకు సంబంధించే ఈ అయిదు అభ్యంతరాలున్నట్టుగా సంస్థ తెలిపింది. నిర్దిష్ట కాలంలో యూఎస్ఎఫ్‌డీఏ లేవనెత్తిన అభ్యంతరాలను దూరం చేసేలా ప్లాంటులో చర్యలు తీసుకోనున్నట్టుగా డాక్టర్ రెడ్డీస్ వెల్లడించింది.

రూ.8,40,958 కోట్లు..

- బ్యాంకుల స్థూల ఎన్‌పీఏల మొత్తమిది..
- పారిశ్రామిక రంగంలోనే అత్యధికంగా..
- తరువాత సేవారంగం, వ్యవ'సాయం'లో..
- ఎస్‌బీఐ ఎన్‌పీఏలు రూ.2.01లక్షల కోట్లు

న్యూఢిల్లీ: దేశంలో బ్యాంకుల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) అంతకంతకు పెరుగుతున్నాయి. గత డిసెంబరు ముగింపు నాటికి బ్యాంకుల మొత్తం స్థూల నిరర్థక ఆస్తులు రూ.8,40,958 కోట్లకు చేరినట్టుగా సర్కారు శుక్రవారం వెల్లడించింది. ఎన్‌పీఏల్లో అత్యధిక వాటా పారిశ్రామిక రుణాలది కాగా.. ఆ తరువాత సేవా రంగం, వ్యవసాయ రంగాల్లో నిరర్థక ఆస్తులు అధిక మొత్తంలో నమోదు అయినట్టుగా సర్కారు వివరించింది. షెడ్యూల్డ్ బ్యాంకులు పరిశ్రమలకు ఇచ్చిన రుణాలలో నిరర్థక ఆస్తులుగా మారిన మొత్తం సొమ్ము రూ.6,09,222 కోట్లని ప్రభుత్వం లెక్క తెలిపింది. మరోవైపు సేవా రంగంలో ఎన్‌పీలుగా మారిన రుణాలు



రూ.1,10,520 కోట్లుగా సర్కారు తేల్చింది. ఇక వ్యవసాయం, అనుబంధ రంగంలో ఎన్‌పీఏలు రూ.69,900 కోట్లుగా నమోదు అయినట్టు ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివ్ ప్రతాప్ శుక్లా శుక్రవారం లోక్‌సభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. ఎన్‌పీఏలు అత్యధికంగా ఎస్‌బీఐలో రూ.2,01,560 కోట్లుగా నిలిచినట్టు ఆయన వివరించారు. ఆ తరువాత వరుసలో పీఎన్‌బీ (రూ.55,200 కోట్లు), ఐడీబీఐ (రూ.44,542 కోట్లు), బ్యాంక్ ఆఫ్ ఇండియా (రూ.43,474 కోట్లు), బ్యాంక్ ఆఫ్ బరోడా (రూ.41,649 కోట్లు) యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (రూ.38,047 కోట్లు), కెనరా బ్యాంక్ (రూ.37,794 కోట్లు), ఐసీఐసీఐ బ్యాంక్ (రూ.33,849 కోట్లు) ఉన్నట్టు మంత్రి వివరించారు.

అక్కడే గరిష్టంగా 2,800 కోట్ల మోసాలు..

వివిధ రకాల మోసాల కారణంగా గత ఆర్థిక సంవత్సరంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) అత్యధికంగా రూ.2,800 కోట్ల (431 మిలియన్ డాలర్ల) మేర సొమ్మును నష్టపోయిందని సర్కారు శుక్రవారం వెల్లడించింది. గత ఏడాది ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థలన్నింటిలోకి పంజాబ్ నేషనల్ బ్యాంక్ వివిధ మోసాల కారణంగా అత్యధిక మొత్తాన్ని నష్టపోయినట్టుగా సర్కారు తెలిపింది. పీఎన్‌బీలో వజ్రాల వ్యాపారులు నీరవ్ మోడీ, చౌక్సీల భారీ కుంభకోణం వెలుగులోకి రాక ముందు కూడా ప్రభుత్వ రంగ బ్యాంకులో మోసాలు చోటు చేసుకున్నట్టుగా సర్కారు వెల్లడించింది. గత మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో మొత్తం 2,718 కేసులతో ప్రభుత్వ రంగ బ్యాంకులు దాదాపు రూ.19,533 కోట్ల మేర సొమ్మును మోసాల రూపంలో నష్టపోయినట్టుగా ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. 2016-17లో పీఎన్‌బీలో అత్యధికం 158 కేసులు నమోదైనట్టు.. వీటి మూలంగా ఆ బ్యాంకు దాదాపు రూ.2,770 కోట్లు నష్టపోయినట్టుగా ప్రభుత్వ వెల్లడించింది. పీఎన్‌బీ తరువాత 'స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' (ఎస్‌బీఐ) మోసాల కారణంగా రూ.2,420 కోట్ల మేర నష్టపోయిందని ప్రభుత్వం వెల్లడించింది. అయితే ఎలాంటి మోసాలు అత్యధికంగా బ్యాంకుల్లో నమోదు అవుతున్నాయన్న అంశాన్ని ప్రభుత్వం వివరించలేదు. అయితే ఇలాంటి మోసాలను నిలవరించేందుకు బ్యాంకుల్లో మరింత పటిష్టమైన విధివిధానలను రూపొందించాల్సిన అవసరం ఉందని సర్కారు అభిప్రాయపడింది.



ఉద్దేశపూర్వక ఎగవేతలు 1.10 లక్షల కోట్లు..

బ్యాంకుల నుంచి రుణాలను తీసుకొని ఉద్దేశపూర్వక ఎగవేతలకు పాల్పడుతున్న వారి సంఖ్య పెరుగుతున్నట్టుగా సర్కారు విచారణలో తెలింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలల (ఏప్రిల్-డిసెంబరు) కాలంలో వీరి సంఖ్య 1.66 శాతం మేర పెరిగి 9,063కు చేరినట్టు ఆర్థిక మంత్రి శుక్లా తెలిపారు. వీరు బ్యాంకులకు ఎగవేసిన మొత్తం కూడా పెరిగి రూ.1,10,050 కోట్లకు చేరినట్టుగా శుక్లా వివరించారు. ఈ తరహా ఎగవేతదారులపై భారతీయ రిజర్వు బ్యాంకు నిబంధనల మేరకు క్రిమినల్ చర్యలు తీసుకోనున్నట్టుగా మంత్రి వెల్లడించారు. బ్యాంక్రప్టసీ స్మృతిలో చేపట్టిన సవరణల కారణంగా ఉద్దేశపూర్వక ఎగవేతదారుల మోసాలకు కళ్లెం పడినట్టుగా మంత్రి వివరించారు.

భారత్‌లో వారానికో విమాన డెలివరీ..



నవతెలంగాణ, వాణిజ్య విభాగం: భారత్‌లో విమానయానానికి అద్భుత భవిష్యత్తు ఉన్నట్టు ప్రముఖ విమాన తయారీ సంస్థ ఎయిర్‌బస్ అభిప్రాయపడింది. ఇండియాలో రానున్న 20 ఏండ్లలో దాదాపు 1750 కొత్త విమానాలు అవసరం కానున్నట్టు ఎయిర్‌బస్ వాణిజ్య విమానాల విభాగం భారత అధినేత శ్రీనివాసన్ ద్వారకానాథన్ తెలిపారు. హైదరాబాద్‌లో జరుగుతున్న 'వింగ్స్ ఇండియా-2018' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశంలో డిమాండ్‌కు అనుగుణంగా రానున్న దశాబ్ద కాలంలో ఇక్కడ వారానికి ఒక కొత్త విమానాన్ని డెలివరీ ఇవ్వాల్సిన అవసరం ఏర్పడనుందని ఆయన అన్నారు. కొత్త విమానాల మార్కెట్ విలువ దాదాపు 225 బిలియన్ డాలర్ల వరకు ఉండొచ్చని ఆయన అంచనా కట్టారు. భారత్‌లో రానున్న 20 ఏండ్ల కాలంలో విమాన ప్రయాణికుల సంఖ్యలో 8.1 శాతం వృద్ధి నమోదయ్యే అవకాశం ఉందని ఆయన అన్నారు. ఇది ప్రపంచ సగటు కంటే కూడా దాదాపు రెట్టింపు అని వివరించారు. 2019-20 నాటికి భారత్ మూడో అతిపెద్ద విమానయాన మార్కెట్‌గా అవతరించనుందని ఆయన అభిప్రాయపడ్డారు.

వాణిజ్య యుద్ధం షురూ!!

- ట్రంప్ మరో 'రక్షణాత్మక' నిర్ణయం
- లోహాల దిగుమతులపై భారీగా సుంకం
- అమెరికా ఆర్థిక భద్రతకేనని వ్యాఖ్య..
- భారత్, చైనాలకు పరోక్ష హెచ్చరికలు..

న్యూయార్క్: అనుకున్నంతా జరిగింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ వాణిజ్య యుద్ధానికి తాజాగా తెర తీశారు. అమెరికాలో స్టీల్, అల్యూమినియం దిగుమతులపై భారీ స్థాయిలో సుంకాలు వేసేందుకు వెసులుబాటు కలిగించే రెండు ప్రతిపాదనలపై ఆయన ఆమోద ముద్ర వేశారు. కొత్త ప్రతిపాదనల ప్రకారం స్టీల్ దిగుమతులపై 25 శాతం, అల్యూమినియం దిగుమతులపై 10 శాతం అదనపు సుంకం పడనుంది. సవరించిన రేట్లు 15 రోజుల్లో అమల్లోకి రానున్నాయి. కాగా.. ఈ దిగుమతి సుంకాల నుంచి కెనడా, మెక్సికో దేశాలకు మినహాయింపు కల్పించారు.

భారత్, చైనాలపైన అక్కసు..

దిగుమతి సుంకం ప్రతిపాదనలపై సంతకం చేసిన అనంతరం అమెరికా అధ్యక్షుడు ట్రంఫ్ మాట్లాడుతూ భారత్, చైనాలపై తన అక్కసు వెళ్లగక్కారు. అమెరికా ఆర్థిక భద్రత కోసమే తాము ఈ నిర్ణయం తీసుకున్నట్టుగా వెల్లడించారు. 'మా నౌకలను మేమే నిర్మించుకోవాలనుకుంటున్నాం.. మా ప్లాంట్లను, మా మిలిటరీ పరికరాలను మేం తయారు చేసుకుంటాం.. అది కూడా మా దేశంలో ఉత్పత్తయ్యే స్టీల్, అల్యూమినియంతో అంటూ ట్రంఫ్ ఆవేశంగా ప్రసంగించారు. తమ దేశంలోని కంపెనీలను, సిబ్బందిని తామే రక్షించుకుంటామని ఆయన అన్నారు. అమెరికాలోనే ఉత్పత్తి చేస్తే ఉత్పాదకాలపై ఎలాంటి పన్నులు విధించబోమని



ట్రంప్ చెప్పారు. కొన్ని దేశాలు తమ ఆర్థిక వ్యవస్థను కొల్లగొడుతూ గత కొన్ని దశాబ్దాలుగా తమ ఉద్యోగాలను దోచుకొని పోతున్నాయని వ్యాఖ్యానించారు. అందుకే అలాంటి దేశాలపై 'పరస్పర పన్ను'లు విధించనున్నట్టుగా ఆయన తెలిపారు. భారత్, చైనా దేశాలు అమెరికా సుంకాలతో సంబంధం లేకుండా అధిక పన్నులు విధిస్తే.. ఆ దేశాలపై 'పరస్పర సుంకం' విధానాన్ని అములులోకి తీసుకురానున్నట్టుగా హెచ్చరించారు. వారు ఎంత సుంకాలు విధిస్తే.. తాము కూడా అంత మొత్తంలో సుంకం విధించనున్నట్టు తెలిపారు.

ప్రధానోపాధ్యాయులు ఆత్మపరిశీలన చేసుకోవాలి

- మంచి ఫలితాలు రాబట్టాలి
- సామాజిక స్పృహ, ఉత్తమ వ్యక్తిత్వం ముఖ్యం
- వచ్చే విద్యా సంవత్సరం ఉపాధ్యాయ పోస్టులు భర్తీ
- విద్యార్థులకు ఐదు గుడ్లు ఇచ్చేందుకు కృషి
- ప్రభుత్వ పాఠశాలల్లో పవర్ బిల్లులు మాఫీ : ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి

నవతెలంగాణ - కల్చరల్ రిపోర్టర్



ప్రభుత్వ పాఠశాలల ప్రధానో పాధ్యాయులు సమర్థవంతంగా పనిచేస్తే.. ఎన్‌రోల్‌మెంట్ తగ్గడానికి, పదో తరగతిలో ఫలితాలు ఆశాజనకంగా లేకపోవడానికి కారణాలేమిటో ఆత్మ పరిశీలన చేసుకోవాలని ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి ఇటీవల నిర్వహించిన టీఆర్‌టీ పరీక్షల ద్వారా 8792 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యుత్ బిల్లుల మాఫీకి చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో శుక్రవారం తెలంగాణ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో "ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ-నాణ్యమైన విద్య-ప్రధానోపాధ్యాయుల పాత్రపై" సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ.. ప్రజల పన్నులతో ప్రభుత్వ ఉద్యోగులు, మంత్రుల జీతాలు వస్తున్నాయని, అందువల్ల ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహతో పనిచేయాల్సిన బాధ్యత ఉందని అన్నారు. సమర్థవంతంగా పనిచేసే ప్రధానోపాధ్యాయులను గుర్తించి సత్కరిస్తామన్నారు. ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా ఉండాలని, ఉత్తమ వ్యక్తిత్వం ఉంటే పిల్లలపై ఆ ప్రభావం పడుతుందని అన్నారు. ప్రతి పాఠశాలలో మంచినీటి సౌకర్యం కోసం ప్రధానోపాధ్యాయులు చొరవ తీసుకొని స్థానిక సర్పంచ్‌ని సంప్రదించి మిషన్ భగీరథ వర్తింపజేసుకోవాలని సూచించారు. మౌలిక సదుపాయాల కల్పనకు తగు చర్యలు తీసుకుంటున్నామని, రూ.23 లక్షలు మధ్యాహ్న భోజన పథకానికి ఖర్చు పెడుతున్నామని చెప్పారు. వారానికి పిల్లలకు మూడు గుడ్లు కాక ఐదు గుడ్లు ఇచ్చే విషయం పరిశీలిస్తామని, అయితే కొన్నిచోట్ల గుడ్లు దొడ్డిదారి పడుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయని, అలా జరగకుండా చూడాలని చెప్పారు. ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వ్యవసాయం, విద్యా, వైద్యం, మానవ సంబంధాలపై ప్రభుత్వం దృష్టిపెట్టిందని చెప్పారు. గతంలో ఉపాధ్యాయుల వల్ల గ్రామాల్లో మానవీయ విలువలు పెంపొందేవని, ఇప్పుడా పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉద్యోగం చేస్తున్న గ్రామాల్లోనే ఉంటే పలు సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం వచ్చేలా కృషి చేస్తామన్నారు. సన్నబియ్యం, ఇతర సంక్షేమ పథకాలు ప్రభుత్వ పాఠశాలలో పూర్తిస్థాయిలో అమలు పరుస్తున్నామని తెలిపారు. నిర్వహణ సరిగా లేని పాఠశాలలను మూసేస్తామన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజభాను నివేదిక సమర్పిస్తూ.. ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ ఆపరేటర్లను నియమించాలని కోరారు. విద్యుత్ బిల్లులు మాఫీ చేయాలని, రెసిడెన్షియల్ పాఠశాలల్లోని విద్యార్థులకు అందించిన మాదిరిగానే మెరుగైన అల్పాహారం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించాలన్నారు. 9, 10 విద్యార్థులకు యూనిఫాం అందించాలని, ప్రతి పాఠశాలలో పీఈటీని నియమించాలని, ఉచిత రక్షిత నీటి సదుపాయం కల్పించాలని కోరారు. సదస్సుకు రాష్ట్ర అధ్యక్షులు ఎస్.లక్ష్మారెడ్డి అధ్యక్షత వహించారు. శాసన మండలి సభ్యులు పాతూరి సుధాకర్‌రెడ్డి, పూల రవీందర్, కె.జనార్థన్‌రెడ్డి పాల్గొన్నారు.

'కమ్యూనిజం-అంబేద్కరిజం'

భావజాలంపైనే బీజేపీ దాడి

రాష్ట్రాలకు అధికారాల పోరాటం న్యాయమే

- రిజర్వేషన్లు కోరే కేసీఆర్ 119 సీట్లల్లో సగం బీసీలకివ్వాలి
- లౌకిక విధానానికి కట్టుబడితేనే జనం నమ్ముతారు
- ప్రాంతీయ పార్టీలు ఫ్రంట్ కడితే ఆలోచిస్తాం..
- ప్రత్యామ్నాయ రాజకీయ విధానాలతో బీఎల్ఎఫ్ పోటీ : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

"కమ్యూనిజం-అంబేద్కరిజం' భావజాలంపై బీజేపీ దాడులు చేస్తోంది. అలాంటి బీజేపీని కేసీఆర్, చంద్రబాబు గుడ్డిగా నమ్మి నాలుగేండ్లు బలపర్చాయి. కాంగ్రెస్, బీజేపీలకు వ్యతిరేకంగా పనిచేస్తానని కేసీఆర్ చెప్పడం మంచిమాటే. అయితే, ప్రజాపోరాటాలను నిరంకుశంగా అణచివేసిన విషయాన్ని ప్రజలు మరిచిపోలేదు. అందువల్ల రాజకీయ అవకాశవాదం కోసం కాకుండా లౌకిక విధానానికి కట్టుబడి సిద్ధాంతపరంగా బీజేపీని వ్యతిరేకించినప్పుడే ప్రజలు నమ్ముతారన్నారు. ప్రాంతీయ పార్టీలు అఖిల భారత స్థాయిలో ఫ్రంట్ కడితే అప్పుడు మద్దతు విషయమై ఆలోచిస్తాం" అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు.



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

నవతెలంగాణ - నల్లగొండ ప్రతినిధి

నల్లగొండ జిల్లా కేంద్రంలోని దొడ్డికొమరయ్య భవన్‌లో శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించాలనుకోవడం తప్పేమీకాదన్నారు. కాంగ్రెస్ విధానాల్నే బీజేపీ అనుసరిస్తోందని, అదనంగా మతోన్మాద పోకడల్ని అనుసరిస్తూ విధ్వంసాలు సృష్టిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. త్రిపురలో అధికారంలోకి రాగానే సీపీఐ(ఎం) కార్యాలయాల్ని స్వాధీనం చేసుకోవడం, నాయకులు, కార్యకర్తలపై దాడులు చేయడం ఇందుకు నిదర్శనమన్నారు. దేశవ్యాప్తంగా మహనీయుల విగ్రహాలను కూల్చేయడం అప్రజాస్వామికమన్నారు. ఇవి భావజాలంపై జరుగుతున్న దాడులన్నారు. ఇలాంటి బీజేపీని చంద్రబాబు, కేసీఆర్ గుడ్డిగా నాలుగేండ్లు బలపర్చారన్నారు. మతోన్మాదాన్ని ప్రశ్నించిన వ్యక్తుల్ని హత్య చేసినప్పుడు వీరిద్దరూ స్పందించలేదని విమర్శించారు. జీఎస్టీ, నోట్ల రద్దును కూడా కేసీఆర్, బాబు బలపర్చారని గుర్తుచేశారు.

నాలుగేండ్లు రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగించిన కేసీఆర్.. ఇప్పుడు ఫ్రంట్ కట్టి ఆహ్వానించినా సీపీఐ(ఎం) కలవదని చెప్పారు. గిరిజనులు, ఆశాలు, అంగన్‌వాడీలు, నిర్వాసితుల పోరాటాల్ని అణచివేసిన సంగతిని ప్రజలు మరచిపోలేదన్నారు. అయితే రాష్ట్రాలకు అధికారాలివ్వాలనేది న్యాయమైన పోరాటమేనన్నారు. రిజర్వేషన్లు, నిధుల విషయంలో స్వయం నిర్ణయాధికారం కావాలని సీపీఐ(ఎం) ఎప్పటి నుంచో చెబుతోందన్నారు. రాష్ట్రాలకు అధికారాలు ఉండాలని కేసీఆర్, చంద్రబాబు కోరుతూనే బీజేపీ అమలు చేస్తున్న విధానాల్నే ఇక్కడ అమలు చేస్తున్నారన్నారు. ప్రజాధనాన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలకు వెచ్చిస్తున్న కేసీఆర్ లౌకిక వాదానికి ఎక్కడ కట్టుబడి ఉన్నట్టని ప్రశ్నించారు. ఇది పొరపాటని కేసీఆర్ అంగీకరించారా అనేది చెప్పాలన్నారు. మైనార్టీలు, గిరిజనులకు రిజర్వేషన్లు ఇవ్వాలని కోరడం న్యాయమైందన్నారు. రాజ్యాంగ సవరణ చేసైనా రిజర్వేషన్లు రాష్ట్రాల వారీగా అమలు చేయాలని సీపీఐ(ఎం) చెబుతోందన్నారు. అందుకు పార్లమెంట్‌లో బీజేపీకి వ్యతిరేకంగా బిల్లు పెట్టినా సీపీఐ(ఎం) మద్దతిస్తుందని చెప్పారు. రిజర్వేషన్లు కోరుతున్న కేసీఆర్ రాష్ట్రంలో 119 ఎమ్మెల్యే సీట్లల్లో బీసీలకు సగం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కనీసం మహిళలకు మంత్రివర్గంలో చోటెందుకు లేదన్నారు. ఇకనైనా సామాజిక న్యాయాన్ని సాధించడానికి కేసీఆర్ సిద్ధంగా ఉన్నారో లేదో ప్రజలకు స్పష్టంగా చెప్పాలన్నారు.

తెలంగాణలో 93 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఎంబీసీ, మైనార్టీలకు సామాజిక న్యాయం సాధించేందుకు కేసీఆర్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారా..? బహుజన లెఫ్ట్ ఫ్రంట్ అందుకు సిద్ధంగా ఉందని సవాల్ విసిరారు. టీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు బీసీలకు సగం సీట్లు ఇస్తామని చెప్పగలరా అని నిలదీశారు.

బీఎల్ఎఫ్ సగం సీట్లను బీసీలకిస్తుందని చెప్పారు. కాంగ్రెస్, టీఆర్ఎస్, బీజేపీలకు భిన్నంగా బీఎల్ఎఫ్ ప్రత్యామ్నాయ రాజకీయ విధానాలతో ప్రజల ముందుకొస్తుందన్నారు. వైద్యం, విద్య, ఉద్యోగాలు, మద్యం, వ్యవసాయం వంటి కీలకాంశాల్లో బీఎల్ఎఫ్ అనురించే విధానాలు గత పాలకులకు భిన్నంగా ఉంటాయన్నారు. నల్లగొండ ఉమ్మడి జిల్లాలో 12 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ సీట్లల్లో సగం బీసీలకే ఇస్తామన్నారు. బీఎల్ఎఫ్ రాజకీయ విధానాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సదస్సులు, సమావేశాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

సమావేశంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, తదితరులుపాల్గొన్నారు.

పెండ్లి కొడుకు ఇష్టం లేక..

ఆత్మహత్య చేసుకున్న అక్కాచెల్లి

నవతెలంగాణ-నేరడిగొండ

పెండ్లి చూపుల్లో చూసిన యువకుడు ఇష్టంలేక యువతి చెల్లెలకు చెప్పుకుని మదనపడింది. వారిద్దరూ విషయాన్ని ఇంట్లో చెప్పే ధైర్యం చేయలేకపోయారు. లోలోన కుమిలిపోయారు. ఇద్దరూ పురుగుల మందు తాగి చనిపోయారు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ బొందిడి గ్రామంలో శుక్రవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం... నేరడిగొండ మండలం బొందిడి గ్రామానికి చెందిన ఆడె కమల్‌సింగ్, ఆడె భీంసింగ్ అన్నదమ్ముళ్లు. వారికి అంజలి(19), అర్చన(18) కూతుర్లున్నారు. వారిద్దరూ చిన్నప్పట్నుంచి నుంచి కలిసి చదువుకున్నారు. స్నేహితుల మాదిరిగా ఉండేవారు. ప్రస్తుతం ఇంటర్ పూర్తి చేసి ఇంటి వద్దనే ఉంటున్నారు. ఇటీవల అంజలికి పెండ్లి చేయడానికి నిశ్చయించారు. వారం రోజుల కింద పెండ్లి చూపులు ఏర్పాటు చేశారు. పెండ్లి చూపులకు వచ్చిన యువకుడు అంజలికి నచ్చలేదు. కానీ, కుటుంబ సభ్యులకు చెప్పలేకపోయింది. అబ్బాయి నచ్చలేదన్న విషయం అర్చనతో చెప్పి బాధపడింది. పెద్దలను కాదనలేక..అబ్బాయి నచ్చలేదన్న విషయాన్ని చెప్పలేక మదనపడ్డారు. నాలుగు రోజుల కింద ఇంట్లో నుంచి వెళ్లిపోయారు. వారి కుటుంబ సభ్యులు బంధువుల ఇండ్లల్లో వాకబు చేసినా...ఊర్లో వెతికినా సమాచారం దొరకలేదు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే, గురువారం సిరికొండ మండల కేంద్రం శివారులో ఇద్దరు యువతులు పురుగుల మందుతాగి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్టు బహిర్భూమికి వెళ్లిన వారు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా..వారు వచ్చి పురుగుల మందు తాగిన వారు అంజలి, అర్చనగా గుర్తించారు. అపస్మారక స్థితిలో ఉన్న వారిద్దరినీ ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఇద్దరూ చనిపోయారు. కేసు దర్యాప్తులో ఉన్నట్టు సిరికొండ ఎస్ఐ రామారావు చెప్పారు.

విదేశ్ భవన్‌కు రెండెకరాలు కేటాయింపు

- సర్కారు ఆదేశాలు
- జీవో 50 జారీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్‌లో విదేశీ మంత్రిత్వ శాఖ నిర్మించనున్న 'విదేశ్ భవన్' కు రాష్ట్ర ప్రభుత్వం రెండెకరాల భూమిని కేటాయించింది. ఈ మేరకు శుక్రవారం జీవో నెంబరు 50 విడుదల చేసింది. రెవెన్యూ శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారి ఆదేశాలు ఇచ్చారు. శేరిలింగంపల్లి మండలంలోని ఖానామెట్‌లోని సర్వే నెంబరు 42/1/2లో 1-08 ఎకరాలు, మాదాపూర్‌లోని సర్వే నెంబరు 64/2లో 32 గుంటలు ఇచ్చారు. చదరపు గజం స్థలానికి కనీస ధర రూ. 30 వేలుగా నిర్ణయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది.



ఆన్‌లైన్ అలర్ట్

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందటం, మొబైల్, నెట్ వాడటం విస్తృతమవటంతో వినియోగదారులు టెక్నాలజీ వైపు మొగ్గుచూపుతున్నారు. ఫ్రెండ్స్‌తో కాఫీ షాప్‌లో ఉన్నప్పుడైనా, కొలీగ్స్‌తో ఆఫీస్‌లో ఉన్నప్పుడైనా తాము కొనాలనుకున్న వస్తువును ఆన్‌లైన్ షాపింగ్ వేదికలపై ఇట్టే కొనేస్తున్నారు. ఈ తరహా షాపింగ్ సరదా ఉంటుంది. సమయాన్ని, డబ్బును ఆదా చేస్తుంది. కానీ ఒక్కోసారీ మనకు తెలియకుండా ఝలక్ ఇస్తాయి. తెలియకుండానే మోసపోవాల్సి వస్తుంది. అలాంటప్పుడు కాస్త అవగాహన, జాగ్రత్త పెంచుకుంటే ఇలాంటివి అధిగమించవచ్చు. ఆన్‌లైన్ షాపింగ్ చేసేటప్పుడు తెల్సుకోవాల్సిన విషయాలు, జాగ్రత్తలపై టెక్‌ప్లస్ స్టోరీ...

"క్రిష్ణ ఇరవై ఏండ్ల కుర్రాడు. అనుకోకుండా ఫ్రెండ్‌కి బిర్యాని పార్టీ ఇవ్వాల్సి వచ్చింది. రెస్టారెంట్లు దగ్గర్లో లేవు. బయటకెళ్లడానిక టైమూ లేదు. ఆన్‌లైన్ ద్వారా ఫుడ్ ఆర్డర్ చేశాడు. సరిగా అరగంటలో డెలివరీ చేస్తామన్న డెలివరీ బాయ్ గంట తర్వాత వచ్చి పార్సిల్ ఇచ్చి వెళ్లాడు. తీరా ప్యాకెట్ ఓపెన్ చేసి చూస్తే ఆర్డర్ చేసిన ఫుడ్ వేరు, వచ్చిన ఫుడ్ వేరు. క్రిష్ణకు ఏం చేయాలో అర్థం కాలేదు. ఎవరిని సంప్రదించాలో తెలియలేదు. చేసేదేమీ లేక అదే ఫుడ్‌తో సరిపెట్టుకున్నారు."

రాంబాబు అప్పుడప్పుడూ ఆన్‌లైన్ షాపింగ్ షాపింగ్ చేస్తుంటాడు. ఒక రోజు తనకు ఇష్టమైన షూ ఆర్డర్ చేశాడు. పేమెంట్‌కూడా ఆన్‌లైన్‌లోనే చేశాడు. వారం రోజుల తర్వాత ప్రాడక్ట్ డెలివరీ అయింది. కానీ సైజ్‌లో తేడా వచ్చింది. ఏం చేయాలో అర్థం కాలేదు.

పై రెండు ఉదాహరణలు మనకు చాలా చిన్న విషయాలు అయి ఉండొచ్చు. కొన్ని సందర్భాల్లో అలాంటివి మనకూ ఎదురవుతాయి. పోతే పోనీలే అనుకుంటాం. డబ్బులు చెల్లించి మరీ బాధపడతాం.. ఆన్‌లైన్ షాపింగ్ సైట్లనుంచి సరైన సేవలను అందుకోలేక పోతాం. నిజానికి వాటిని సరైన విధంగా డీల్ చేస్తే సమస్య రాదు. చాలా మందికి తెలియక అలాగే తమలో తాము బాధపడుతూ ఉంటారు.

Online stores : Amazon.in., Flipkart.com., paytm, Snapdeal. com., Ebay.in., Jabong. com.m, Myntra.com., Homeshop18., Shopclues.com.

ప్రాడక్ట్ చెకింగ్ : మీరు కొనాలనుకున్న ప్రాడక్ట్ క్వాలిటీ, రేట్ గురించి ముందు చెక్ చేయండి. ఒక్కో సైట్‌లో ఒక్కో ఆఫర్ ఉండొచ్చు చూడండి. మీరు వెతుకుతున్న సైట్‌లో ఉన్న రేట్‌ని, మిగతా సైట్ లో ఉన్న రేట్‌ను కంపైర్ చేసుకొండి. ప్రాడక్ట్ కొంటున్నపుడు దాని బ్రాండ్, సెల్లర్ హౌస్ డీటైల్స్ చూడండి. దీంతో పాటు ఇతర వినియోదారులు ఇచ్చి రివ్యూ అండ్ రేటింగ్ చూడండి. ఆ ప్రాడక్ట్ కొని వాళ్లు రివ్యూ ఇస్తుంటారు. దాన్ని చూడటం ద్వారా ఆ వస్తువును కొనాలా వద్ద అనే నమ్మకం కల్గుతుంది.

రాంగ్ డెలివరీనా.. డోంట్ వర్రీ : మీరు కొన్న వస్తువుకు బదులుగా వేరే వస్తువు డెలివరీ అయినా... లేక క్వాలిటీ తక్కువ ఉన్నా చింతించాల్సిన పని లేదు. రిటర్న్ అండ్ రిఫండ్ పాలసీ తెలిస్తే ఈ సమస్యను అధిగమించవచ్చు. ఆన్‌లైన్ షాపింగ్ సైట్లు ప్రతీ వస్తువుపై నిర్ణీత కాలంలో రిటర్ట్ సర్వీస్ ఇస్తోంది. ఇది గమనించి వస్తువులను కొంటే సరిపోద్ది. ఒక వస్తువు కొన్న తర్వాత నిర్ణీత సమయంలో రిటర్న్ చేయవచ్చు అని ఆయా షాపింగ్ సంస్థలు ఆఫర్ ఇస్తున్నాయి. ప్రాడక్ట్ డెలివరీ స్టేటస్‌లోకి వెళ్లి రిటర్న్ అండ్ రిఫండ్ ఆప్షన్‌పై క్లిక్ చేస్తే సదరు వస్తువును రిటర్న్ చేయడానికి కారణాలు మనం పొందుపరిచి రిటర్న్ చేయవచ్చు. మీ స్టేట్‌మెంట్‌ను అప్రూవ్ చేసిన తర్వాత పిక్ అప్ టైం వాళ్లకి చెప్పాల్సి ఉంటుంది. మనం ఇచ్చిన టైంకి పిక్ అప్ బాయ్ వచ్చి ప్రాడక్ట్ రిసీవ్ చేసుకుంటారు. ఆ ప్రాడక్స్ సెల్లర్ హౌస్‌కి చేరుకున్న తర్వాత షాపింగ్ సైట్ అకౌంట్‌లోకి రిఫండ్ అవుతాయి. మళ్లీ అదే ఫండ్‌తో షాపింగ్ చేయవచ్చు.

డిస్కౌంట్‌లు , కూపన్లు కూడా డబ్బుని ఆదా చేస్తాయి ...
చాలా వరకు షాపింగ్ సైట్లలో డిస్కౌంట్ ఆఫర్‌లు ఉంటాయి. వాటిని కూడా పరిశీలించండి , ఒక్కో వెబ్ సైట్ ఒక్కోలా ఇస్తుంటారు. వీక్లీ కూపన్లు, మంత్లీ కూపన్లు, ఫెస్టివల్ ఆఫర్లు అంటూ వివిధ రకాల కూపన్లు ఇస్తుంటారు. వాటిని వాడుకోవచ్చు. షాపింగ్ పేమెంట్ చేస్తున్నపుడు కూపన్ కోడ్ ఆప్షన్ ఉంటుంది. ఒక వేళ మన దగ్గర కూపన్ ఉంటే దాని కోడ్‌ని అప్లై చేస్తే డిస్కౌంట్ ఆఫర్ వస్తుంది.



క్యాష్ అండ్ డెలివరీ బెటర్ : ఒకవేళ ప్రాడక్ట్ కొని, ఆన్‌లైన్ మనీ పేమెంట్ చేసిన తర్వాత మోసపోతే ఎలా అని కొందరు భయపడుతూ ఉంటారు. అలాంటపుడు క్యాష్ అండ్ డెలివరీ ని ఎంచుకోవటం ఉత్తమం. టాప్ ఆన్‌లైన్ స్టోర్లు ఈ సదుపాయాన్ని కల్పిస్తున్నాయి. ప్రాడక్ట్ చేతికి అందిన తర్వాతే డబ్బులు చెల్లించొచ్చు.

ఈ- పేమెంట్‌తో జాగ్రత్త : కొందరు షాపింగ్ చేసేప్పుడు ఆన్‌లైన్ పేమెంట్ చేస్తారు. క్రెడిట్, డెబిట్, ఈ బ్యాకింగ్ ద్వారా డబ్బులు చెల్లిస్తారు. అప్పుడు కొంత జాగ్రత్త వహించాల్సి ఉంటుంది. వాడుతున్న డివైస్‌లో నెట్ స్పీడ్‌గా ఉండేలా చూసు కోవాలి. అది పర్సనల్ డివైజ్ అయి ఉండాలి. పబ్లిక్ వైఫైలతో, నెట్ కేఫ్‌లలో షాపింగ్ చేస్తున్నప్పుడు ఆన్‌లైన్ పేమెంట్ చేయకోవడమే మంచింది. ఫినాన్షియన్ విషయాలను పబ్లిక్ ప్లాట్‌ఫాంలలో షేర్ చేసుకోవద్దు.

అప్‌డేట్స్ గమనించండి : మీరు వాడుతున్న ఆన్‌లైన్ షాపింగ్ సైట్ ఆప్ అప్‌డేట్లను ఎప్పుడూ గమనిస్తూనే ఉండండి. అప్‌డేట్ అందుబాటులో ఉన్నప్పుడు కచ్చితంగా అప్‌డేట్ చేయండి. కొత్త సెక్యూరిటీ ఫీచర్లు యాడ్ అవుతూ ఉంటాయి. సేఫ్ షాపింగ్ చేయటానికి ఇది తోడవుతుంది.

మార్చి 15న ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం
ఆన్‌లైన్ వేదికగా జరుగుతున్న సేవలలో వినియోదారుడు ఆసంతృప్తి గా ఉంటే కన్స్యూమర్ ఫోరంను ఆశ్రయించవచ్చు. 1995 నాటికి ఇంటర్‌నెట్ సేవలతో వినియోగదారుల ఫోరమ్‌లో ఫిర్యాదు చేసే వారి సంఖ్య ప్రపంచ జనాభాలో కేవలం 1 శాతం మాత్రమే ఉండేది. అది ప్రస్తుం ప్రపంచ జనాభాలో 40 శాతానికి పెరిగిందని ఓ అంచనా..

-వినో



మీ పాస్‌వర్డ్ ఎంత స్ట్రాంగ్



మీ పాస్‌వర్డ్ ఎవరికీ తెలియదనుకుంటున్నారా? మీకు తెలియకుండా మీ డివైజ్‌ని ఎవరూ ఓపెన్ చేయలేరనుకుంటున్నారా? మీరు వాడుతున్న డివైజ్‌లో డాటా సేఫ్ అని భావిస్తున్నారా ? అయితే మీరు తప్పులో కాలేసినట్టే.. మీకు తెలియకుండానే మీ డేటా తష్కరించబడుతుంది. దీని కోసం మీ పాస్‌వర్డ్ ఎప్పుడూ స్ట్రాంగ్‌గా ఉండాలి. పాస్ వర్డ్‌లో ఎక్కువ క్యారెక్టర్లు ఉన్నంత మాత్రానా స్ట్రాంగ్‌గా ఉన్నట్టు అనుకోవద్దు. మీ పాస్‌వర్డ్ హ్యాక్ కాకుండా ఉండాలంటే ఎలా ఉండాలో కొంది ట్రిక్స్ పాటించండి.

పాస్‌వర్డ్ ఫ్రీజ్ : పెరుగుతున్న టెక్నాలజీకి అనుగుణంగా డిజిటల్ యూజర్ కూడా మారాల్సి ఉంది. మీ డివైజ్ పాస్‌వర్డ్ ఫ్రీజ్‌గా ఉండాలి. అంటే జిగ్‌జాగ్‌గా ఉండాలి. ఇంటి పేర్లు, ఒంటి పేర్లు, ప్రదేశాల పేర్లను అవాయిడ్ చేయండి. క్యాపిటల్ వర్డ్స్, నంబర్స్, ఫంక్షనల్ వర్డ్స్‌తో పాస్‌వర్డ్ తయారు చేయండి. వీలైనంత పెద్దగా, కాంపెక్స్‌గా, ప్రాక్టికల్‌గా ఉండాలి. అన్నికంటే ముఖ్యంగా దాన్ని ప్రతీ మూడు నెలలకు ఓ సారి మార్చేయాలి. పుట్టిన తేదీలు, వ్యక్తుల పేర్లు, ఊత పదాలు పెట్టుకోవటం మంచిది కాదు.

ఇలా అయితే హ్యాక్ అయినట్టే : మీ మొబైల్ లేదా కంప్యూటర్ హ్యాక్ కు గురైనట్టు తెలుసుకోవచ్చు. మీరు వాడుతున్న డివైజ్‌లో ఉన్నట్టుంది పాప్‌ఆప్స్ రావటం, కొత్త కొత్త ట్యాబ్‌లు రావటం, స్పామ్ మెసెజులు ప్రత్యక్షమవటం జరగుతుంటది. మొబైల్‌లో అయితే కాల్ మాట్లాడేటప్పుడు ఒక రకమైన బీప్‌సౌండ్ వినిపిస్తుంటుంది. ఈ రకమైన సిగ్నల్లు హ్యాక్ అయినట్టు సంకేతాలు ఇస్తాయి. వీటిని నివారించడానికి మీ పాస్ వార్డును ఎప్పటికప్పుడూ మార్చుకోవటమే ఉత్తమం.

మీ పాస్‌వర్డ్ ఎంత స్ట్రాంగ్ గా ఉందో తెలుసుకోవడానికి ఇక్కడ క్లిక్ చేయండి
: https://goo.gl/Lty4Yz

-నవంత్, బాగ్‌లింగంపల్లి

ప్రైవేసీ మీ చేతుల్లోనే...



డిజిటల్ యూజర్‌కు ఈ మెయిల్ అనేది ఒక కాన్ఫిడెన్షియల్ అంశం. దాన్ని ఎంతో గోప్యంగా డీల్ చేయాలి. ఫైల్స్, సమాచారం ఎవరి చేతిలో పడకుండా చూసుకోవాలి. కొంత నిర్లక్ష్యంగా ఉన్న విలువైన సమాచారం ఇంకొకరి చేతికి చిక్కే ప్రమాదం ఉంది. సెక్యూర్ మెయిల్స్ విషయంలో ప్రొటాన్ మెయిల్ సురక్షితంగా ఉంటుంది. ఉచితంగా లభించే మొబైల్ యాప్స్ కంటే కూడా ఇది చాలా సేఫ్ దీనిలో 500 ఎంబీ స్టోరేజ్, 150 ఈమెయిల్స్ రోజుకు వాడుకోవచ్చు. ఆండ్రాయిడ్, ఐఓఎస్ యూజర్లకోసం ఇది ఎప్పటి నుంచో అందుబాటులో ఉంది. మెయిల్ ఫెన్స్, టుటనోటా కూడా ఇలాంటి సర్వీసులే. వీటి ద్వారా మెయిల్ చేయడం చాలా సురక్షితం. ఇది ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్‌తో మన ఫైల్స్‌కు రక్షణ కల్పిస్తుంది.

షియోమీ నుంచి మరో స్మార్ట్ ఫోన్



చైనాకు చెందిన మొబైల్ దిగ్గజం షియోమి ఇండియాలో ట్రెండ్ సృష్టిస్తోంది. ఇటీవలే ఎంఐ నోట్ 5, 5ప్రో ను రిలీజ్ చేసి క్రేజ్ సంపాధించింది. నెల వ్యవధిలోనే ఇప్పటి వరకు రెండు టీవీలను మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. ఇదే దూకుడుతో ఈ నెల 14న మరో స్మార్ట్ ఫోన్ ను విడుదల చేయబోతోంది. అది స్లిమ్, స్లీక్, కంపాక్ట్ తో ఉండే స్మార్ట్ ఫోన్ అని ట్విట్టర్ ద్వారా సంస్థ వెల్లడించింది. అయితే దాని మోడల్ ఏంటి అనేది కంపెనీ నుంచి అధికారికంగా ఇంకా ప్రకటన రాలేదు. కాకపోతే అది రెడ్ మీ 5 ఉండొచ్చని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు.

గూగుల్ తేజ్‌లో ఇక చాటింగ్

గూగుల్ తేజ్ యాప్‌లో కొత్త ఫీచర్ యాడ్ అయింది. యూజర్లు డబ్బులను పంపే సమయంలో వారితో నేరుగా సంభాషించుకునే అవకాశం ఉంది. పేమెంట్స్ కి సంబంధించి ఏమైనా సందేహాలు అంటే అకౌంట్ నంబర్, బ్రాంచ్ కోడ్ లాంటి వాటిని వెంటనే ఇక్కడ నుంచి తెలుసుకోవచ్చు. తేజ్ వినియోగదారులు పేమెంట్ చేసే సమయంలో కాంటాక్ట్స్ లో ఉన్న నంబర్లకు చాట్ చేసుకునే సౌకర్యం ఉంది.



70శాతం ఫాల్స్ ట్వీట్లేనటా ..



ట్వీటర్‌లో వైరల్ అయ్యే ట్వీట్లు 70 శాతం తప్పుడు సమాచారమేననియూఎస్ కు చెందిన Massachusetts Institute of Technology's Media Lab చేసిన సర్వే ఆధారంగా వెల్లడించింది. 2006 నుంచి 2017 వరకు ఎక్కువ స్ప్రెడ్ అయిన 126000 ట్వీట్లను పరిశీలిస్తే అందులో 70 శాతం ఫాల్స్ న్యూస్ అని తేలింది. సదరు ట్వీట్లను 30 లక్షల మంది షేర్లు చేశారనీ, నిజమైన యూజర్లు వాటికి రి-ట్వీట్లు చేశారని తేలింది.

డియర్ రీడర్స్..


మీకు తెలిసిన టెక్నాలజీ ఇన్ఫర్మేషన్ ఇతరులతో షేర్ చేసుకోవాలనుకుంటున్నారా ? మార్కెట్‌లోకి వస్తున్న కొత్త కొత్త గాడ్జెట్స్, మొబైల్స్, స్మార్ట్ ఐటెమ్స్ గురించి ఇతరులకు తెలియజేయాలనుకుంటున్నారా..? టెక్నాలజీ పరంగా ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఎలా పరిష్కరించారో అందరితో పంచుకోవాలనుకుంటున్నారా ? అయితే మాకు పంపండి.

మాచిరునామా : 'టెక్‌ప్లస్' పేజీ, నవతెలంగాణ దినపత్రిక, ఎంహెచ్ భవన్, ప్లాట్ నెం. 21/1, ఆజమాబాద్, ఆర్.టి.సి కల్యాణ మండపం వీధి, హైదరాబాద్ - 500020.

tech.nava11@gmail.com, **వాట్సాప్ నెం:** 07660066469

అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ లో ఎంఐ పవర్ బ్యాంకులు

ఇండియా స్మార్ట్ ఫోన్ దిగ్గజ సంస్థ షియోమీ మేడ్ ఇన్ ఇండియా పవర్ బ్యాంకులను రిలీజ్ చేసింది. మొదటి సారిగా ఇండియాలో థర్డ్ పార్టీ ఈ కామర్స్ స్టోర్లు అమెజాన్, ఫ్లిప్‌కార్టుల్లో వీటిని అందుబాటులోకి తీసు కొచ్చింది. 10వేల ఎంఏహెచ్, 20000 వేల ఎంఏహెచ్ పవర్‌బ్యాంకులు అందుబాటులో ఉన్నాయి. మేడ్ ఇన్ ఇండియా పవర్ బ్యాంకులు మొదటి సారి 2017 నవంబర్‌లో రిలీజ్ చేసినా అవి ఎంఐ హోమ్ స్టోర్‌లోనే అందుబాటులో ఉంచింది. ఇప్పుడు వీటిని అమెజాన్, ఫ్లిప్‌కార్టుల్లోకి తీసుకొచ్చినట్టు సంస్థ ట్విట్టర్ ద్వారా తెలిపింది.



3 సంస్థల భాగస్వామ్యంతో పరిశోధకుల కన్సార్టియం

వ్యవసాయంలో ఉపయోగిస్తున్న పరిజ్ఞానానికి బదులు కొత్త టెక్నాలజీని ఉపయోగించడానికి పరిశోధకులు కృషి చేస్తున్నారు. దీని కోసం దేశంలోని 3 ప్రముఖ సంస్థల భాగస్వామ్యంతో పరిశోధకుల కన్సార్టియంను ఏర్పాటు చేశారు. తిరువనంతపురంలోని ఐఐఐటీ కే పరిశోధక శాస్త్రవేత్తలు, ఉత్తరాఖండ్‌లోని జీబీ పంత్ అగ్రికల్చరల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ యూనివర్సిటీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ టెక్నాలజీతో ఈ కన్సార్టియంను ఏర్పాటు చేశారు.

చందమామపై 4 జీ

మనం 3జీ, 4జీ నెట్‌వర్క్ అందుబాటులోకి వచ్చాక ఎక్కడ కెళ్లిన సమాచారం నిమిషాల్లో అందుబాటులో ఉంటుంది. మరి భూమిపై సరే భవిష్యత్‌లో చందమామపైకి వెళ్లి అక్కడ నుంచి మాట్లాడలనుకుంటే ఎలా? అనుకునేవారికి ఇదోక శుభవార్త అనే చెప్పవచ్చు. చంద్రుడిపై 2019లో మొబైల్ నెట్‌వర్క్(4జీ)ను ఏర్పాటు చేసేందుకు తాము సంయుక్తంగా కృషి చేస్తున్నామని వొడాఫోన్-జర్మనీ, నోకియా, కార్ల తయారీ సంస్థ ఆడి 2018 ఫిబ్రవరి 27న వెల్లడించాయి. వచ్చే ఏడాది కేప్ కెనవెరాల్ నుంచి స్పేస్‌ఎక్స్ ఫాల్కన్-9 రాకెట్‌తో సంబంధిత సామగ్రిని చందమామపైకి పంపించనున్నట్లు తెలిపాయి. బెర్లిన్‌కు చెందిన 'పీటీసైంటిస్ట్స్' సంస్థ ఈ ప్రయోగాన్ని చేపడుతుందని పేర్కొన్నాయి. అంటే ఇక భవిష్యత్‌లో చందమామపై కూడా ఫోన్లు వాడుకోవచ్చు.



నయామాల్



అసుస్ జెన్‌ఫోన్ 5 ఫీచర్లు
6.2 ఇంచ్ ఫుల్ హెచ్‌డీ
2246X1080రిజల్యూషన్,
1.8 గిగాహెడ్జ్ ఆక్టాకోర్ స్నాప్‌డ్రాగన్
636 ప్రాసెసర్, 4/6 జీబీ ర్యామ్,
64/128 జీబీ స్టోరేజ్,
డ్యుయల్ సిమ్, ఆండ్రాయిడ్ 8.0 ఓరియో,
12, 8 మెగాపిక్సల్ డ్యుయల్ బ్యాక్, 8 మెగాపిక్సల్ సెల్ఫీ కెమెరా, ఫింగర్‌ప్రింట్ సెన్సార్,

Honor 9 lite

5.65 ఇంచ్ ఫుల్ హెచ్‌డీ
2160X1080రిజల్యూషన్,
13 మెగాపిక్సల్ బ్యాక్ అండ్ ఫ్రంట్
డ్యుయల్ సిమ్
ఆండ్రాయిడ్ 8.0 ఓరియో
3000 ఎంఏహెచ్ బ్యాటరీ
3/32 జీబీ స్టోరేజ్





కోచ్‌తో శ్రీలంక సారథి దినేశ్ చండిమాల్

బంగ్లా పుంజుకునేనా?

- శ్రీలంకతో నేడు బంగ్లాదేశ్ ఢీ
- జోరుమీదున్న లంకేయులు
- ముక్కోణపు టీ20 సిరీస్
- సా॥ 7 గంటలకు డి స్పోర్ట్స్‌లో..

కొలంబో-నవతెలంగాణ

శ్రీలంక, బంగ్లాదేశ్‌లు కొత్త ఏడాదిలో వరుసగా తలపడుతున్నా.. కొలంబోలో నేటి పోరు ఆసక్తికరంగానే మారుతోంది. జనవరి ఆఖరు నుంచి విజయం కోసం ఎదురుచూస్తున్న బంగ్లాదేశ్ ఒక వైపు, బంగ్లా పర్యటనలో వరుస విజయాలు, తాజాగా భారత్‌పై ఐదు వికెట్ల గెలుపుతో జోరుమీదున్న శ్రీలంక మరోవైపు. ఇప్పుడు లంకేయులు పూర్తిగా భిన్నమైన జట్టుగా కనిపిస్తున్నారు. ఇదే సమయంలో బంగ్లాదేశ్ ఏమాత్రం వ్యూహం లేని జట్టుగా తయారైంది. ముక్కోణపు సిరీస్‌లో మరో రెండు మ్యాచులు ఆడాల్సి ఉన్నా.. రేసులో నిలవాలంటే బంగ్లాదేశ్ ఇప్పుడు విజయం సాధించటం అవసరం. బంగ్లాదేశ్ గెలుపు నిరీక్షణకు తెరపడుతుందా? లేక స్వదేశంలో శ్రీలంక జోరు కొనసాగుతుందా? ఆసక్తికరం.

లంకేయులకు ఎదురుందా? : భారత్ భారీ లక్ష్యం ముందుంచినా.. కుశాల్ పెరీరా ఇన్నింగ్స్ ఆతిథ్య జట్టుకు విజయాన్ని కట్టబెట్టింది. 37 బంతుల్లోనే 66 పరుగులు చేసిన పెరీరా భారత బౌలర్లపై విరుచుపడ్డాడు. హిట్టర్లు దసున్ శనక, తిశార పెరీరాలు విఫలమైనా.. కుశాల్ తగ్గలేదు. భారత్ బౌలింగ్ బృందం ద్వితీయ శ్రేణియే అయినా.. నాణ్యమైనదే. దీంతో నేడు బంగ్లాదేశ్‌పైనా అదే జోరు కొనసాగించాలని ఆ జట్టు భావిస్తోంది. కానీ బౌలింగ్ బృందంలోనే లంకకు కొన్ని సమస్యలు ఉన్నాయి. అఖిల ధనంజయకు వికెట్లు దక్కలేదు, నువాన్ ప్రదీప్ మెరువలేదు. పార్ట్‌టైమ్ బౌలర్లపై ఆధారపడాల్సిన పరిస్థితి. షార్ట్ బంతులు ఎదుర్కోవటంలో బంగ్లాదేశ్ బ్యాట్స్‌మెన్‌కు ఉన్న ఇబ్బందిని దృష్టిలో పెట్టుకుని.. నేడు అస్త్రంతో సీమర్లు సిద్ధమవుతున్నారు.

బంగ్లాదేశ్ సమస్య మరోలా ఉంది. భారత్‌తో మ్యాచ్‌లో ఆ జట్టు ఏకంగా 68 బంతులను వదిలేసింది. సగానికి పైగా ఓవర్లలో పరుగులేమి చేయని ఫలితంగా బంగ్లా మూల్యం చెల్లించుకున్నది. కానీ నేడు లంకతో ఆజట్టు భిన్నమైన గేమ్ ప్లాన్‌తో రావాల్సిన అవసరం ఉంది. అప్పుడే మెరుగైన ప్రదర్శన చేయగలరు. లేదంటే చేతిలో వికెట్లు ఉన్నా.. ఎప్పుడు హిట్టింగ్‌కు వెళ్లాలో, ఎక్కడ డిఫెన్స్‌ను ఆశ్రయించాలో తెలియక మళ్లీ చతికల పడే ప్రమాదం లేకపోలేదు. ఇక నేడు సైతం కొలంబోలో వర్ష సూచనలు ఉన్నాయి. అయినా సాయంత్రం 5 గంటల తర్వాత వర్షం కురిసే అవకాశం లేదని తెలుస్తోంది. కాబట్టి మ్యాచ్‌కు ఎటువంటి ఆటంకం ఉండబోదని చెప్పవచ్చు.

తుది జట్లు (అంచనా) : శ్రీలంక : గుణతిలక, కుశాల్ మెండిస్, కుశాల్ పెరీరా, దినేశ్ చండిమాల్, ఉపుల్ తరంగ, దుసున్ శనక, తిశార పెరీరా, జీవన్ మెండిస్, అఖిల ధనంజయ, దుష్మంత చమీరా, నువాన్ ప్రదీప్.

బంగ్లాదేశ్ : తమీమ్ ఇక్బాల్, సౌమ్య సర్కార్, లిటన్ దాస్, ముష్ఫికర్ రహీం, మహ్మదుల్లా, షబ్బీర్ రెహమాన్, మెహిది హసన్, ముస్తాఫిజుర్ రెహమాన్, టస్కిన్ అహ్మద్, రూబెల్ హొస్సేన్, నజముల్ ఇస్లాం.



ముస్తాఫిజుర్ రెహామాన్

అంజుమ్ గురి అదిరింది

షూటింగ్ ప్రపంచ కప్

- 50 మీటర్ల రైఫిల్ విభాగంలో రజతం



న్యూఢిల్లీ : షూటింగ్ ప్రపంచ కప్‌లో భారత షూటర్ల ఆధిపత్యం కొనసాగుతూనే ఉంది. గురి పెడితే పతకమే అన్న చందంగా సాగుతోన్న భారత్ ఖాతాలో శుక్రవారం రజతం వచ్చి చేరింది. మహిళా షూటర్ అంజుమ్ మౌద్గిల్ 50మీటర్ల రైఫిల్ 3 స్థానాల ఈవెంట్లో వెండి పతకం సాధించింది. మెక్సికోలో జరుగుతోన్న పోటీల్లో రజతం గెల్చిన అంజుమ్‌కు షూటింగ్ ప్రపంచ కప్‌లో ఇది తొలి పతకం. గాలి వీస్తూ షూటింగ్ కష్టతరంగా మారినా అంజుమ్ మెరుగైన ప్రదర్శన చేసింది. 45 షాట్లలో మొత్తంగా 454.2 పాయింట్లతో రజతం గెల్చుకున్నది. 1.2 పాయింట్ల తేడాతో తృటిలో పసిడి చేజార్చుకున్నది. ఆది నుంచే పతక రేసులో ఉన్న అంజుమ్ 40వ షాట్ వరకూ మూడో స్థానంలో కొనసాగింది. తదుపరి షాట్‌లో ఉత్తమ 10.8 స్కోరుతో రజతానికి చేరువైంది. ఆఖరి నాల్గు షాట్లలోనూ గురి తప్పని అంజుమ్ 10.2, 10.1, 9.5, 10.2తో ఫైనల్స్ ముగించింది. టోర్నీలో భారత్‌కు ఎనిమిదో పతకం కాగా ఇప్పటికే మూడు స్వర్ణాలు సహా నాల్గు రజతాలు గెల్చిన భారత్ పతకాల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతున్నది.

సిసలైన సారథ్య పరీక్ష ఎదురుకాలేదు

- విరాట్ కోహ్లిపై బిషన్ సింగ్ బేడీ వ్యాఖ్య



న్యూఢిల్లీ : బ్యాట్స్‌మన్‌గా పరుగుల దాహంతో ఉరకలేస్తూ, కెప్టెన్‌గా విజయాల జైత్రయాత్ర కొనసాగిస్తున్న టీమ్ ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లికి ఇంకా సరైన సారథ్య పరీక్ష ఎదురుకాలేదని దిగ్గజ స్పిన్నర్ బిషన్ సింగ్ బేడీ అభిప్రాయపడ్డాడు. బ్యాట్స్‌మన్‌గా విరాట్ కోహ్లి జోరు, నిలకడ అనితర సాధ్యమని కొనియాడిన బేడీ కెప్టెన్‌గా కోహ్లి ఇంకా నిరూపించుకోవాల్సినది ఉందని అన్నాడు. 'నిజాయితీగా చెప్పాలంటే, కోహ్లి బ్యాట్స్‌మన్‌గా జట్టును ముందుండి నడిపిస్తున్నాడు. జట్టు అందుకు తగినట్టు ఫలితాలు సాధిస్తుంది. స్టీవ్ వా, మైకల్ బ్రీయర్లె గురించి మాట్లాడితే.. వారు పూర్తిగా ఆటను చదువుతారు, ఆలోచిస్తారు. కానీ కోహ్లి కెప్టెన్‌గా ఆ ముద్ర వేయాల్సి ఉంది. విరాట్ నుంచి నేనది ఆశిస్తున్నాను. అతనిప్పటి వరకూ ఆ విధంగా పరీక్షింపబడలేదు' అని బేడీ తెలిపాడు. ఇక శ్రీలంకతో తరచుగా ఆడటం వల్ల భారత్‌కు వచ్చిన ఉపయోగమేమీ లేదని, అందుకు బదులుగా దేశవాళీలో ఆడటం మేలని బేడీ పేర్కొన్నాడు.' శ్రీలంక నుంచి మనం ఏం సాధిస్తున్నాం?. శ్రీలంకలోనే వారిపై విజయం సాధించాం. స్వదేశంలోనూ వాళ్లను చిత్తు చేశాం. మళ్లీ ఇప్పుడు వాళ్లతో ఆడేందుకు వెళ్లాం. దీనికి బదులుగా దేశవాళీ క్రికెట్‌లో ఆడితే ఆటగాళ్లకు ప్రయోజనం కల్గుతుంది' అని బేడీ అన్నాడు.



మహ్మద్ షమి

విష ప్రయోగం చేశాడు!

- షమిపై అతడి భార్య హసిన్ జహాన్ ఫిర్యాదు
- హత్యాయత్నం కింద నాన్ బెయిలబుల్ కేసు నమోదు
- షమితో పాటు మరో నలుగురిపై ఎఫ్ఐఆర్

నవతెలంగాణ-కోల్‌కత



భారత క్రికెటర్ మహ్మద్ షమి ఇంటి గొడవ రోజురోజుకూ మరింత రాజుకుంటోంది. భార్యను కలిసి, త్వరలోనే వివాదానికి ముగింపు పలుకుతానని చెప్పిన మర్నాడే.. అతడి సతీమణి హసిన్ జహాన్ కోల్‌కత పోలీసులకు ఫిర్యాదు చేసింది. మహ్మద్ షమి తనపై విష ప్రయోగం (తినే ఆహారంలో విషం కలిపాడు), శారీరకంగా హింసించాడు' అని హసిన్ జహాన్ కోల్‌కత పోలీసులకు ఫిర్యాదు చేసింది. హత్యా ప్రయోగంతో పాటు గృహ హింస చట్టం కింద షమితో పాటు మరో నలుగురిపై కోల్‌కత పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఐపీసీ సెక్షన్ 498 ఏ, 323, 307, 376, 506, 328, 34 ప్రకారం షమిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వీటిలో కొన్ని నాన్ బెయిలబుల్ సెక్షన్ (హత్యా ప్రయత్నం, మహిళను శారీరకంగా హింసించటం)లు సైతం ఉన్నాయి. షమి సోదరుడిపై అత్యాచార యత్నం కింద కేసు నమోదు చేసినట్టు తెలుస్తోంది. అయితే ఇతర నలుగురిపై ఏ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు, వారెవరు అనే విషయాలు పోలీసులు వెల్లడించలేదు. ' షమి భార్య నుంచి లిఖిత పూర్వక ఫిర్యాదు తీసుకున్నాం. శారీరక, మానసిక వేధింపులపై ఆమె ఆరోపణలు చేసింది. పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశాం. తొలుత ఏ సెక్షన్ ప్రకారం చర్యలు తీసుకోవాలనే విషయమై ఆలోచన చేస్తున్నాం' అని కోల్‌కత పోలీసు సంయుక్త కమిషనర్ (క్రైమ్) ప్రవీణ్ త్రిపాఠి తెలిపారు. పాకిస్థాన్ అమ్మాయితో మహ్మద్ షమి అక్రమ సంబంధం కల్గి ఉన్నాడని, ఇతర అమ్మాయిలతోనూ షమికి శారీరక సంబంధాలు ఉన్నాయని హసిన్ జహాన్ ఫేస్‌బుక్ వేదికగా ఆధారాలతో ముందుకొచ్చిన సంగతి తెలిసిందే. భార్య ఆరోపణలతో బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్టు జాబితాలో మహ్మద్ షమికి చోటు దక్కని విషయం తెలిసిందే.

ఆడియో టేపు విడుదల : పాకిస్థాన్ అమ్మాయి నుంచి మహ్మద్ షమి దుబాయ్‌లో డబ్బు తీసుకున్నాడని ఆరోపణలు చేసిన జహాన్.. అందుకు సంబంధించిన ఆడియో టేపులను బహిర్గతం చేసింది. భర్త షమితో మాట్లాడిన ఫోన్ కాల్‌ను రికార్డు చేసిన జహాన్ మీడియా ముందుంచింది. పాక్ అమ్మాయితో శారీరక సంబంధం ఉందని మాట్లాడవద్దని షమి కోరగా.. కేవలం డబ్బు తీసుకునేందుకు మాత్రమే దుబాయ్‌లో ఆమెను కలిశానని షమి అన్నాడు. ఈఆడియో టేపులో గొంతు ఎవరిదనే విషయంపై షమి ఎటువంటి వ్యాఖ్యలు చేయలేదు.

ఒంటరి పోరాటం చేస్తున్నాను : హసిన్ జహాన్

నేను ఎవరి నుంచి ఎటువంటి సహాయం పొందలేదు. అందుకే, ఈ విషయాలు వెల్లడించేందుకు సోషల్ మీడియాను వేదికగా ఎంచుకున్నాను. ఆధారాలతో నేను ముందుకొచ్చినప్పుడు ఫేస్‌బుక్ ఏ విధంగా ఖాతాను తొలగిస్తుంది, నా అనుమతి లేకుండా నేను చేసిన పోస్టింగ్‌లు ఎలా తొలగిస్తుంది? అని హసిన్ జహాన్ ప్రశ్నించింది. ఇక తన మానసిక స్థితిపై షమి అనుమానాలు వ్యక్తం చేయటం పట్ల జహాన్ స్పందించింది. షమి ఎన్నో అంశాల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. తనను తాను సమర్థించుకునేందుకు ఏమైనా చెబుతాడు, కానీ మీడియాతో మాట్లాడేటప్పుడు ఎన్నడూ నా వైఖరి మార్చుకోలేదని జహాన్ తెలిపింది. నాతో వివాహానికి ముందే బంధువుల అమ్మాయితో షమికి సంబంధం ఉంది. కుటుంబ సభ్యులు నిరాకరించటంతో ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. గత రెండేండ్లుగా నన్ను వదిలించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నాడు. దక్షిణాఫ్రికా పర్యటన నుంచి తిరిగి రాగానే.. ఆస్తులు, బాండ్లను తీసేసుకున్నాడు. ఈ విషయంలో షమిని విడిచిపెట్టను, న్యాయ స్థానానికి లాగుతానని జహాన్ తెలిపింది.



హాకీ సిరీస్ అమ్మాయిల సొంతం

- కొరియాతో నాల్గో మ్యాచ్‌లో 3-1తో భారత్ విజయం

సియోల్ (దక్షిణ కొరియా) : మహిళల హాకీ జట్టు దక్షిణ కొరియా పర్యటనలో మరో సాధికారిక విజయం అందుకున్నది. శుక్రవారం జరిగిన హాకీ సమరంలో ఆతిథ్య జట్టును 3-1తో ఓడించింది. ప్రపంచ నెంబర్ 10 భారత్ మరో మ్యాచ్ ఉండగానే.. ఐదు మ్యాచుల సిరీస్‌ను 3-1 ఆధిక్యంతో సొంతం చేసుకున్నది. మెరుగైన ప్రత్యర్థిపై ఆది నుంచి ఆధిపత్యం చలాయించింది. ఆట ప్రారంభమైన రెండో నిమిషానికే భారత్‌కు పెనాల్టీ అవకాశం లభించింది. నేర్పుగా బంతిని గోల్ పోస్ట్‌లోకి పంపిన గుర్జీత్ కౌర్ భారత్‌కు తొలి గోల్ అందించి 1-0తో నిలిపింది. రెండు నిమిషాల వ్యవధిలో కొరియాకు పెనాల్టీ అవకాశం అందినా గోల్‌గా మార్చుకోలేకపోయింది.10వ నిమిషంలో కొరియా చేసిన మరో పెనాల్టీ గోల్ ప్రయత్నాన్ని భారత గోల్ కీపర్ స్వాతి సమర్థవంతంగా అడ్డుకున్నది. తొలి క్వార్టర్ మరో నిమిషంలో ముగుస్తుందనగా దీపిక పెనాల్టీ గోల్‌తో భారత్ ఆధిక్యాన్ని 2-0కు పెంచింది. హోరాహోరీగా సాగిన రెండు, మూడు క్వార్టర్స్‌లో గోల్సేమీ నమోదుకాలేదు. ఈ దశలో 47వ నిమిషంలో భారత్ ఖాతాలో మరో గోల్ చేరింది. పూనమ్ రాణి అద్భుతమైన ఫీల్డ్ గోల్ కొట్టింది. ఇక కొరియా తరపున మి హ్యాన్ పార్క్ 57వ నిమిషంలో గోల్‌తో ఓటమిలో ఆ జట్టుకు ఊరటనిచ్చింది. భారత్, కొరియాల మధ్య ఆఖరు పోరు ఆదివారం జరుగనున్నది.

పతక ఆశలు ఆవిరి

- ఐర్లాండ్ చేతిలో 2-3తో భారత్ ఓటమి
- సుల్తాన్ అజ్లాన్ షా హాకీ టోర్నీ

ఐపో (మలేసియా) : సర్దార్ సారథ్యంలోని భారత్ అజ్లాన్‌షా టైటిల్ పోరుకు చేరే అవకాశాన్ని చేజార్చుకున్నది. టైటిల్ రేసులో నిలవాలంటే భారీ తేడాతో గెల్చి తీరాల్సిన మ్యాచ్‌లో ఐర్లాండ్‌లో చేతిలో 2-3తో ఓడింది. శుక్రవారం జరిగిన ఆఖరి లీగ్ పోరులో తొలుత ఆధిక్యం లభించినా.. కాపాడుకోవటంలో భారత్ విఫలమైంది. రమణ్‌దీప్ సింగ్ 10వ నిమిషంలో చేసిన గోల్‌తో భారత్‌కు శుభారంభం చేశాడు. షానె ఒడొనొగు 24వ నిమిషంలో గోల్‌తో ఐర్లాండ్ పోటీలో నిలిపాడు. అమిత్‌రోహిత్ దాస్ మరో రెండు నిమిషాల్లో పెనాల్టీ గోల్‌తో మరోసారి భారత్‌ను 2-1తో తిరిగి ఆధిక్యంలోనికి తీసుకొచ్చాడు. 36, 42నిమిషాల్లో రెండు గోల్స్‌తో ఐర్లాండ్ 3-2తో గెలుపొందింది. అంతర్జాతీయ సర్క్యూట్‌లో ఐర్లాండ్ చేతిలో భారత్‌కు ఇది తొలిఓటమి. తాజాఓటమితో పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచిన భారత్ ఐదో స్థానం కోసం ఆదివారం మరోసారి ఐర్లాండ్‌తో తలపడనున్నది.

వెంగ్ వ్యాఖ్యలు సరికాదు

- మాజీ చీఫ్ సెలక్టర్‌పై శ్రీనీ



చెన్నై : 2008 శ్రీలంక పర్యటనకు విరాట్ కోహ్లిని ఎంపిక చేయగా, సొంత రాష్ట్రానికి చెందిన బద్రినాథ్ జట్టుకు దూరమయ్యాడని దీనిని అప్పటి బీసీసీఐ కోశాధికారి ఎన్. శ్రీనివాసన్‌తో పాటు కెప్టెన్ ఎం.ఎస్ ధోనిలు వ్యతిరేకించారని మాజీ చీఫ్ సెలక్టర్ వెంగ్‌సర్కార్ వ్యాఖ్యానించగా.. అతడి వ్యాఖ్యలను శ్రీనీ ఖండించాడు. వెంగ్‌సర్కార్ ఆరోపణలు పూర్తిగా అబద్ధం, అప్రతిష్ఠ పాలుచేసేందుకు మాత్రమే ఇటువంటి మాటలు చెప్పాడని శ్రీనివాసన్ అన్నాడు. ' వెంగ్‌సర్కార్ వ్యాఖ్యలతో పూర్తిగా విభేదిస్తున్నాను. అవి పూర్తిగా అబద్ధం, ఇతర ఉద్దేశాల ప్రేరేపితం. నాపై కుట్రపూరిత వ్యాఖ్యలు చేసిన వెంగ్‌సర్కార్ పట్ల జాలిగా ఉంది. మాజీ చీఫ్ సెలక్టర్‌గా తన హుందాతనాన్ని విడిచి సర్కార్ ఇలా మాట్లాడిల్సింది కాదు' అని శ్రీనివాసన్ తెలిపాడు. వెంగ్‌సర్కార్ వ్యాఖ్యలు పూర్తిగా తప్పు అని చెప్పడానికి.. ఆ సిరీస్‌లో కోహ్లితో పాటు బద్రీనాథ్ సైతం ఆడాడనే వాస్తవం ఒకటి చాలు. క్రికెటర్‌గా వెంగ్‌సర్కార్‌పై నాకు ఎనలేని గౌరవం ఉంది. అందుకే ఆటగాడిగా, తర్వాతి కాలంలోనూ అతడికి ఎన్నో విషయాల్లో సాయపడ్డాను. అయినా అతడు నాపై ఇటువంటి వ్యాఖ్యలు చేయటం వెనుక అతడి ఉద్దేశం వేరే ఉండి ఉంటుందని శ్రీని ఆరోపించాడు.

సెరెనా శుభారంభం

ఇండియన్ వెల్స్ మాస్టర్స్ టెన్నిస్

ఇండియన్ వెల్స్ : ఏడాదికిపైగా టెన్నిస్‌కు దూరమైన అమెరికా టెన్నిస్ తార సెరెనా విలియమ్స్ ఇండయన్ వెల్స్‌లో శుభారంభం చేసింది. ఇక్కడ తొలిపోరులో జరీనాదియాస్ (కజకిస్థాన్)ను 7-5, 6-3తో మట్టికరిపించింది. గతేడాది ఆస్ట్రేలియా ఓపెన్ విజయం అనంతరం ప్రసవం కోసం టెన్నిస్‌కు 15 నెలల పాటు విరామం తీసుకున్నది. ప్రసవానంతరం తలెత్తిన ఆరోగ్య సమస్యల నుంచి కోలుకున్న సెరెనా ఇండియన్ వెల్స్‌లో బరిలోకి దిగింది. రెండో రౌండ్‌లో సెరెనా.. 29వ సీడ్ కీకీ బెర్టన్స్‌ను ఓడిస్తే తదుపరి పోరులో అక్క వీనస్ విలియమ్స్‌తో తలపడే అవకాశమున్నది.

ఆస్ట్రేలియా 243 ఆలౌట్

పోర్ట్ ఎలిజబెత్ : సఫారీ పేసర్ కగిసో రబాడా (5/96) చెలరేగటంతో దక్షిణాఫ్రికాతో రెండో టెస్టులో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 243 పరుగులకే ఆలౌటైంది. వార్నర్ (63), బాన్‌క్రాఫ్ట్ (38), టిమ్ పైనే (36)లు రాణించారు. దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 39/1తో కొనసాగుతోంది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.